# క్రాంతి

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 44 సంచిక: 1 మార్చ్ - జూలై 2019 వెల: పది రూపాయలు


**లోపలి పేజీల్లో**


| | | |
|---|---|---|
| పుల్వామాలో | ... | 6 |
| వెనిజులా | ... | 9 |
| సిరియా | ... | 13 |
| సుప్రీంకోర్టు తీర్పు | ... | 16 |
| కేంద్రీకృత ప్రజాస్వామ్యం | ... | 20 |
| రిజర్వేషన్ విధానం | ... | 25 |
| డీ.కే. రిపోర్టు | ... | 28 |
| అమరుల సంస్మరణ | ... | 32 |
| పత్రికా ప్రకటన | ... | 47 |


# జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి తిరిగి గద్దెనెక్కిన బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు

బూర్జువా నేతల ఐదు వారాల బూటకపు వాగ్దానాల రణగొణ ధ్వనుల మధ్య 17వ లోక్‌సభకు అట్టహాసంగా సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలేవి ఈ ఎన్నికల్లో పాలక పక్షం చర్చకు రానీయలేదు. డబ్బు, మద్యం పారించి కులం, మతాన్ని రెచ్చగొట్టి, వాటికన్నా కపట జాతీయోన్మాదాన్ని మున్నెన్నటికన్నా రెచ్చగొట్టి దేశప్రజలను ఆవేశకావేశాల్లోకి నెట్టి ఓట్లు వేయించుకున్నారు. ప్రపంచంలో అతి పెద్ద బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ మరోసారి విజయం సాధించిందని బాకాలూదుతున్నారు.

మోడీ నాయకత్వంలో బీ.జే.పీ. మరోసారి కేంద్రంలో అధికారానికొచ్చింది. లోకసభ ఎన్నికలు జరిగిన 542 నియోజకవర్గాలలో 303 స్థానాలలో బీ.జే.పీ. గెలుపొంది, మరో 50 స్థానాలలో మిత్రపక్షాలు (ఎన్.డీ.ఏ.) గెలువడంతో 353 సీట్లతో అది దాదాపు మూడింట రెండు వంతుల మెజారిటీ సంపాదించింది. ఈసారి ఎన్నికల్లో ప్రతిపక్షాలు గతం కన్నా ఘోరంగా దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ స్వంతంగా 52 సీట్లకు కుదేరిల్లిపోయి లోకసభలో కనీసం ప్రతిపక్ష పార్టీ హోదానైనా పొందలేకపోయింది. తన మిత్రపక్షాలతో కూడిన యూ.పీ.ఏ. 90 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఉత్తరప్రదేశ్‌లో మహా గఠ్ బంధన్ 15 స్థానాలకే పరిమితమైంది. ప్రాంతీయ పార్టీలకు, ఇతరులకు 99 సీట్లు వచ్చాయి.

బీ.జే.పీ. కుత్సిత, ఉన్మాద ప్రచార హోరును తట్టుకొని ఒడిశాలో జే.డీ.యూ. (నవీన్ పట్నాయక్), తమిళనాడులో డీ.ఎం.కే., కాంగ్రెస్ గఠ్‌బంధన్, కేరళలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.ఆర్.సీ.పీ., బంగాల్‌లో టీ.ఎం.సీ. (మమతా బెనర్జీ) గట్టిపోటీనిచ్చి అత్యధిక సీట్లు సాధించి బీ.జే.పీ.ని ఖంగు తినిపించాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో బీ.జే.పీ.కి ఒక్క సీటైనా దక్కలేదు. ప్రధానంగా ఉత్తర భారతంలో బీ.జే.పీ. కాంగ్రెస్ ముఖాముఖి పోటీపడిన 186 స్థానాల్లో బీ.జే.పీ. 174 స్థానాలు గెలవగా, కాంగ్రెస్ 15 స్థానాలు మాత్రమే గెలిచింది. దేశంలోని 20 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కనీస ప్రాతినిధ్యాన్నైనా నిలుపుకోలేపోయింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల విధానసభలకూ ఎన్నికలు జరిగాయి. వీటిలో అరుణాచల్‌ప్రదేశ్ బీ.జే.పీ. గెలుపొందగా, తక్కిన రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీలు అధికారాన్ని కైవశం చేసుకున్నాయి.

2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకీ లభించిన అపూర్వ విజయానికి గల కారణాలను చూద్దాం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఐదు సంవత్సరాల పాలనలో అనుసరించిన సామ్రాజ్యవాద అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలతో భారతీయ జనతా పార్టీ రాజకీయ పలుకుబడి క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ ధోరణి 2018 నవంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల విధానసభల ఎన్నికలలో స్పష్టంగా వెల్లడైంది. దానితో గంగవెర్రులెత్తిన బీ.జే.పీ. అనేక ప్రజాకర్షణ చర్యలు చేపట్టింది. అగ్రకులాలకు 10% రిజర్వేషన్‌లు, పౌరసత్వ సవరణ

బిల్లు, ప్రధాన మంత్రి సమ్మాన్ నిధి, అనేక వరాలతో ప్రజాకర్షక మధ్యంతర బడ్జెటు, సుప్రీం కోర్టు వెలువరించిన ఆదివాసుల భూముల బేదఖల్ ఆదేశాలపై స్టే, దేశంలో ఒక కోటీ 32 లక్షల గోండీ ప్రజల మాతృభాషను తన రాష్ట్రంలో రెండవ అధికార భాష చేస్తామని గతంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ఇచ్చిన హామీని గుర్తు చేయడం లాంటి అనేక ఎత్తులు వేసింది. పారదర్శకత, జవాబుదారీ తనంలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన దేశ అత్యున్నత సంస్థలు సీ.బీ.ఐ., ఈడీ, ఐటీ, న్యాయవ్యవస్థలను కేంద్రం తన చెప్పుచేతల్లోకి తీసుకుని తన జేబు సంస్థలుగా మార్చుకోవడం, తనకు అనుకూలం కాని రాష్ట్రాలపై, రాజకీయ నాయకులపై వాటిని పాశుపతాస్త్రంగా ప్రయోగించి ఆ రాష్ట్రాల పాలకులను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకునేందుకు దాడులకు దిగింది. మరోవైపు బీ.జే.పీ. అధ్యక్షుడు అమిత్‌షా మూడవ పానిపత్ యుద్ధం జరుగుతుందనీ భాష్యం చెప్పాడు. అయినప్పటికీ, అవేవీ ఎన్నికలలో తిరిగి తగిన మెజార్టీతో తాము అధికారానికి రాగలమన్న పూర్తి విశ్వాసాన్ని వారిలో కలిగించలేకపోయాయి.

దేశంలో సార్వత్రిక ఎన్నికల సమయం సమీపించి అన్ని రాజకీయ పార్టీలు అందుకు నడుములు బిగిస్తున్న సమయంలో నాటకీయంగా పుల్వామా ఘటన జరిగింది. సీ.ఆర్.పీ. జవాన్‌ల నెత్తురుతో తడిసిన నేల లోకసభ ఎన్నికలకు నారుమడిలా బీ.జే.పీ.కి అంది వచ్చింది. తదనంతర పరిణామాలు శరవేగంగా బీ.జే.పీ. ఎన్నికల వ్యూహం ప్రకారమే జరిగిపోయాయి. పుల్వామా ఘటనకు ప్రతీకారంగా అంటూ భారత ప్రభుత్వం పాకిస్తాన్‌లోని బాలాకోట్‌పై ఎయిర్ స్ట్రయిక్‌కు బరితెగించింది. అక్కడ జరుగని నష్టాలను జరిగినట్లుగా వక్రీకరించి పాకిస్తాన్ వ్యతిరేక ప్రచార దుమారాన్ని భారత మీడియా అవాకులు చవాకులతో గుప్పిచ్చింది. వింగ్ కమాండర్ అభినందన్ యుద్ధఖైదీగా పాకిస్తాన్‌కు పట్టుబడడం, నాటకీయంగా విడుదలవడం, సరిగ్గా ఎన్నికల వేడిలో చైనా తన వైఖరిని మార్చుకొని మసూద్ అజ్‌హర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చడానికి ఐక్య రాజ్య సమితిలో అడ్డు చెప్పకపోవడం లాంటివి మోదీ ఎన్నికల పంటకు ఎరువులా మారాయి. ఇవన్నీ తామూహించినట్టే దేశంలో పెద్దపెట్టున బీ.జే.పీకి అనుకూలమైన ఓట్ల రాజకీయ వాతావరణాన్ని సృష్టించాయి.

'మోదీ చేతిలో ఉంటేనే దేశానికి రక్షణ' లభిస్తుందనీ మోదీ కాబట్టే మరో సర్జికల్ స్ట్రయిక్ సాధ్యమైందనీ పాకిస్తాన్‌కు తగిన బుద్ధిచెప్పామనీ 'సంకీర్ణం కాకుండా బలమైన కేంద్ర ప్రభుత్వం' కావాలనీ 'భారత సేనా మోదీ సేనా' అంటూ భారతీయ జనతా పార్టీ ఉగ్ర ప్రచారాన్ని కొనసాగించింది. పాకిస్తాన్ వ్యతిరేక కుటిల జాతీయోన్మాదంతో దేశవ్యాప్తంగా ప్రజలను కశ్మీర్ వ్యతిరేక ప్రదర్శనలకూ కశ్మీరీయులపై దాడులకూ హిందుత్వ కార్డుతో ప్రజలను తెగ రెచ్చగొట్టింది. దేశంలో చెలరేగిన ఈ జాతీయోన్మాద (జింగోయిజం)దుమారం ముందు ప్రతిపక్షాలు దివాళాకోరు వైఖరులను చేపట్టి ప్రచారంలో చతికిలపడిపోయాయి. మోదీ–షా–దోభాల్‌లు అత్యంత చాకచక్యంతో ముందుకు తెచ్చిన ఎన్నికల అనుకూల పవనాలను లక్షలాది ఆర్ఎస్ఎస్, భాజపా కార్యకర్తలు మత విద్వేష హిందుత్వ రంగు పులిమి దేశవ్యాప్తంగా ముమ్మర ప్రచారాన్ని నిర్వహించాయి. దీని ప్రభావం ప్రధానంగా ఉత్తర, పశ్చిమ, మధ్య భారతంలో (ఒక్క పంజాబు మినహా) చాల గాఢంగా ప్రజలపై పడింది. కారణాలేమైనప్పటికీ, దక్షిణ భారతదేశంలో మాత్రం వారి ప్రచారం తుస్సుమంది. అక్కడ వారు అతి కొద్ది సీట్లు మాత్రమే గెలువగలిగారు. తూర్పు భారతదేశంలో (ముఖ్యంగా పశ్చిమ బంగ, ఒడిశా) ఈశాన్య భారతంలో వారు 2014 తర్వాతి నుండి అనుసరిస్తున్న కుట్ర రాజకీయాలు వారికి లబ్ధి చేకూర్చాయి. మొత్తంపై ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పశ్చిమ బంగలో తృణమూల్ కాంగ్రెసు, ఒడిశాలో బీజూ జనతాదల్ గట్టి పోటీనిచ్చాయి.

ఎన్నికల ప్రచారంలో మోదీ అలుపూ సొలుపూ లేకుండా బాలకోట్ ఎయిర్ స్ట్రయిక్ ప్రచారాన్ని నిర్వహించడం, బాలకోట్ దాడి నిర్వహించిన వారికే ఓటు వేయాలని కోరడం, భారతీయ జనతా పార్టీ దేశ ప్రజల్లో జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టడం మినహ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి దాని వద్ద మరే ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. వీధి గూండాలు సిగ్గుపడే స్థాయికి దిగజారి దేశ ప్రధాని సహ రాజకీయ నాయకులంతా వ్యక్తిగత దూషణలకు దిగడం మోదీ ఎన్నికల పర్వంలో ఒక హేయమైన ప్రచార కళగానే రంగం మీదికి వచ్చింది. నిజానికి ప్రతిపక్షాలు లేవనెత్తిన అనేక ప్రజా సమస్యలు పెద్ద నోట్ల రద్దుతో ప్రజా జీవితాలలో ఎదురైన తీవ్ర సమస్యలు, జీఎస్టీ వేటు, అధిక ధరలు, అవినీతిమయ రాఫెల్ జెట్ డీల్, రైతాంగ జీవన్మరణ సమస్యలు, విద్యా, వైద్యం, నిరుద్యోగం సహ అన్ని ప్రజా సమస్యలు మోదీ–షాలు సృష్టించిన జాతీయోన్మాదం, ఉగ్ర హిందుత్వ రాజకీయాల ముందు వెలాతెలా పోయినవి.

ఈ ఎన్నికల్లో ఒకవైపు ఎన్డీఏ, మరోవైపు యూ.పీ.ఏ, దేశంలోని ఉత్తరప్రదేశ్‌లోని మహా గఠ్‌బంధన్ సహ వేరు వేరు రాష్ట్రాలలో పలు ప్రాంతీయ పార్టీలు దానితో పోటీపడ్డాయి. ఎన్నికలకు ముందు 22 ప్రతిపక్షపార్టీలు కలిసి మహా ఆర్భాటంగా 'మోదీ హఠావో' అనే నినాదం తీసుకొన్నప్పటికీ అవి ఒకే వేదిక మీది నుండి సమైక్యంగా బీ.జే.పీ.దుష్ట హిందుత్వ విధానాలకూ అది సృష్టించిన జాతీయోన్మాదానికీ కొలకతాలో ఈశ్వర చంద్ర విద్యాసాగర్ లాంటి సంఘ సంస్కర్తల విగ్రహాలను కూల్చడానికైనా

వ్యతిరేకంగా కనీసం పోరాడకపోవడంతో పాటు అనేక కుమ్ములాటలతో అవి తమ మధ్య తామే ఓట్లు చీల్చుకున్న ఫలితంగా అంతిమంగా బీ.జే.పీ.కే లబ్ధి చేకూరింది.

భారతీయ జనతా పార్టీ అధినాయకుడిగా ముందుకు వచ్చిన మోదీకి వున్నటువంటి ప్రజాకర్షణ నేడు దేశంలోని ప్రతిపక్షాల్లో ఏ నాయకుడికీ లేకపోవడంతో మోదీ విష ప్రచారానికి ప్రజలు మోసపోక తప్పలేదు. బీ.జే.పీ.లో ఏకైక కరిష్మాగా తన్నుకొచ్చిన డిక్టేటర్ మోదీ తాను హాజరైన ప్రతి ఎన్నికల సభలో 'కమలానికి ఓటువేస్తే ఆ ఓటు మోదీకే వెలుతుందనీ' సోదర పార్టీ అభ్యర్థులను పదేపదే అవమానిస్తూ జనం నాడీ ఎరిగిన ఆ 'బాహుబలి' చేసిన విషప్రచారం ఓట్లు దండుకోవడానికి మాత్రం వారందరికీ రామబాణంలా పనిచేసింది. నిజానికి దీనిని వారి 'ఒకే జాతి–ఒకే నాయకుడు' అనే ఫాసిస్టు సిద్ధాంతంలో భాగంగానే చూడాలి. కాంగ్రెసుతో సహా యావత్ ప్రతిపక్షాల అధినాయకులలో ఏ ఒక్కరూ మోదీ ధాటిని తట్టుకోలేకపోయారు. ఈ రకం ప్రచారంపై 'ది హిందూ' పత్రికకు సంబంధించిన 'లోక్‌నీతీ' బృందం చేసిన సర్వేలో 'అధ్యక్ష తరహాలో సాగుతున్న దేశ ఎన్నికల ప్రచారంలో వ్యక్తి నాయకత్వం కేంద్రస్థానంలోకి వచ్చింద'ని చెప్పింది. మోదీ గెలుపుకు దారి తీసిన ప్రధాన కారణాలలో దేశంలోని బలహీనమైన ప్రతిపక్షాలకు పెద్ద పీట వేయాల్సి ఉంటుంది. నిజానికి మన దేశంలో 1952 నుండి ఇప్పటివరకూ బలమైన ప్రతిపక్షాలంటూ ఎన్నడూ లేవన్నది వాస్తవం. నానాటికి నిర్మాణ బలాన్ని కోల్పోతున్న కాంగ్రెస్, వరుసగా ఎన్నికలలో బలహీనపడుతూ చట్టసభలలో కనుమరుగవుతున్న దివాళాకోరు వామపక్షాలు, గతంలో ఎత్తిపట్టిన జాతుల ఆకాంక్షలనూ ఫెడరల్ భావననూ ఏనాటికానాడు కేంద్రంలోని పాలకముఠా అనుగ్రహం కోసం పెంపర్లాడుతూ భూస్థాపితం చేస్తున్న ప్రాంతీయ పార్టీలు పైకి ఎంత మోదీ వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నా అంతిమంగా అవీ అనుసరించే ఆర్థిక, రాజకీయ విధానాలు అవే కాబట్టి ఓటర్లను ఆకర్షించడానికి వాటి వద్ద ప్రత్యామ్నాయ విధానాలేమీ లేవు. పోతే, మన భారతదేశం కులాధారిత సమాజం కాబట్టి ఎన్నికలు సహా ఏ సందర్భంలోనైనా ఇక్కడ మతం, కులం, తెగలు సహజంగానే వాటి వాటి ప్రాధాన్యతను సంతరించుకుంటుంటాయి. ఈసారి జరిగిన లోకసభ ఎన్నికలు సైతం అందుకు ఏమాత్రం అతీతం కాకుండా పోయాయి. అది అన్ని రాష్ట్రాల్లో కుల సమీకరణలలో ముందుండడమే కాకుండా హిందువుల ఓట్లను దండుకోవడానికి బీ.జే.పీ ఏ ఒక్క ముస్లిం అభ్యర్థిని 2014లో లాగే ఈసారి కూడా ఎన్నికల బరిలోకి దింపలేదు.

'గణతంత్ర' భారతం ఏర్పడడానికి ముందే ఉనికిలోకి వచ్చిన ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే దేశంలో 16 సార్వత్రిక ఎన్నికలు, 375 దాకా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఎంతో ఉన్నప్పటికీ అది దానికి రాజ్యాంగబద్ధంగా దఖలుపడిన ఓటర్ల జాబితాల సక్రమ కూర్పు విధి నిర్వహణలో పదేపదే విఫలమవుతోంది. ప్రతి వెయ్యి జనాభాకు ఓటర్ల జాతీయ సగటు 689 ఉండగా అది కొన్నిచోట్ల వెయ్యికి మించిపోవడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని క్రూరంగా పరిహసిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా కీర్తించబడే భారత్ పోకడ ఇది కాగా, అత్యంత ప్రాచీన జనస్వామ్య దేశంగా ఘనత వహించిన అమెరికాలో దాదాపు మూడోవంతు మంది అసలు ఓటర్లుగానే నమోదు కాని విధ్వారం దాని 'ప్రతిష్ఠకు' తూట్లు పొడుస్తోంది. ఎన్నికల కమిషన్ ఎంత ఊదరగొట్టినప్పటికి, ఎన్ని కసరత్తులు చేసినప్పటికీ దేశంలోని మూడింట ఒక వంతు ఓటర్లు పార్లమెంటు డొల్ల ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొననేలేదు. ఇక దేశంలోని నగరాలు, మహా నగరాల ఓటింగ్ సరళీ ఈసారి మరీ తగ్గిపోయింది. దేశంలో పోలైన 70% ఓట్లలో కేవలం 41% ఓట్లు మాత్రమే భాజపాకు పోలవగా, ఆ మైనార్టీ ఓట్లతో గద్దెనెక్కినవాడే డిక్టేటర్ మోదీ అన్నది మర్చిపోకూడదు. కాబట్టి ఇదెంతటి ఘనమైన ప్రజాస్వామ్యమో ఎవరికైనా సులబంగానే అర్థమవుతుంది.

17వ లోకసభ ఎన్నికలు నిర్వహించిన మన దేశ ఎన్నికల కమిషన్ పాత్ర పూర్తిగా అధికార పక్షానికి తొత్తుగా మారిందనే భౌతిక వాస్తవికతను లోకం కోడై కూసింది. అది తుదకు పశ్చిమ బంగాలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఆరోపణలపై ఒక రోజు ముందే ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయడం వరకు అధికార దుర్వినియోగానికి పాల్పడి అది దాని శక్తి కొలది బీ.జే.పీ గెలుపుకు దోహదం చేసింది. వాస్తవానికి ఒక్క ఎన్నికల కమిషన్ అనే కాకుండా అక్షరాలా భారత రాష్ట్రపతి సహా యావత్ అధికార యంత్రాంగమంతా మోదిత్వ శక్తుల గెలుపుకు చాలావరకూ నడుం బిగించాయి. మున్నెన్నడూ లేని విధంగా సైన్యాన్ని రాజకీయం చేస్తున్నారనీ అది తగదనీ 156మంది విశ్రాంత సైనిక ఉన్నతాధికారులతో కూడిన లబ్ధ ప్రతిష్టుల బృందం ముందుకు వచ్చి రాష్ట్రపతికి మొర పెట్టకున్నా మోదీకి ఎవరూ కళ్లెం వేయలేకపోయారు. మోదీ లోకసభ ఎన్నికల ప్రచార సమయంలో నిరంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ బాలకోట్ దాడినీ, భారత సైన్యాలూ దేశం తన చేతులలోనే సురక్షితం అనే విధంగా 'మోదీ హైతో ముమ్కిన్ హై' అనే వాతావరణాన్ని సృష్టిస్తూ ఎన్ని అనర్గల ఉపన్యాసాలు చేసినా ఎన్నికల కమిషన్ మిన్నకుండింది. ఎన్నికల కమిషన్ పక్షపాతపూరిత వైఖరి నిత్యం వెల్లడైంది. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ దేశాలలో ఈవీఎంల కన్నా బ్యాలట్ పెట్టెలకే విశ్వసనీయత అధికం. అధికార యంత్రాంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న పాలకపక్షం ఈవీఎంల

ద్వారా అనేక అవకతవకలకు, మోసాలకూ పాల్పడే అవకాశం ఉందనీ వీవీప్యాట్(ఓటు ధృవీకరణ యంత్రం-ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయల్)లను ఐదుకు మించి సమకూర్చాలనీ విపక్షాలు ఎంత మొర పెట్టుకున్నా దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆలకించలేదు.

మోదీ ఎన్నికల విజయంలో బలహీనమైన ప్రతిపక్షాల పాత్రతో పాటు అతి శక్తిమంతమైన భారత కార్పోరేటు వర్గం పాత్ర కూడా ఎంతో కీలకమైన పాత్ర పోషించింది. ఆ వర్గాలు మోదీనే మళ్లీ కోరుకొని కాసుల వర్షాన్ని కురిపించాయి. ఒక్క అమేథీ నియోజకవర్గంలో స్మృతి ఇరానీ గెలుపు కోసం ఆ పార్టీ రూ.500 కోట్లు ఖర్చు చేసి రూ.150 కోట్లు ఖర్చు చేసిన రాహుల్ గాంధీని తలదన్ని ఓడించగలిగారనీ మీడియా అనేక కథనాలను వెలుగులోకి తెచ్చింది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికల ప్రచార సమయంలో పోలీసులు దాడులు జరిపి స్వాధీనపర్చుకున్న నగలు, ఆభరణాలు, మద్యం విలువే వేల కోట్ల రూపాయిలలో ఉండిందంటే పట్టుబడని మొత్తాలు ప్రజాస్వామ్య ఓట్ల మార్కెట్లో ఎంత ప్రవహించి ఉంటాయో అనూహ్యం! లోకసభకు పోటీ చేసి గెలిచిన వారిలో శతాధిక కోటీశ్వరులే అధికం. అందులో చట్టసభల గురించి, చట్టం గురించి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి ఓనమాలు తెలియని వారి సంఖ్య గణనీయంగానే ఉంటుంది. అలాంటి వారితో ఈ దేశం పాలన ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు!

భా.జ.పాను గెలిపించడంలో బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం కూడా ఒక ముఖ్యమైన కారకంగా పని చేసింది. మోదీ-షాల జోడీ గతంలో గుజరాత్ ఎన్నికలలో పాకిస్థాన్ వ్యతిరేక పాచిక విసిరి ఓట్లు దండుకున్న అనుభవం వారికుంది. కాబట్టి ఆ ప్రయోగాన్ని లోకసభ ఎన్నికలకూ విస్తరించారు. అందుకు లక్షలాది రాష్ట్రీయ స్వయం సేవకులతో పాటు ప్రత్యేకించి మహిళల ఓట్లు రాబట్టడానికి రాష్ట్ర సేవికా సమితి, ఆదివాసులను ఆకర్షించడానికి వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం మొదలైనవి ఏ సెక్షన్ ప్రజలను ఆకర్షించడానికి ఆ సముదాయంలోని సంఘాన్ని సంఘ్ పరివార్ ప్రచార రంగంలోకి దింపింది. సనాతన హిందూ సంస్థలాంటి ఉగ్ర మతోన్మాద సంస్థలు, గో రక్షకులు ఎక్కడికక్కడే ఓట్లు రాబట్టడానికి చతురోపాయాలతో రంగంలోకి దిగారు. ఎప్పుడూ అందివచ్చే రాంమందిర్ గత 27 ఏళ్లుగా వారి ఎన్నికల మానిఫెస్టోలో కిందో, మీదో ఉండి తీరాల్సిందే! మొత్తానికే లేకుండా దానిని వారెన్నటికీ వదులుకోరు. ముస్లింల పట్లా ద్వేషాన్ని రెచ్చగొట్టడం వాటన్నిటి ఏకైక ఏజండా! కమ్యూనిస్టు విప్లవకారులను భావజాలపరంగానే అడ్డుకోవడం వాటన్నింటికీ వారి మాతృ సంస్థ నరనరాన నూరిపోస్తుంది. 2014నాటి ఎన్నికల నుండి ఈ అంశాలు దూకుడుగా ముందుకు వస్తుండగా, 2019 ఎన్నికల్లో మరింత ఉగ్ర రూపం దాల్చాయి.

ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పీ, బీఎస్పీ, ఆర్.ఎల్.డీ లు కలిసి ఏర్పాటు చేసిన మహా కూటమి (మహా గఠ్‌బంధన్)తో బీ.జే.పీ ఆ రాష్ట్రంలో సగానికి పైగా సీట్లు కోల్పోతుందని అందరూ ఊహించారు. సార్వత్రిక ఎన్నికల ముందు గోరఖ్‌పూర్, ఫూల్‌పురిలలో జరిగిన ఉపఎన్నికల్లో మహా కూటమి ప్రయోగం సత్ఫలితాలు ఇవ్వడంతో లోకసభ సమయంలో కూడా గఠ్‌బంధన్ గెలుస్తుందని అందరూ చెప్పుకున్నారు. కానీ చివరకు భా.జ.పా. ఎత్తుల ముందు అందరి అంచనాలు చిత్తయాయి. పశ్చిమ బంగలో తాను బలపడాలని భాజపా గత ఐదేళ్లుగా సాయుధ ఘర్షణలు సహా చేయని దుష్కార్యం లేదు. దేశంలోని ఇతర ప్రాంతాలలో నష్టపోయె సీట్లను ఈశాన్యంలో గెలుపొందాలనీ భా.జ.పా. గత నాలుగేళ్లుగా ఒక పథకం ప్రకారమే పని చేస్తూ వచ్చి ఈ ఎన్నికలలో అనుకున్న ఫలితాలు చాలా వరకు సాధించింది.

నరేంద్రమోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ఐదేళ్లలో వరుసగా జీ.డీ.పీ.అభివృద్ధి రేటు తగ్గుతూ వచ్చిందే తప్ప ఎన్నడూ 8% మించలేదు. మున్నెన్నడూ లేని స్థాయికి నిరుద్యోగం 6.5%పెరిగింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీతో ప్రజలపై ఆర్థిక పెనుభారం పడింది. ఆత్మహత్యలతో జీవితాలు కడతేర్చుకుంటున్న రైతాంగం జీవితాలలో రెట్టింపు ఆదాయాన్ని సమకూరుస్తానని కల్లబొల్లి మాటలు చెప్పిన మోదీ హయాంలో వారి దుస్థితి మరింత హీనంగా దిగజారడంతో వారు నూతన తరహా ప్రజా ఆందోళనలకు పూనుకున్నారు. వ్యవసాయోత్పత్తి అభివృద్ధి రేటు 1.5%కి చేరి 20 యేండ్ల కిందికి దిగజారింది. స్విస్ బ్యాంకులలో కూడబెట్టుకున్న 90 లక్షల కోట్ల దోపిడీ సొమ్ము వెనక్కి తెచ్చి తలా రూ.15 లక్షలు బ్యాంకు ఖాతాలలో గుమ్మరిస్తాననడం ఎంతటి దగుల్బాజీ మాటలో తేలిపోయింది. గుజరాత్ నమూనా ఫెయిలైపోయింది. దశాబ్దాలుగా పోరాడి కార్మికులు సాధించుకున్న హక్కులను 'శ్రమేవజేయతే' అంటూనే ఛాయ్‌వాలా మోదీ హననం చేశాడు. లక్షలాది చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ తాకిడితో కోలుకోలేకుండా దెబ్బతిన్నాయి. సామ్రాజ్యవాదులకు దేశాన్ని బార్లా తెరిచి ప్రభుత్వరంగ పరిశ్రమల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వందశాతం ఆహ్వానించారు. ఎగుమతులు దెబ్బతిన్నాయి. పారిశ్రామికోత్పత్తి సూచి 2.5%కి కునారిల్లింది. రూపాయి, డాలరు మారకంతో 72 రూపాయలకు పైగా పడిపోయింది. బీ.జే.పీ. ప్రభుత్వం దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల మూడున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా బ్యాంకు ఋణాలను 'నిరర్థక' ఆస్తులుగా లెక్కగట్టి మాఫీ చేసి, ఆ భారాన్ని అంతా పేద ప్రజలపై మోపుతున్నది.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఎంతో అధ్వాన్నంగా తయారైంది. రాష్ట్రాల అప్పులు 2019 మార్చి చివరినాటికి 45 లక్షల కోట్లకు చేరింది. ఎన్డీఏ 58 నెలల పాలనలో సగటున నెలకు 72 వేల 112 కోట్ల అప్పులతో ఐదేండ్లలో కేంద్రం 41 లక్షల 82 వేల 516 కోట్ల దేశీయ అప్పులు చేసింది. 2019 నాటికి ద్రవ్య లోటు 5 లక్షల 14,320కోట్లకు పెరిగింది. బీ.జే.పీ అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ రాజకీయాలతో సనాతన హిందుత్వసంస్థలు మైనారిటీలపై, దళితులపై, ఆదివాసులపై అమానవీయ దాడులకు, మాబ్ లించింగ్‌లకూ పాల్పడుతున్నవి. భారత ప్రభుత్వంతో విడిపోయె హక్కుతో సహ తమ స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న అన్ని జాతులపై కేంద్రం పాశవిక హింసాకాండను కొనసాగిస్తున్నది. ముఖ్యంగా కశ్మీరీయులకు భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 370తో పాటు 35ఏ రద్దు చేసి తీరుతామని భాజపా నాయకులు ఘంటాపథంగా చాటిస్తున్నారు. సెక్యులర్, ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులపై దాడులు పెచ్చరిల్లాయి. 'అర్బన్ నక్సల్స్' పేరిట పదుల సంఖ్యలో లబ్ద ప్రతిష్ట మేధావులను, ప్రజాస్వామిక శక్తులను జైళ్లల్లో నిర్బంధించారు. దేశంలో భావజాలపరంగానే ఒకవైపు వామపక్ష ముఖ్యంగా విప్లవ కమ్యునిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా మరోవైపు పాకిస్తాన్ వ్యతిరేకతను, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొడుతూ విషపూరిత ఫాసిస్టు హిందుత్వ రాజకీయాలకు, విధానాలకు. బోధనలకు పట్టం కడుతున్నారు.

ఇప్పటికే దేశం మోదీ మొదటి విడత పాలనలో పైన పేర్కొన్న సమస్యలతో సతమతమవగా, ఇక పెరిగిన ఓట్ల బలంతో రెండవ విడత పాలనలో నిస్సందేహంగా మోదీ మరింత బరితెగిస్తాడు. సామ్రాజ్యవాదుల, భారత దళారీ బడా బూర్జువాల దోపిడీకి దేశాన్ని దాసోహం చేస్తాడు. దేశ ప్రధానిగా మోదీ, దేశీయ వ్యవహారాల మంత్రిగా అమిత్ షాల జోడీ, సవర్ణల ఆధిపత్యంతో ఏర్పడిన మంత్రిమండలి దేశంలో ఫాసిస్టు పాలనను కొనసాగిస్తూ ప్రశ్నించే, ప్రతిఘటించే శక్తులను, ధిక్కార స్వరాలను ఉక్కు పాదంతో అణచివేయ పూనుకుంటుంది. బాబా సాహెబ్ అంటూ అంబేడ్కర్‌ను మున్నెన్నడూ లేని విధంగా ఆకాశానికి ఎత్తుతూ, ఆయన అధ్యక్షతన రూపొందిన భారత రాజ్యాంగాన్ని అడ్డు పెట్టుకొని తమ కౌటిల్య రాజకీయాలతో, హింసోన్మాదంతో దళితులను, పీడితులను, వంచితులను బ్రాహ్మణవాద శక్తులు మరింత మోసగిస్తాయి. దేశంలో ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న భారత విప్లవోద్యమాన్ని తుదముట్టించడానికి ముందుకు తెచ్చిన నూతన సైనిక వ్యూహం 'సమాధాన్' పథకాన్ని మరింత దూకుడుగా అమలు చేయడంలో భాగంగా ప్రజలపై ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, మత మైనార్టీలు సహ సమస్త పీడిత ప్రజారాశులపై తమ ఫాసిస్టు అణచివేతను తీవ్రం చేసి తీరుతారు. 'నూతన భారతం' పేరిట హిందూ 'రాష్ట్ర' నిర్మాణానికి నడుం బిగించిన హిందుత్వ శక్తులు ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్; ఒకే జాతీ-ఒకే ఓటు; ఒకే జాతీ-ఒకే పన్ను విధానాలను ముందుకు తేవడం వెనుక దేశంలోని భిన్న జాతులను, విభిన్న సంస్కృతులను, భాషలను, ఆచార, వ్యవహార, సంప్రదాయాలను, కాస్తో కూస్తో ఉన్నాయనుకునే ఫెడరల్ విధానాలను తుంగలో తొక్కుతూ కల్పిత భారత జాతిని మరింత ప్రతిష్టింప చేయడమే వారి చాణక్య నీతికి నిదర్శనం. అందుకు ఆ శక్తులు ఒక దీర్ఘకాల పథకం ప్రకారమే అవసరమైన రాజ్యాంగ సవరణలను చేపడుతున్నాయి. 17వ లోకసభ ఫలితాలతో పెరిగిన బలాన్ని ఆ దిశలో మరింత దుర్మార్గంగా వినియోగిస్తారు. 'గో రక్షణ' పేరిట సనాతన హిందూ మూకల మూకదాడులు పెరుగుతాయి. ఇప్పటికే దేశంలో అలాంటి దాడులు మొదలయ్యాయి కూడా! మోదీ 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్'కు ఇపుడు 'సబ్‌కా విశ్వాస్' అంటూ జోడించి సామ్రాజ్యవాదులకు మరింత విశ్వాసంతో సేవలు చేయడానికే తన రెండవ విడత పాలనను పూర్తిగా అంకితం చేస్తాడనీ నిస్సంకోచంగా చెప్పవచ్చు.

దేశంలో హిందుత్వ రాజకీయాలు వేగంగా బలం పుంజుకుంటున్నాయి. బీ.జే.పీ. సహ పదుల సంఖ్యలోని ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంస్థలు దేశవ్యాప్తంగా ముమ్మర హిందుత్వ ప్రచారాన్ని కొనసాగిస్తూ మెజార్టీ అహంకారంతో ప్రజలలో 'నిఖార్సయిన' విభజన తేవడానికి 'శకుని' ఎత్తులతో పూనుకుంటున్నాయి.కాలం చెల్లిన బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని ఓడించడానికి జాతీయ, దేశభక్త, ప్రజాస్వామిక, లౌకిక వ్యక్తులు, శక్తులు, సంస్థలు, సమైక్యం కావాలి. దేశంలో సామ్రాజ్యవాదుల దోపిడీని వారితో అంటకాగుతున్న దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలను, వారి కాలం చెల్లిన బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని ఓడించి నూతన ప్రజాతంత్ర విప్లవ విజయం కోసం దృఢంగా పోరాడుతున్న విప్లవ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని కాపాడుకోవాలి. దానిని మరింత సంఘటితం చేసుకోవాలి. పీడిత ప్రజల పోరాట సాధనం పీ.ఎల్.జీ.ఏ.ను గతం కన్నా పటిష్టం చేసుకుంటూ విప్లవోద్యమానికి, ప్రజలకూ బలమైన ఆయుధంగా దానిని నిలబెట్టాలి. దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారిన హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడడం, దాన్ని సమాధి చేయడం ద్వారానే ప్రజలకు రాజకీయంగా నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం ఆర్థికంగా స్వావలంబనం లభించి అంతిమంగా దోపిడీ నుండి విముక్తి బాట సుగమం అవుతుంది.

○

# పుల్వామాలో సీ.ఆర్.పీ.ఎఫ్. జవాన్‌ల మరణానికి, తర్వాత కశ్మీరీలపై దాడులకు భారత ప్రభుత్వమే బాధ్యత పడాలి.

ఫిబ్రవరి 14న కశ్మీర్‌లోని అవంతిపురా దగ్గర సీఆర్‌పీఎఫ్ వాహనశ్రేణి మీద పేలుడు పదార్థాలు నిండిన వాహనంతో ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు దాడి చేసి, నలభైకి పైగా జవాన్లను చంపివేయడం, ఆ తర్వాత పన్నెండు రోజులకు సరిహద్దు అవతలి గ్రామం మీద భారత వైమానిక దళం చేసిన దాడి తర్వాత దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైనిక అనుకూల, యుద్ధ అనుకూల, పాకిస్థాన్ వ్యతిరేక ప్రదర్శనలు, మొత్తంగా పెరుగుతున్న యుద్ధోన్మాదం వంటి గొలుసుకట్టు పరిణామాలను పరిశీలిస్తే ఈ పరిణామాలతో లాభపడనున్నదెవరో స్పష్టంగానే కనబడుతున్నది. ఈ ఘర్షణ వాతావరణం తమ ఎన్నికల ఫలితాలను సానుకూలంగా ప్రభావితం చేస్తుందని స్వయంగా భారతీయ జనతా పార్టీ నాయకులెందరో ప్రకటిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దాన్ని వక్రీకరించి దాని ద్వారా యుద్ధోన్మాదాన్నీ, కుహనా దేశభక్తినీ రెచ్చగొట్టి వోట్లుగా మార్చుకోవడానికి ప్రయత్నించింది. బాధ్యతా రహితంగా పచ్చి అబద్ధాలు, అతిశయోక్తులు ప్రచారం చేస్తున్నది.

స్వతంత్ర దేశంగా ఉన్న కశ్మీర్ ప్రాంతాన్ని భారత ప్రభుత్వం విలీనం చేసుకుంది. ఆ విలీనం ఒక ప్రత్యేక పరిస్థితిలో జరుగుతున్నది కనుక పరిస్థితి కుదుటపడగానే జనాభిప్రాయసేకరణ జరిపి ప్రజలు ఏది కోరుకుంటే అది అమలు చేస్తామని వాగ్దానం చేసి, ఏడు దశాబ్దాలుగా ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోకుండా కశ్మీరీల నేలను ఆక్రమించి సైనిక పాలన సాగిస్తున్నది.

మూడు యుద్ధాలలో దొరికినంత భాగాన్ని ఆక్రమించుకుని తిష్టవేసి కూచున్నది పాకిస్థాన్. రెండు ప్రభుత్వాలు కశ్మీరీ ప్రజల స్వాతంత్ర్యాకాంక్షను అణచివేయడానికి, పక్కదారి పట్టించడానికి హింసనూ, తీవ్రవాదాన్నీ, జాతిహననాన్నీ సాగిస్తున్నాయి. కశ్మీర్‌లో భయభీతావహ వాతావరణాన్ని నెలకొల్పాయి. స్థానిక ప్రజల ప్రాథమిక హక్కులపై ఉక్కుపాదంతో అణచివేశాయి. ఐక్యరాజ్య సమితితో సహా అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నాయి. ఒక్క పుల్వామా ఘటన మీద మాత్రమే కాదు, ఏడు దశాబ్దాలుగా సాగుతున్న చరిత్రను నిష్పాక్షికంగా సమీక్షించవలసి ఉన్నది. న్యాయాన్యాయాలు, నిజానిజాలు, చరిత్ర, ప్రజల ఆకాంక్షలు ఈ సమీక్షకు పునాది కావాలి.

1989 నుండి కశ్మీర్ సమస్యపై ప్రజాపోరు ఉధృతమైంది. గడచిన మూడు దశాబ్దాల కాలంలో దాదాపు లక్ష మంది ప్రజలను, ఉద్యమకారులను భారత సైన్యాలు బలిగొన్నాయి. ఆ చిన్న భూభాగంలో దాదాపు ఏడు లక్షల సైనిక, అర్ధసైనిక బలగాలను భారత ప్రభుత్వం మోహరించి దేశంలోనే అత్యంత పెద్ద సైనిక శిబిరంగా మలిచింది. కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారాన్ని చేపట్టిన తర్వాత జమ్మూ-కశ్మీర్‌లో తాము బలపడడానికి పీ.డీ.పీ.తో కలిసి (పీడీపీ- బీజేపీ) కూటమి ప్రభుత్వాన్ని కొంతకాలం నడిపి కశ్మీర్ పోరాట మంటలను మరింత ఎగదోసాయి. అక్కడ బలపడడానికి కట్టిన కూటమి అవసరం తీరాక బీజేపీ ముఫ్తీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది.

కేంద్రం అప్రజాస్వామికంగా రాష్ట్రపతి పాలనను విధించి కశ్మీర్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడింది. కశ్మీర్ ప్రజల పట్ల అది 'ఆలవుట్ వార్' విధానాలను చేపట్టి అక్కడి ప్రజా ఉద్యమంపై పాశవిక నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. అక్కడి ప్రజా నాయకులను నిరంతరం గృహ నిర్బంధం పాలు చేస్తూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని అక్కడ మచ్చుకైన అమలు చేయకుండా కేంద్రమే అన్నీ శాసిస్తోంది. గతంలో ఏ ప్రధానీ, దేశీయ వ్యవహారాల మంత్రి పర్యటించని విధంగా కశ్మీర్‌ను మోదీ, రాజనాథ్‌సింగ్‌లు పర్యటిస్తూ సంపూర్ణంగా నియంత్రిస్తున్నారు. 2017లో 450 మందిని, 2018లో 250 మంది యువకులను భారత భద్రతా బలగాలు బలిగొన్నాయి. ఎదురుకాల్పుల పేరుతో ప్రజలను చంపడం పరిపాటైంది. 2016 మార్చ్ నుండి 2017 అగస్టు మధ్య 1059 మంది రాజకీయ కార్యకర్తలను '1978 జమ్మూ-కశ్మీర్ ప్రజా రక్షణ చట్టం' కింద అరెస్టు చేసి కశ్మీర్ లోయను జైలుగా మార్చింది. ఢిల్లీ లోని తీహార్ జైలులో కూడా కశ్మీర్ ఖైదీలపై దాడులు జరుగుతున్నాయి. అక్కడి యువత, ప్రత్యేకించి విద్యార్థులపై దేశ వ్యా2ప్తంగా ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో కక్షపూరిత దాడులు చాలా పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో సైతం విద్యార్థులు కశ్మీర్ పేరు ఉచ్చరించడం, ప్రజా ఉద్యమకారులను స్మరించడం నేరమైంది. దేశంలో ఏ ఒక్క ప్రజాస్వామికవాది, లౌకికవాది నిర్భయంగా కశ్మీర్ సమస్య పట్ల తమ వైఖరిని ప్రకటించలేని పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి పోరాట సంస్థలను నిషేధించడం సర్వసాధారణమైంది. కశ్మీర్ ప్రజల ఆజాదీని నినదించే 'తహరీక్-ఉల్-ముజాహిద్దీన్' (టీ.యూ.ఎమ్.)ను ఇటీవలే భారత ప్రభుత్వం నిషేధించింది. అక్కడ అమలు అవుతున్న సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టంతో కశ్మీర్ ప్రజలు దినమొక గండంగా గడుపుతున్నారు. అక్కడి వాస్తవాలను వెలుగు చూడనీయకుండా పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛపై నియంత్రణ, మీడియాపై జరుగుతున్న దాడులు జగమెరిగినవే. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం అక్కడ అమలు చేస్తున్న అణచివేత విధానాలు. చివరకు ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ హక్కుల ఉల్లంఘనపై దర్యాప్తు జరిపించాలని భారత ప్రభుత్వంను కోరితే పాలకులు

# పుల్వామా నేపథ్యంలో రాష్ట్రపతికి లేఖ

– అడ్మిరల్ రాందాస్

ప్రియమైన శ్రీ కోవింద్ గారూ,

నేను అడ్మిరల్ రాందాస్‌ను. భారత నావికాదళ మాజీ అధిపతిని. మీకు మరొకసారి ఉత్తరం రాస్తున్నాను. ఈ సారి 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దగ్గర సీఆర్‌పీఎఫ్ బలగాల వాహనశ్రేణి పై జరిగిన పేలుడు పదార్థాల దాడిలో జవాన్ల విషాదకర మరణాలు, తదనంతర పరిణామాల సందర్భంలో ఈ లేఖ రాస్తున్నాను.

సీఆర్‌పీఎఫ్‌కు చెందిన నలభై మందికి పైగా విలువైన ప్రాణాలు దేశ సేవలో 2019 ఫిబ్రవరి 14న ఆహుతి అయిపోయాయి. ఇది నిజంగా దారుణమైన చర్య, విషాద ఘటన. ఇందుకు బాధ్యులైనవారిని తప్పనిసరిగా శిక్షించాలి.

ఈ ఘటన పట్ల సహజంగానే దేశం నలుమూలల నుంచీ, అన్ని వర్గాల ప్రజల నుంచీ తీవ్రమైన, ఆగ్రహపూరితమైన స్పందనలు వచ్చాయి. అంత ముఖ్యమైన వ్యూహాత్మకమైన రహదారి మీద అటువంటి ఘటన జరిగి ఉండగూడదనేది స్పష్టమే. మరీ ముఖ్యంగా ఇటువంటి దుర్ఘటన ఏదో జరగబోతున్నదనే సమాచార నివేదికలు పోలీసు, నిఘా విభాగాలకు అందాయనే వార్తలు కలవరం కలిగిస్తున్నాయి.

ఈ ఘటన పథక రచన చేసినదీ, అమలు చేసినదీ జైష్ ఎ మహమ్మద్ అనే సంస్థ అని తెలుస్తున్నది. ఆర్‌డిఎక్స్ తో నిండి ఉన్న ఒకే ఒక్క వాహనం సీఆర్‌పీఎఫ్ వాహనశ్రేణి మధ్యలోకి ఎలా ఎందుకు చొరబడి ఇంత విధ్వంసం సృష్టించగలిగిందనే ప్రశ్నలు ఉన్నాయి. అటువంటి మరెన్నో ప్రశ్నలకు సీఆర్‌పీఎఫ్ గాని, ఇతర ప్రభుత్వ సంస్థలు గాని జరిపే అంతర్గత విచారణల్లో జవాబులు వెతుకుతారు.

నావికా దళం మాజీ అధిపతిగా, త్రివిధ దళాధిపతుల సమితికి అధ్యక్షుడుగా 1993లో పదవీ విరమణ పొందిన నాటి నుంచీ పాకిస్థాన్‌తో శాంతి సాధనకే నా సమయంలో అధికభాగం కేటాయించిన వ్యక్తిగా, భారత–పాకిస్థాన్ ప్రజల మధ్య ఒక

---

దానిని నిర్విచక్షణగా కొట్టిపారేశారు. ఐక్య రాజ్య సమితి సహ ఏ విదేశీ సంస్థను భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను తెలుసుకోవడానికి అనుమతించడం లేదు.

అమాయకులైన ప్రజలపై కాల్పులు జరిపి చంపేసినా, కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించినా, స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడినా, యువతను అదృశ్యం చేసినా, పెల్లెట్స్‌తో కళ్లు పోగొట్టినా అక్కడ ఏమీ మాట్లాడలేం. దేశభక్తి, భద్రత జాతి ప్రయోజనాలు, దేశ సమైక్యత పేరుతో జవాబుదారీతనం లేని వికృత వ్యవస్థ ఒకటి కశ్మీర్‌లో కొనసాగుతున్నది. ఏదో ఒక మూలన ఎన్‌కౌంటర్ పేరుతోనో, కస్టోడియల్ డెత్ పేరుతోనే నిత్య చావుల మధ్య కశ్మీరీలు కాలం గడుపుతున్నారు. ప్రపంచంలో పాలస్తీనా తరువాత అత్యంత నిర్బంధాన్ని చవిచూస్తున్నది కశ్మీరీలే! అత్యంత సైనికీకరణకు గురైనది కూడా కశ్మీరే!

2016 జూలైలో కశ్మీరీ నవయువకుడు బుర్హన్ వానీని భారత భద్రతా బలగాలు హత్య చేశాక కర్ఫ్యూను సైతం ధిక్కరించి లక్షలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆయన అంత్యక్రియలలో పాల్గొన్నారు. వానీ కశ్మీర్ యువతకు ఒక గొప్ప ప్రేరణా శక్తిగా, ఆదర్శమూర్తిగా నిలిచాడు. ఆయన ఆదర్శాలతో ప్రేరణ పొందిన అక్కడి వందలాది యువకులు, విద్యాధికులు, ఉద్యోగులు 'ఆజాదీ కశ్మీర్' కోసం అంకితమవుతున్నారు. వారు తమ విలువైన ప్రాణాలను ధారబోస్తూ అంకిత భావంతో లక్ష్య సిద్ధి కోసం పోరాడుతున్నారు.

పాలకులు నిత్యం ప్రజల్ని అభద్రతలో ఉంచడానికి ఏర్పాటుచేసుకున్నదే భద్రతా వ్యవస్థ. పుల్వామా సంఘటన తర్వాత దేశభక్తి పేరుతో కొన్ని మూకలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. కశ్మీర్ భూభాగం మాత్రమే తమకు ప్రధానం గానీ కశ్మీరీ ప్రజలు కాదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులపై బెదిరింపులకు, దాడులకు, ఆస్తులు కొల్లగొట్టడానికి, కశ్మీరీల వ్యాపారాలను దెబ్బతీయడానికి తలపడుతున్నాయి.

"రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాలకు కశ్మీరీలపై దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని" సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేశాకగానీ ప్రధానమంత్రి ఈ దాడులపై స్పందించకపోవడం గమనార్హం.

మెజార్టీ కశ్మీరీలు అటు పాకిస్థాన్, ఇటు భారత్‌తో కాకుండా ఆజాదీ కశ్మీర్‌ను కోరుకుంటున్నారు. భారతదేశం, పాకిస్థాన్ తమకు సంక్షేమాన్ని, స్వేచ్ఛను కల్పించలేవనే నిస్పృహ నుంచి వచ్చిన ఆకాంక్ష అది. ఈ నేపథ్యంలో కశ్మీరీల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించకుండా శత్రు వైఖరితో మెలిగితే కశ్మీర్ సమస్యను మరింత ఎగదోసి జటిలం చేసినట్టే అవుతుంది. వారిలో మనపై నమ్మకం కలిగించకుండా మనల్ని నమ్మి ఇతర రాష్ట్రాల్లో చదువుకునేందుకు వచ్చిన విద్యార్థుల, ఉద్యోగులపై దాడులకు పాల్పడడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. కశ్మీర్ ప్రజలపై వివిధ ప్రాంతాలలో జరుగుతున్న దాడులను ముక్త కంఠంతో ఖండిద్దాం.

కశ్మీర్ ప్రజలు స్వతంత్ర కశ్మీర్ కోసం జరుగుతున్న న్యాయమైన పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిద్దాం. భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని, స్వయం ప్రతిపత్తిని సాధించడానికి పోరాడుదాం.

○

సంభాషణ సాగించాలని ప్రయత్నిస్తున్న వ్యక్తిగా నా ఆందోళనలు మీతో పంచుకోదలచాను. అవి:

1. మనం కశ్మీర్ సమస్యను సంభాషణల ద్వారా, చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించవలసి ఉంది. ఆ చర్చలలో ఈ వివాదంతో సంబంధం ఉన్న ముగ్గురు భాగస్వాములకు, అంటే జమ్ము కశ్మీర్ ప్రజలకు, భారత ప్రజలకు, పాకిస్తాన్ ప్రజలకు చోటు ఉండాలి. నా ఈ అవగాహనను ఎన్నో దశాబ్దాలుగా వ్యక్తీకరిస్తూ వస్తున్నాను. కశ్మీర్ సమస్య అని ప్రజలందరికీ తెలిసిన వ్యవహారపు సంక్లిష్ట స్వభావం గురించి సమగ్ర అధ్యయనం తర్వాత నేనీ అవగాహనకు వచ్చాను. ఈ సమస్య రెండు దేశాలలోనూ ఎన్నో ప్రాణాలను బలిగొన్నది. అంతకన్న ముఖ్యంగా జమ్ము కశ్మీర్‌లోని దురదృష్ట ప్రజానీకాన్ని అంతులేని వేదనకు గురిచేస్తున్నది. వారు భారతదేశంలో అంతర్గత భాగం అనే మాటను మనం మళ్లీ మళ్లీ వక్కాణిస్తూ ఉంటాం. అది నిజమే అని మనం అనుకుంటున్నట్టయితే, వారిని అలాగే చూడవలసి ఉంటుంది. అంటే సమానమైన పౌరులుగా చూడవలసి ఉంటుంది. వాళ్లు జమ్ములో ఉండేవారయినా సరే, లోయలో ఉండే వారైనా సరే, లదాఖ్‌లో ఉండే వారైనా సరే. మనం అలా ప్రవర్తించి ఉంటే అక్కడి ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఇవాళ ఉన్న స్థాయిలో పరాయీకరణ జరిగి ఉండేది కాదు.

2. రెండు దేశాల ప్రభుత్వాలూ కర్తార్ పూర్ మార్గాన్ని తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, (సరిహద్దుకు మూడు మైళ్ల దూరంలో పాకిస్తాన్‌లోని కర్తార్ పూర్‌లో ఉన్న గురుద్వారా దర్బార్ సాహిబ్ అనే సిక్కుల పవిత్ర స్థలానికీ మధ్య వీసా లేకుండా, ఏ ఆంక్షలూ లేకుండా భక్తులు ప్రయాణించడానికి వీలు కల్పిస్తామని రెండు ప్రభుత్వాలూ ప్రతిపాదిస్తున్నాయి–అను.) అదే వైఖరిని వాస్తవాధీనరేఖ విషయంలో,జమ్ము కశ్మీర్‌కు సంబంధించిన ఇతర కీలక అంశాల విషయంలో ఎందుకు అనుసరించగూడదు? ఈ వ్యవహారంలో భాగస్వాములందరి మధ్య సంభాషణ నడపడానికి సానుకూలంగా ఉన్నామని మనం ఎప్పుడు వ్యక్తీకరిస్తామో, ఆ ప్రక్రియను గంభీరంగా, చిత్తశుద్ధితో ఎప్పుడు ప్రారంభిస్తామో, అప్పుడు జమ్ము కశ్మీర్ ప్రజల ఆలోచనల్లో కొంత మార్పును చూడగలుగుతాము.

3. కశ్మీర్‌కు స్వేచ్ఛ కోసం, ఆజాదీ కోసం, సుదీర్ఘకాలంగా హామీ ఇస్తున్న స్వతంత్ర ప్రతిపత్తి కోసం ఆదిల్ వంటి ఒక యువకుడు తనను తాను పేల్చుకోవడానికి సిద్ధపడ్డాడంటే, అది ఆ రాష్ట్రపు యువతలో ఆగ్రహం, పరాయీకరణ భావం ఏ స్థాయిలో ఉన్నాయో చూపే శక్తివంతమైన సూచిక. “కండలు చూపే” కశ్మీర్ విధానం అనబడేదానిలో భాగంగా ఎంత పెద్ద ఎత్తున బలగాలను దించినా ఆ ఆగ్రహాన్నీ, పరాయీకరణ భావననూ అణచివేయడం సాధ్యం కాదు. ఇప్పటికైనా మేలుకొని, చర్చలకు సిద్ధపడి, ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలతో నిజాయితీగా సంభాషణ ప్రారంభించాలి. బహుశా ఆ పనిలో మనం ఇప్పటికే చాల ఆలస్యం చేశామేమో కూడ.

4. అవంతిపురా దగ్గర మన జవాన్ల మీద జరిగిన దాడికి అతి తీవ్రమైన ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా ఎంతో మంది కశ్మీరీల మీద అసాధారణ స్థాయిలో వేధింపులు, మూక హింస, దాడులు, అవమానాలు, దుర్భాషలు జరుగుతున్నాయి. అతిత్వరలోనే ఇది దేశవ్యాప్తంగా ముస్లింల మీద దాడిగా పరిణమించవచ్చు. ఆ పరిణామం ఎట్టి పరిస్థితుల్లోనూ, కొనసాగడానికి, విస్తరించడానికి మనం అవకాశం ఇవ్వగూడదు. అదే జరిగితే ఎటువంటి దుష్పరిణామాలు సంభవిస్తాయో అంచనావేయడమే అసాధ్యం.

5. ఒకే ఒక్క పరిష్కారం రాజకీయమైనదే తప్ప సైనికపరమైనది కాదు. అటువంటి రాజకీయ పరిష్కారం అసమ్మతివాదులు, వేర్పాటువాదులతో సహా కశ్మీర్ ప్రజలందరినీ, పాకిస్థాన్ ప్రభుత్వాన్నీ, భారత ప్రభుత్వాన్నీ కలుపుకునే నిజమైన, నిరంతరాయమైన సంభాషణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

**తక్షణమే ఏం చేయగలం**

దేశాధిపతిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా మీకు సంక్రమించిన అధికారాలతో, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని మీరు చేసిన ప్రమాణం ఆధారంగా, మీరు మీ విధ్యుక్తధర్మంలో, బాధ్యతలో భాగంగా, సంపూర్ణంగా మీ అధికారపరిధిలోనివే అయిన ఈ కింద వివరించిన చర్యలు తీసుకోవాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అ. పరిస్థితి మరింత విస్తారమైన శత్రుత్వాల స్థాయికి పెరగకుండా చర్యలు చేపట్టడం అనివార్య కర్తవ్యం. ఒకసారి ఆ స్థితికి చేరితే దాన్ని అదుపు చేయడం ఎప్పటికీ సాధ్యం కాదు. ప్రస్తుత సంక్షోభ స్థితి మరింత దిగజారి యుద్ధ పరిస్థితిగా మారితే వచ్చే ప్రమాదకర పరిణామాల గురించి భారత సర్వ సైన్యాధ్యక్షుడుగా మీరు మన సొంత నాయకులను హెచ్చరించవలసి ఉంది. ఇటు భారత్, అటు పాకిస్థాన్ కూడ అణ్వాయుధాలు కలిగిన దేశాలు గనుక అటువంటి యుద్ధమే వస్తే అది సాధారణ, సాంప్రదాయిక అర్థంలో ఘర్షణగా కాక భిన్నంగా ఉంటుంది.

ఆ. తదుపరి చర్యల గురించిన నిర్ణయాలను ఆచితూచి తీసుకోవలసి ఉంటుంది. ప్రతి అవకాశపు మంచి చెడులను, దాని పరిణామాలను బేరీజు వేయవలసి ఉంటుంది. ఉన్నత స్థాయి నిర్ణయాలను ప్రచారసాధనాల ప్రవక్తల ఉన్మాదమూ, సామాజిక మాధ్యమాల ఆగ్రహమూ ప్రభావితం చేయడానికి గాని, ఒత్తిడి చేయడానికి గాని వీలులేదు. ప్రస్తుతం నెలకొని ఉన్న వాతావరణం ఒక ప్రశాంత, ఆలోచనాయుత పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడానికి అనువుగా ఎంతమాత్రం లేదు. భావోద్వేగాలను, ప్రతిస్పందనలను రెచ్చగొట్టడానికి, ఆజ్యం పోయడానికి ఉద్దేశపూర్వకంగా, బాధ్యతారహితంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇ. పుల్వామా వాహనశ్రేణిపై జరిగిన దాడి గురించి సంపూర్ణ విచారణలు జరుపుతూనే బేషరతుగా కాల్పులు ఆపుతున్నామని ప్రకటించి భారత ప్రభుత్వం ఒక ఉన్నత నైతిక స్థితికి ఎదగాలి.

# వెనిజులాలో మదురోను గద్దె దింపేందుకు అమెరికా కుట్ర

దక్షిణ అమెరికా దేశం అయిన వెనిజులా అధ్యక్ష స్థానానికి 2018 మేలో జరిగిన ఎన్నికల్లో నికోలస్ మదురో 58 శాతం ఓట్లతో గెలిచి జనవరి 10న అధ్యక్ష బాధ్యతలు చేపట్టాడు. జనవరి 23న రాజ్యాంగ విరుద్ధంగా, ప్రజామోదానికి అతీతంగా ఆ దేశ ప్రతిపక్షనేత జువాన్ గువాయిడో తాత్కాలిక అధ్యక్షుడుగా తనకుతాను ప్రకటించుకున్నాడు. అమెరిగా అధ్యక్షుడు ట్రంప్ ఆయనను వెనిజులా అధ్యక్షుడుగా గుర్తించారు. లాటిన్ అమెరికాలోని అనేక మితవాద ప్రభుత్వాలు గువాయిడోకు మద్దతు నిచ్చాయి. దీంతో అమెరికా ఈ తిరుగుబాటు వ్యూహాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్టు స్పష్టమైంది.

1980లలో ప్రవేశపెట్టిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు లాటిన్ అమెరికాను అన్ని రంగాలలోనూ దివాళాతీయించాయి. వాటికి వ్యతిరేకంగా ఒక పెద్ద ప్రజా వెల్లువ వచ్చిన క్రమంలోనే 1998 లో వెనిజులాలో హ్యూగో చావెజ్ అధికారంలోకి వచ్చాడు. ప్రపంచంలోని ముడి చమురు నిల్వలలో 24 శాతానికి పైబడి వెనిజులా దేశంలో ఉన్నాయి. వెనిజులాలో చావెజ్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రైవేట్ రంగంలో ఉన్న చమురు కంపెనీలన్నింటినీ జాతీయం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర గరిష్ట స్థాయిలో ఉండడంతో ప్రభుత్వం వద్ద పెద్ద ఎత్తున పెట్రో డాలర్లు పోగుపడ్డాయి. వీటిని ఉపయోగించి చావెజ్ ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టింది. సామాజిక పించన్లు, నిరుద్యోగ భృతి, ఉచిత విద్య, వైద్యం వంటి పలు సంక్షేమ చర్యలు చేపట్టింది. ఈ విధానాలు ప్రజల జీవన ప్రమాణాల్లో కొంత మార్పు తీసుకు వచ్చాయి. చావెజ్ ప్రభుత్వానికి ప్రజలు వెన్ను దన్నుగా నిలిచారు. ఆ ప్రజా బలంతోనే అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రలను ఆయన ధీటుగా ఎదుర్కొన్నాడు. అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్‌కు చెందిన ఎక్సాన్ మొబిల్ కంపెనీని కూడా జాతీయం చేసి నెగ్గుకు రాగలిగాడు. క్యూబాకు సహకరించడంతో పాటు కాస్ట్రోతో చేయి కలిపి యావత్ లాటిన్ అమెరికాను ఉత్తేజ పరిచాడు చావెజ్.

చావెజ్‌ను కూలదోయడానికి అమెరికా పన్నిన సైనిక కుట్రకు ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసన రావడంతో ఆ ప్రయత్నం బెడిసి కొట్టింది. ఆయన జీవించి ఉన్నంత కాలం అమెరికా పాచికలు పారలేదు. ఈ కాలంలో లాటిన్ అమెరికాలోని చాలా దేశాల్లో

---

అలా జరిగితే వాస్తవాల మీద నిజమైన పరిశోధన జరుగుతుంది. ఈ దాడి వెనుక సత్యమేమిటో ఆలస్యం లేకుండా నిర్ధారణ అవుతుంది. అటువంటి చర్యకు ఉదాత్తమైన ప్రభావం ఉంటుందనీ, ఇకముందు ఇతోధిక శాంతి చర్యలకు దారి సుగమవుతుందనీ నా నమ్మకం.

ఈ. దేశంలో ఎన్నో పట్టణాల్లో. నగరాల్లో ప్రశాంతంగా తమ వృత్తి వ్యాపారాలు చేసుకుంటున్న అమాయక కశ్మీరీల మీద సాగుతున్న దారుణమైన ప్రచారసాధనాల యుద్ధాన్ని మనం తక్షణమే ఆపివేయవలసి ఉంది. అలా ఆపివేయాలనే సందేశం దేశంలోని అత్యున్నత స్థానం నుంచి రావలసి ఉంది. మన గౌరవనీయ ప్రధానమంత్రి తలచుకుంటే ఈ ప్రస్తుత ఉన్మాద ప్రతిస్పందనను నిమిషాల్లో ఆపగలరని ఆయనకు సలహా ఇవ్వవలసి ఉంది. దేశ పౌరుల మీద, వారు కశ్మీరీలైనప్పటికీ, ముస్లింలైనప్పటికీ, హింస, బెదిరింపులు, వేధింపులు జరిగితే తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన ఒక కఠినమైన, విస్పష్టమైన ప్రకటన ఇవ్వవలసి ఉంది. ఆ ప్రకటనను అన్ని ప్రచారసాధనాల చానళ్లలో, అన్ని స్థాయిల్లో సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయాలి. ప్రస్తుతం నెలకొని ఉన్న భయం, అభద్రతా వాతావరణం మరింత దిగజారకుండా కాపాడేందుకు, మరింత రక్తపాతం, మరిన్ని చర్యలు జరగకుండా అడ్డుకునేందుకు, ఈ చర్యలు అత్యవసరంగా అతి వేగంగా తీసుకోవలసి ఉంది.

ఉ. ఈ మొత్తం వ్యవహారం మీద వెంటనే ఒక నిష్పాక్షిక న్యాయవిచారణకు ఆదేశించండి. ఈ న్యాయవిచారణా బృందంలో సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తులను నియమించండి.

ప్రతీకారం తీర్చుకుంటాం అనే హెచ్చరిక వల్ల దేశవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. అణ్వాయుధాలు కలిగి ఉన్న రెండు దేశాల మధ్య ఇటువంటి హెచ్చరికలు చాల ప్రమాదకరమైనవి. ఈ సారి మనం ఈ యుద్ధాన్ని సాంప్రదాయిక యుద్ధం స్థాయికి పరిమితం చేయలేము. త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, మతోన్మాద కల్లోలాలకు, శాంతి భద్రతల యంత్రాంగం కుప్పకూలిపోవడానికి అవకాశం ఉన్న దృష్ట్యా పరిస్థితి చాల సున్నితమైనదిగా మారుతున్నది.

ఈ పరిణామాలలో ఏ ఒక్కటీ జరగడానికి మనం అనుమతించగూడదు. మనకు జమ్ము కశ్మీర్‌లో ఎన్నెన్నో వ్యూహాత్మక, మానవ ప్రయోజనాలున్నాయి. ఆ ప్రయోజనాలను దేశం మొత్తమూ, మనమూ కాపాడవలసి ఉంది. అది జరగాలంటే తప్పనిసరిగా మనం మొత్తంగా ప్రజల, ప్రత్యేకంగా జమ్ము కశ్మీర్ ప్రజల హృదయాలను మేధనూ చూరగొనవలసి ఉంది.

ఒక 'భావన'ను సైనిక శక్తి ఎన్నటికీ చెరిపివేయజాలదని మనం గుర్తు చేసుకుందాం. గత డెబ్బై సంవత్సరాలలో మన విధానాల గురించీ, మన ప్రవర్తన గురించీ మనం కాస్త లోతుగా ఆలోచిద్దాం.

నియంతల రాజ్యాలు కూలిపోయి అమెరికా వ్యతిరేక వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడడంతో అమెరికా పట్టు తగ్గింది. మరోవైపు రష్యా, చైనాలు అమెరికా ఆధిపత్యానికి అడ్డుపడడం జరుగుతున్నది. ప్రధానంగా లాటిన్ అమెరికా దేశాలలో రష్యా, చైనా వాణిజ్య సంబంధాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. వెనిజులాలో అమెరికా వ్యతిరేక ప్రభుత్వం ఉన్నంత వరకు అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆటలు సాగవని ట్రంప్ కుట్రకు ఉపక్రమించాడు. వెనిజులాలో రాజకీయ విభేదాలు కొత్త కాదు. దీర్ఘకాలంగా ఆర్థిక పరమైన విభేదాలు, పెట్టుబడిదారీ సంక్షోభం, సామ్రాజ్యవాద కుట్రలు కొనసాగుతున్నాయి. 2013లో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న చావెజ్ అంతిమ దశలో, మదురోను తన వారసుడిగా ప్రకటించాడు. మదురో అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి అమెరికా మరల తన కుట్రలను కొనసాగించింది. మరోవైపు ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా వచ్చిన పరిణామాల నేపథ్యంలో చమురు ధరలు తగ్గి వెనిజులా ఆర్థిక ఇబ్బందులకు గురైంది. వెనిజులాపై అమెరికా అనేక ఆంక్షలు విధించింది. వెనిజులా ప్రభుత్వరంగ చమురు కంపెనీ (పీడీవీఎస్ఏ)కి చెందిన దాదాపు 700 కోట్ల డాలర్ల ఆస్థులను అమెరికా స్థంభింపజేసింది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో డిపాజిట్ చేసిన బంగారం నిల్వలను మదురో ప్రభుత్వం తీసుకునేందుకు వీలులేకుండా బ్రిటన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దేశంలోని బహుళజాతి సంస్థలు కూడా అస్థిరత పెంచడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నిజానికి ప్రశాంతంగా ఉన్న వెనిజులాపై చమురు రాజకీయాలను విస్తృతం చేసింది అమెరికానే. అమెరికా ఆంక్షలు కారణంగానే వెనిజులాలో పరిస్థితులు దారితప్పాయని స్వయంగా '2018 నవంబర్ కాంగ్రెస్‌నల్ రీసెర్చ్ సర్వీస్ రిపోర్ట్' వెల్లడించింది.

వెనిజులాలో నెలకొన్న ఆర్థిక సామాజిక సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని మదురో ప్రభుత్వంపైకి ప్రతిపక్షాలను అమెరికా రెచ్చగొట్టింది. తన చెప్పు చేతల్లో నుండి జారిపోతున్నా ఏదైనా దేశంలో ప్రభుత్వాన్ని పడగొట్టాలని భావించినపుడు అమెరికా 'ప్రజాస్వామ్యం', 'మానవత' ముసుగు తొడుక్కుంటుంది. అమెరికా ఆదేశాల కనుగుణంగా పాశ్చాత్య మీడియా శక్తివంతంగా పనిచేసింది. మదురోకు అనుకూలంగా జరిగిన ప్రదర్శనలను వెలుగులోకి రాకుండా చేసి, అమెరికా అనుకూల, ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలకు పెద్ద ఎత్తున ప్రచారాన్నిచ్చింది.

2015 నవంబర్‌లో జరిగిన వెనిజులా పార్లమెంట్ ఎన్నికల్లో అమెరికా ప్రతిపక్షాలకు పెద్ద ఎత్తున డబ్బుసంచులు ముట్టజెప్పింది. తన ప్రచార బాకాల ద్వారా మదురోకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అబద్ధాలను ప్రచారం చేసింది. ఫలితంగా ఆ ఎన్నికల్లో మితవాద శక్తులు మెజారిటీ సాధించాయి. పార్లమెంట్‌లో మెజార్టీ రాగానే మదురోను తొలగించాలని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అధ్యక్షుడు మదురో పదవీకాల పరిమితి పూర్తి కావడానికి ఇంకా మూడేళ్లు ఉండగానే ఆయన గద్దె దిగాలని ఈ మితవాద శక్తులు రంకెలేస్తున్నాయి. 2017లో సుప్రీం ట్రిబ్యునల్ పార్లమెంటు అధికారాలను రద్దు చేసింది. అప్పటి నుండి అధికారం లేని పార్లమెంటు కొనసాగుతుంది. జాతీయ పార్లమెంటు స్థానంలో 2017 జులై 30న రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిపి 545 మంది సభ్యులతో కూడిన నూతన రాజ్యాంగ నిర్మాణ సభను మదురో ఏర్పాటు చేయడంతో రాజకీయ వివాదం రాజుకుంది. నేటి సంక్షోభానికి ఇదొక కారణం.

2018 మేలో వెనిజులా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఓడిపోతాయనే భయంతో ప్రతిపక్షాలు ఆ ఎన్నికలను బహిష్కరించాయి. 60 శాతం ఓట్లతో మదురో అధ్యక్ష స్థానానికి ఎన్నికయ్యాడు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని అమెరికా, యూరప్ దేశాలు ఆరోపించాయి. మదురోకు వ్యతిరేకంగా ప్రచారం చేసాయి. వెనిజులాలో జరిగిన ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని వివిధ దేశాల నుండి పరిశీలకులుగా వచ్చిన 150 మంది సంతృప్తి వ్యక్తం చేసారు. అందులో 8 దేశాలకు చెందిన 14 మంది ఎన్నికల అధికారులు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. ఎన్నికలకు ముందు, ఎన్నికలు కొనసాగుతుండగా, ఎన్నికల తర్వాత ఇలా మూడు సార్లు ఈవీఎంలను తనిఖీ చేసారు. అమెరికా సామ్రాజ్యవాదం వెనిజులా అంతరంగిక వ్యవహారాల్లో కలుగజేసుకుని అంతర్యుద్ధ పరిస్థితిని కల్పించి ఆ దేశ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ వెనిజులా తిరుగుబాటు అసమ్మతి వాదులకు అండగా ఉంటామని హామీ ఇస్తూ వీడియో మెసేజ్ పంపాడు. ఆ వెంటనే 2019 జనవరి 5న వెనిజులా జాతీయ అసెంబ్లీ (అధికారాలు లేని పార్లమెంటు) మదురోను అధ్యక్షుడిగా గుర్తించబోమని తీర్మానించింది. వెనిజులా రాజ్యాంగం ప్రకారం ఎన్నికయిన మదురో 2019 జనవరి 10న రెండవ సారి అధ్యక్షపదవీ ప్రమాణ స్వీకారం చేసాడు. అయితే పార్లమెంటు ఆ మరుసటి రోజే 'మదురో అధికారాన్ని కాజేసాడు' అని తీర్మానం చేసింది. పార్లమెంటు స్పీకర్‌గా ఉన్న గువాయిడోను అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వెనిజులా ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింప జేయాలని 46 దేశాలకు గువాయిడో నేతృత్వంలోని పార్లమెంటు లేఖలు రాసింది. పార్లమెంటు (అధికారాలు లేని) నిర్ణయాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అయినప్పటికి అమెరికా, కెనడా, బ్రెజిల్‌లు ఆ తీర్మానాన్ని అభినందించాయి, గువాయిడోను గుర్తించాయి. ఆయన నియమించే రాయబారులను గుర్తిస్తామని ప్రకటించాయి. అంటే వెనిజులాలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపేందుకు అమెరికా వ్యూహరచన చేస్తున్నదని స్పష్టమవుతుంది. ఆదేశ అధ్యక్షుడుగా గువాయిడోను గుర్తిస్తున్నట్టుగా అమెరికాతో పాటు పొరుగు దేశాలైన బ్రెజిల్, కొలంబియా, పెరూ, అర్జెంటీనా, పశ్చిమ యూరప్ దేశాలు

ప్రకటించాయి. వెనిజులా దేశ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన మదురో ప్రజా ప్రభుత్వాన్ని కాదని రాజ్యాంగంతో సంబంధం లేని, వెనిజులా ప్రజల చేత ఎన్నిక కాని వ్యక్తిని (గువాయిడోను) అధ్యక్షుడిగా అమెరికా గుర్తించడం పట్ల తీవ్రంగా ప్రతిస్పందిస్తూ మదురో అమెరికాతో దౌత్య సంబంధాలు అన్నింటిని తెంచుకుంటున్నామని ప్రకటించాడు. అమెరికా దౌత్య వేత్తలు, ప్రతినిధులు అంతా 72 గంటలలోపు తమ దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించాడు. కానీ మదురో అధ్యక్షుడు కాదని, ఆయన మాటను పాటించాల్సిన అవసరం లేదని అమెరికా నిరంకుశంగా వ్యవహరించింది. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం పట్ల రష్యా, చైనా, క్యూబా, టర్కీలు ఆగ్రహం వ్యక్తపరిచాయి. మదురోను గద్దెదించేందుకు అమెరికా కుట్రపన్నిందని ఆరోపించాయి.

**వెనిజులా లోపల బయట అమెరికా కుట్ర రాజకీయాలు:**

వెనిజులాలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో భాగంగా అమెరికా మద్దతుతో చెలరేగిన తిరుగుబాటుదారులు హింసను తీవ్రతరం చేసారు. 30 మందికి పైగా ప్రజలు మృతిచెందారు. వెనిజులాపై ఒత్తిడి తెచ్చేందుకు లిమా గ్రూపులోని కొన్ని దేశాలతో ట్రంప్ స్వయంగా సంభాషించినట్లు సమాచారం లిమా గ్రూపు దేశాల్లో బ్రెజిల్, అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, పెరూ, కోస్టారికా, పరాగ్వే వంటి దేశాలున్నాయి. లాటిన్, స్పానిష్ భాషలు మాట్లాడే లాటిన్ అమెరికా దేశాలతో పాటు కెనడా, ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ దేశాలను (ఓఏఎస్) కూడా ట్రంప్ రంగలోకి దించాడు. దీనితో ఆ దేశాలన్నీ వెనిజులా అధ్యక్షుడు మదురోకు వ్యతిరేకంగా, తిరుగుబాటుకు అనుకూలంగా తమ ప్రకటనలు జారీ చేసారు. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రభుత్వాన్ని కూల్చేందుకు అమెరికా పన్నిన కుట్రకు వీరంతా వంతపాడుతున్నారు.

జనవరి 26న నిర్వహించిన ఐక్యరాజ్య సమితి భద్రతామండలి సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడుగా గువాయిడోను గుర్తించాలని అభ్యర్థించడం గమనార్హం. తిరుగుబాటు ద్వారా మదురోను భర్తరఫ్ చేయాలని వెనిజులా సైన్యానికి విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటన కూడా పాంపియో చేసాడు.

వెనిజులా అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వెనిజులా పరిణామాలపై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరాస్ ప్రతిస్పందిస్తూ దేశంలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరగాలని పేర్కొన్నాడు. వెనిజులాలో తాజాగా ఎన్నికలు జరపడం మేలని యూరోపియన్ యూనియన్ సూచించింది. మార్చి 1న ఐక్యరాజ్య సమితిలో మదురో ప్రభుత్వాన్ని రద్దు చేయాలని అమెరికా తీర్మానాన్ని ప్రవేశ పెట్టింది. 9 దేశాలు అనుకూలంగా, 3 దేశాలు వ్యతిరేకంగా ఓటు చేయగా మరో 3 దేశాలు హాజరుకాలేదు. ఈ తీర్మానాన్ని రష్యా, చైనా దేశాలు వీటో చేసాయి.

అమెరికా సామ్రాజ్యవాదానికి వెనిజులా దేశంలోని అపారమైన చమురు సహజవాయు నిక్షేపాలు, వజ్రాలుతో పాటుగా భూగర్భంలోని బంగారు నిల్వలపై కళ్లు పడ్డాయి. దేశ సార్వభౌమాధికారాన్ని, స్వావలంబనను కాపాడుకుంటున్న మదురో ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా అన్ని శక్తుల్ని కేంద్రీకరిస్తుంది. ఫిబ్రవరి 3న ప్రభుత్వ అనుకూల, ప్రతికూల ప్రదర్శనలు జరిగాయి. మిలటరీ చొరబాటు ప్రయత్నాలను తోసి వేయలేమని'ట్రంప్ పేర్కొన్నాడు. మియామీలో ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ మాట్లాడుతూ "ప్రస్తుతం ఇక చర్చలకు తావేలేదు. కార్యాచరణకు సమయం ఆసన్నమైంది. మదురోను అంతం చేయడానికి అన్ని రంగాలు సిద్ధమైనాయి" అని అన్నాడు. జాతీయ భద్రతా సలహాదారు జాన్‌బోల్టన్ ఇప్పటికే 5 వేల మంది అమెరికా సైనికుల్ని కొలంబియా సరిహద్దుకు వెళ్లవలసిందిగా ఆదేశించాడు.

అమెరికా అధ్యక్షుడు తమ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ (స్టేట్స్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో) 'మదురో ప్రభుత్వ కిరాతకాలను మేం ఖండిస్తున్నాం. నికోలస్ మదురోను అంగీకరించే ప్రసక్తి లేదు. ఈ విషయంలో వెనక్కు పోయేదీ లేదని' అన్నాడు. మెక్‌పెన్స్ అయితే పొగరుబోతుగా మదురో రాజీనామా చేస్తే విలాసంగా జీవించవచ్చు లేకుంటే గ్యాటెనామా జైలులో ఊసలు లెక్కపెట్టాలని హెచ్చరిస్తున్నాడు. అవసరమయితే సైనిక జోక్యం కూడా చేసుకుంటామని ట్రంప్ ప్రకటించాడు. సైనిక జోక్యం చేసుకుంటే మరింత సంక్షోభం తప్పదని రష్యా హెచ్చరించింది.

చావెజ్ అకస్మిక మరణంతో వెనిజులాలో కుట్రలకు అమెరికా తెర తీసింది. అన్ని వైపుల నుండి ఒత్తిడి తెచ్చి మదురో ప్రభుత్వాన్ని కూల్చడానికి, సాధ్యం కాకుంటే సైనిక చర్య చేయడానికి సిద్ధమయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పతనం కావడంతో వెనిజులా సంక్షోభపు సుడిగుండంలో పడి సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఏర్పడడంతో ఆర్థిక పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. 80 శాతం పరిశ్రమలపై అదుపు కలిగిన కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేసిన సరుకులను గోదాముల్లో దాచి కృత్రిమ కొరత సృష్టించి ధరలను విపరీతంగా పెంచేశారు. మదురో ప్రభుత్వం నల్లబజారు వ్యాపారులపైన, గోదాములపైన దాడి చేసినా ఫలితం రాలేదు. 2018 ఆగస్టులో దేశ ఆర్థిక వ్యవస్థను పైకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా నూతన కరెన్సీని ప్రారంభించినా పెద్దగా ఫలితం రాలేదు. వీటికితోడు మార్చి 7న వెనిజులా జలవిద్యుత్ కేంద్రంపై సాంకేతిక సైబర్ దాడి జరిగింది దేశమంతా అంధకారం అలుముకుంది. ఈ పరిస్థితి గురించి వెనిజులా విదేశాంగ మంత్రి రోడ్రిగజ్ మాట్లాడుతూ 'సామ్రాజ్యవాద అమెరికా విద్యుత్ యుద్ధ బాధితురాలిగా తమ దేశం ఉందని' అన్నాడు. ఈ బ్లాకవుట్‌ను విద్రోహచర్యగా వెనిజులా ప్రభుత్వం పేర్కొంది.

కొలంబియా రాజధాని బాగోటా నగరంలో జరిగిన 14 లాటిన్

## కామ్రేడ్స్ కిరణ్, నర్మదల అక్రమ అరెస్టును ఖండించండి

దశాబ్దానికి పైగా క్రాంతి పత్రిక నిర్వహణలో ముఖ్య భూమికను నిర్వహించి ఆ తర్వాత ప్రభాత్ పత్రిక సంపాదకవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించి, దండకారణ్య విప్లవోద్యమ నాయకులలో ఒకరిగా దాదాపు దశాబ్ద కాలం పని చేసిన వెటరన్ కామ్రేడ్ కిరణ్ (70)తో పాటు డీ.కే. విప్లవోద్యమ నాయకురాలు కామ్రేడ్ నర్మద (59)ల అక్రమ అరెస్టులను ఖండించండి.

తీవ్ర అనారోగ్యంతో వున్న వెటరన్ కామ్రేడ్స్, సహచరులు నర్మద, కిరణ్‌లు హైదరాబాద్‌లో ఒక హాస్పటల్‌లో చికిత్స పొందుతుండగా తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు కలిసి పథకం ప్రకారం దాడి చేసి వారిని అరెస్టు చేశారు. సిరొంచ బస్టాండ్‌లో వారిని అరెస్టు చేసినట్లు తప్పుడు ప్రకటన ఇచ్చారు. మహారాష్ట్రలోని కేసులు పెట్టి కోర్టులో హాజరు పరిచారు. ఆరోగ్య పరిస్థితిని, వయోభారాన్ని దృష్టిలో పెట్టుకోకుండా కోర్టు వారిని రెండు దఫాలుగా పోలీసు రిమాండ్‌కు అనుమతించింది.

వారిరువురి ఆరోగ్య పరిస్థితి పట్ల విప్లవోద్యమ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

–సంపాదక వర్గం.

అమెరికన్ దేశాల 'లీమా' సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు మెక్‌పెన్స్ 'మిగిలి ఉన్న సోషలిజాన్ని మట్టికరిపిస్తామంటూ' ప్రగల్భాలు పలికాడు. సోషలిజం చనిపోతుంది. స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం విరాజిల్లుతుంది. ప్రజాస్వామ్యం పునర్జన్మ ఎత్తబోతుందని పలికాడు.

వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి, అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకుని రాజకీయ సంక్షోభాన్ని సృష్టిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదం వెనిజులాలో అంతర్యుద్ధ పరిస్థితులకు దోహదం చేస్తుంది. అందుకనుగుణంగా వెనిజులాలో ప్రతిపక్షాన్ని, సైన్యాన్ని తనకనుకూలంగా మార్చుకుని అలజడి సృష్టిస్తుంది. అమెరికా మద్దతు ఉన్న గువాయిడో అమెరికా తోను, ఈయూ దేశాలతోనూ సంబంధాలు కలిగి ఉన్నాడు. అమెరికా నుండి 3 ప్రాంతాలకు సహాయం రానున్నదని చెప్పుకుంటున్నాడు. దేశంలో 3 సరిహద్దు ప్రాంతాలలో ఒకటి కొలంబియా సరిహద్దు, రెండవది బ్రెజిల్ సరిహద్దు, మూడవది కరేబియన్. వాస్తవానికి పైకి ఆహారం, దుస్తులు, మందులు పంపుతున్నట్లు చెప్పి వీటితో పాటు ఆయుధాల్ని, డాలర్లను పంపుతున్నారు.

వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాలలోను అమెరికా సాధించింది తక్కువ, దెబ్బతిన్నదే ఎక్కువ. లిబియా, ఇరాక్‌ల అనుభవానికి భిన్నమైన అనుభావాన్ని ఇక్కడ ఎదుర్కోవచ్చునే భయాలున్నాయి. అయినప్పటికి ప్రధానంగా లాటిన్ అమెరికా దేశాల్లో పెరుగుతున్న రష్యా, చైనా వాణిజ్య సంబంధాలు దెబ్బతీయడానికి, వెనిజులాలోని ముడి చమురుపై ఆధిపత్యాన్ని సాధించడానికి తొందరపడుతున్నది. మిలటరీ ప్రతిఘటనతో పాటు మదురో అనుచరులతో జరిగే అంతర్యుద్ధ పరిస్థితులను అమెరికా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

మదురో మితవాద పక్షాలతో చర్చలు జరుపుతూ అమెరికాకు వ్యతిరేకంగా దేశాన్ని ఐక్యంగా నిలిపి అమెరికాతో పోరాడడమా లేక మితవాద ప్రతిపక్షాన్ని అణచివేసి అమెరికాకు మద్దతు లేకుండా చేయడమా? ఆ దేశ ప్రజల మద్దతును కూడగట్టడం ప్రధానం. అలాగే అమెరికా వ్యతిరేక శక్తులతో కలిసి అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవడం అవుసరం. సార్వభౌమాధికారానికి, స్వావలంబనకు భంగం కలగకుండా వ్యవహరించడంలోనే వెనిజులా భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

లాటిన్ అమెరికాలోని అర్జెంటీనా, బ్రెజిల్, వెనిజులా దేశాలలో వామపక్ష ప్రభుత్వాల పట్ల పెరుగుతున్న అసంతృప్తితో ప్రజలు మితవాద, 'ఫాసిస్టు శక్తులవైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలలో అలా జరిగింది. మదురో సరైన విధానాలు అనుసరించని పక్షంలో వెనిజులా ప్రజలు కూడా మితవాద, ఫాసిస్టు శక్తులవైపు మొగ్గి అమెరికన్ సామ్రాజ్యవాదానికి బలైపోయే ప్రమాదం ఉంది. ప్రజానుకూల ప్రభుత్వాలను కూల్చడానికి అమెరికా తనశక్తినంతా కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో వెనిజులాను కాపాడుకోవడం ప్రపంచ ప్రజల ముఖ్యంగా ప్రపంచ కార్మికవర్గం యొక్క బాధ్యతగా ఉంటుంది.

సామ్రాజ్యవాద అనుకూల ప్రపంచీకరణ ఆర్థిక విధానాల పునాదుల మీద సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిపి చిరకాలం ప్రజాభిమానం పొందడం సాధ్యంకాదని లాటిన్ అమెరికా దేశాల సామాజిక సంక్షేమ చరిత్ర రుజువు చేస్తున్నది. ఈ వాస్తవాన్ని గుర్తించి మొత్తం ప్రపంచంలో సామ్రాజ్యవాదాన్ని, దోపిడీ వర్గాల రాజ్యాన్ని కూల్చి దోపిడీ సంబంధాలను రూపుమాపే వర్గ పోరాట రాజకీయాలతో ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అమలు చేసినపుడు మాత్రమే ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తుంది. వెనిజులా సార్వభౌమత్వానికి, స్వావలంబనకు గ్యారంటీ ఉంటుంది. ○

# సామ్రాజ్యవాద ప్రయోజనాలకు బలవుతున్న సిరియా

సిరియా పూర్తి పేరు సిరియన్ అరబ్ రిపబ్లిక్. జనాభా 2.3 కోట్లు. 75% సున్నీ ముస్లింలు. 13% షియా ముస్లింలు. 8% క్రైస్తవులు. 3% డ్రుజులు ఉన్నారు. మైనారిటీ షియా ముస్లింలకు చెందిన బషరల్ అసద్ కుటుంబం గత 50 ఏళ్లుగా (1970 నుండి) సిరియాను పరిపాలిస్తుంది.

1946లో ఫ్రాన్స్ నుండి స్వాతంత్ర్యం పొందిన సిరియాలో తరువాత అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తరువాత మిలటరీ అధికారుల పాలనలోకి వెళ్లింది. మిలటరీ పాలనకి వ్యతిరేకంగా తిరుగుబాట్లు జరిగి ప్రజాస్వామిక ప్రభుత్వాలకి అధికారం బదిలీ అయ్యింది. ఆ తర్వాత మళ్లీ మిలటరీ పాలనలోకి వెళ్లింది. ఇప్పుడు సిరియా ఒక యూనిటరీ రిపబ్లిక్. ప్రభుత్వాధినేతగా ప్రధానమంత్రి, దేశాధినేతగా ప్రెసిడెంట్ ఉంటారు.

1963లో ఆవిర్భవించిన బాత్ పార్టీ రాజకీయ ప్రత్యర్థులపై అణచివేతని ప్రయోగిస్తూ 1970లో అధికారంలోకి వచ్చింది. బాత్ పార్టీకి చెందిన అఫీజ్ అల్ అసద్ 30 సంవత్సరాల పాటు అధ్యక్షుడుగా కొనసాగాడు. 2000 సంవత్సరం నుండి అతని కొడుకు బషరల్ అసద్ అధ్యక్షుడుగా కొనసాగుతున్నాడు. అసద్ కుటుంబ పాలనలో అవినీతి, అణచివేత, నిరుద్యోగం పెరుగుతూ వస్తున్నాయి. రాజకీయ స్వేచ్ఛ లేకుండాపోయి నియంతృత్వం రాజ్యం ఏలుతోంది.

2010 చివరిలో 'అరబ్ వసంతం'గా చరిత్రకి ఎక్కిన అరబ్ దేశాల పౌరస్పందనలో ట్యునీషియా, ఈజిప్టు దేశాలలోని నియంతల పాలనకు వ్యతిరేకంగా తీవ్రమైన నిరసనలు వెల్లివిరిశాయి. పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లమీదకి వచ్చి శాంతియుతంగా ఆందోళనలు చేశారు. నియంతల పాలనకు చరమగీతం పాడారు. సిరియాలో కూడా ఈ అరబ్‌వసంత గాలులు వీచాయి. కానీ సిరియా అధ్యక్షుడు బషరల్ అసద్ ప్రజాందోళనలను కర్కశంగా అణచివేసే ప్రయత్నం చేశాడు. బహిరంగ స్థలాల్లో నినాదాలు రాస్తున్న ముక్కుపచ్చలారని 15 మంది బాలురను నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన సంఘటనతో, హంజి అనే 13 ఏళ్ల బాలుడిని సైనిక బలగాలు తీవ్రంగా హింసించి చంపివేయడంతో ప్రజలు రోడ్ల మీదకి వచ్చి అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఈ విద్యార్థుల నిర్బంధానికి ముందే 2011 జనవరి 28న అల్ హపక్కా సంస్థకు చెందిన హసన్ అలి ఆక్లెహ్ అనే యువకుడు అసద్ పాలనకు వ్యతిరేకంగా ఆత్మాహుతి చేసుకున్నాడు. ఈ సంఘటనతో సిరియాలో అసద్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు తీవ్రతరం అయ్యాయి.

అదే సమయంలో రాజకీయ ఖైదీలు జైళ్లలో నిరసనలకు దిగడంతో దేశమంతటా ఆందోళనలు, నిరసనలు పెరుగుతూ వచ్చాయి. దేశంలో అస్థిరత మొదలైంది. దేశవ్యాపితమైన 2011 మార్చి నాటి ఉద్యమం అసద్ గద్దె దిగాలి అనే స్పష్టమైన రాజకీయ డిమాండ్‌తో తీవ్రరూపం దాల్చింది. అంతర్యుద్ధం ప్రబలడానికి ప్రకృతిలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు కూడా తోడయ్యాయి. 2007 నుండి వరుసగా నాలుగు సంవత్సరాలు తీవ్ర కరువు పరిస్థితుల కారణంగా 15 లక్షల మంది ప్రజలు ఆకలికి తాళలేక వలస పోయారు.

ఆందోళనలు మొదలైన నెలరోజులకే "నూతన రాజ్యాంగాన్ని ప్రవేశపెడతామని, పాలనా పగ్గాలు ఎన్నికల ప్రక్రియ ద్వారా సంక్రమించేలా రాజ్యాంగ సవరణ తెస్తామని సైనిక పాలకులు హామీ ఇచ్చారు. శాంతియుత అధికార మార్పిడికి కట్టుబడి ఉంటామని, రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలను పెంచుతామని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని, అవినీతిని నిర్మూలిస్తామని, పత్రికా స్వేచ్ఛను కల్పిస్తామని, ఎమర్జెన్సీని ఎత్తి వేస్తామని" బషరల్ అసద్ లండన్‌లో ప్రకటన చేశాడు.

2011 ఏప్రిల్ 19న ఎమర్జెన్సీ ఎత్తేశారు. కుర్దు శరణార్థులకు సిరియా పౌరసత్వం మంజూరు చేశారు. సున్నీలకు రాయితీలు ఇవ్వడం, సిరియాలో రాజకీయ, రక్షణ, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలు చేపడతామని అసద్ ప్రభుత్వం ప్రకటించింది. ఇవేవీ కూడా సిరియా ప్రజల్లో బాత్ పార్టీ దాని విధానాల పట్ల వ్యతిరేకతను గూడు కట్టుకుని ఉన్న అసంతృప్తులను తొలగించలేకపోయాయి.

దేశంలో ఎమర్జెన్సీ ఎత్తేశాక ఆందోళనలు పెరుగుతూ వచ్చాయి. అసద్ ప్రభుత్వ బుజ్జగింపులకు తలొగ్గకుండా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం అయ్యాయి. ఈ ఉద్యమాలపై సిరియా ప్రభుత్వం తీవ్ర స్థాయిలో అణచివేతలకు పాల్పడింది. దేశ ద్రోహుల పేరుమీద ఊచకోతలు జరిగాయి. హెచ్చరికలు లేకుండా తుపాకులు పేల్చారు. సిరియన్ సైనికులు అనేక నగరాల్లో కవాతు చేశారు. అన్ని నగరాల్లో విద్యుత్, ఆహార సరఫరా నిలిపివేయడం జరిగింది. డారా, హామ్స్, బనియాస్, డమస్కస్ వంటి నగరాల్లో కనిపిస్తే కాల్చివేత ఉత్తరువులు అమలు చేశారు.

అమాయకులపై ఊచకోతను నిరసిస్తూ సిరియన్ ఆర్మీలోని కొందరు ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు. వీరిపై ప్రభుత్వం వేటు వేసింది. అసద్ చర్యలను నిరసిస్తూ ఎందరో సైనికాధికారులు రాజీనామాలు చేశారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

2011 జూలై 29న సిరియన్ విముక్తి 'సైన్యం' (ఫ్రీ సిరియన్ ఆర్మీ–ఎఫ్ఎస్ఎ) పేరుతో బషరల్ అసద్ ప్రభుత్వంపై సాయుధ పోరాటాన్ని ప్రకటించారు. వీరితో అప్పటికే పోరాటాల్లో ఉన్న ఉద్యమకారులు జతకలిశారు. ఇరవై వేల మందితో మొదలైన

ఎఫ్ఎస్ఎ రెండేళ్లలో అరవై వేలకు చేరింది. ఎఫ్ఎస్ఎ లక్ష్యంగా అసద్ ప్రభుత్వ దళాలు నగరాలపై దాడులు చేస్తూ పోయాయి. స్వంత ప్రజలనే హతమార్చడానికి పూనుకున్నాయి. ఈ దాడులను అరబ్ లీగ్, గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) సిరియా ప్రభుత్వాన్ని తప్పు పట్టాయి. 2012 జూలై 18న డమస్కస్‌లో జరిగిన బాంబు దాడిలో రక్షణ మంత్రి చనిపోయాడు. ఈ దాడికి ఎఫ్ఎస్ఎ బాధ్యత వహించింది.

మధ్యప్రాచ్యంలో ఆధిపత్యం కోసం వెంపర్లాడుతున్న అమెరికా, రష్యాలు సిరియా అంతర్యుద్ధంలో ప్రవేశించి తలా ఒక పక్షాన్ని బహిరంగంగానే సమర్థించడంతో సిరియా ప్రపంచ పటంలో ఒక మాయని గాయంలా తయారైంది. బషరల్ అసద్ ప్రభుత్వాన్ని రష్యా సమర్థిస్తుండగా, తిరుగుబాటు దారుల పోరాటానికి అమెరికా వెన్నంటి ఉంది. టర్కీతో సహా పలు అరబ్ దేశాలు తిరుగుబాటు దారులకు ఆయుధాలు సమకూర్చాయి. షియాలు ఎక్కువగా ఉన్న ఇరాన్, ఇరాక్ దేశాలు అసద్‌ను సమర్థిస్తుండగా, సున్నీలు అధిక సంఖ్యలో ఉన్న టర్కీ, ఖతర్, సౌదీ అరేబియా లాంటి దేశాలు అసద్ వ్యతిరేక శక్తులకు మద్దతు ఇస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 2017 ఏప్రిల్ 4న అసద్ వ్యతిరేక శక్తుల ఆధీనంలో ఉన్న ఇడ్లిబ్ రాష్ట్రంలో ఖాన్‌షేకెన్ అన్న పట్టణంలో రసాయన ఆయుధాలతో దాడి జరిగింది. అందులో 80 మంది పౌరులు ముఖ్యంగా సగానికి పైగా పసి బాలురు మరణించారు. ఇది అవకాశంగా తీసుకుని అమెరికా సిరియా అధ్యక్షుడు అసద్‌ను శిక్షంచడం కోసం సిరియాపై మిస్సైల్ దాడి చేస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ ఏప్రిల్ 6న సిరియాపై బాంబుల వర్షం కురిపించాడు.

ఎఫ్ఎస్ఎకు మద్దతుగా అమెరికా, టర్కీ, సౌదీ అరేబియా, ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్స్, కెనడాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అమెరికా సీఐఏ మిలటరీ శిక్షణను ఇచ్చింది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న పాలస్తీనా అరబ్బులను తీవ్రవాదులుగా వ్యతిరేకిస్తూ, మరొకవైపు సిరియాలో ప్రభుత్వ వ్యతిరేక శక్తులను స్వాతంత్ర్య ఉద్యమకారులుగా చెబుతూ ఆయుధాలు, డబ్బులు, తదితర సహకారాలు అందిస్తుండడం వారి ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తుంది.

అమెరికా జోక్యం చేసుకున్న ఏ దేశం బాగుపడలేదు. ఇరాక్‌లో సద్దాంహుసేన్‌పై జీవ రసాయన ఆయుధాలు తయారు చేస్తున్నాడనే తప్పుడు ఆరోపణలతో ఏకపక్షంగా దాడి చేసింది. నేటికీ తన ఆరోపణలను నిరూపించ లేకపోయింది. ఇరాక్ ప్రజలను చాలా యాతనలకి గురిచేసింది. పసిపిల్లలకి మందులు అందకుండా చేసి పొట్టన పెట్టుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా జనావాసాలపై బాంబుల వర్షం కురిపించి వేలాది మంది ప్రజల ప్రాణాలు తీసింది. అయితే, తాలిబాన్లు నేటికీ అమెరికన్ దళాలతో పోరాడుతూనే ఉన్నారు. ఇరాక్‌లో సద్దాంహుసేన్‌ని బంధించి, ఉరితీసి చంపాక అక్కడి చమురు నిక్షేపాలని దోచుకున్నట్లే, లిబియాలో గడాఫీని చంపించిన తరువాత అక్కడి చమురు సంపదను కొల్లగొట్టింది. ఇప్పుడు సిరియాలో మానవ హననాన్ని కొనసాగించి ఆప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని చూస్తున్నది.

అమెరికాలో ఆయుధ వ్యాపార పెట్టుబడిదారీ వర్గాలు సంక్షోభంలో ఉన్నప్పుడల్లా లేదా వాటికి లాభాలను సమకూర్చి పెట్టడంలో భాగంగా ప్రపంచంలో ఎక్కడో ఒక దగ్గర లేదా పలు ప్రాంతాలలో యుద్ధాలు రాజేయడం, యుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఆయా ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలు, జీవితాలు, సంక్షేమాలు ఈ యుద్ధ పిపాసులకు అనవసరం. వారి ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటం కోసం, లాభాలు సంపాదించటం కోసం, విలాసంగా జీవించటం కోసం, వారి అహంకారాలని సంతృప్తి పరచటం కోసం ఎంతటి అకృత్యాలకు, హేయమైన దాడులకు అయినా సామ్రాజ్యవాద శక్తులు ఒడిగడతాయి.

రష్యా సిరియాకు 1960 నుండి మిత్రదేశంగా ఉంటున్నది. రష్యాకు సిరియాలో విలువైన నావికా స్థావరాలు ఉన్నాయి. సిరియాలోని 48 శాతం ఆయుధ సామగ్రి రష్యా నుండి కొన్నవే. రష్యా అత్యాధునిక ఆయుధాలను, ఎం 125 వంటి యుద్ధ విమానాలను సిరియాకు అందించింది. 10 వేల మంది సైనికులను సిరియాకు పంపించింది. 2015లో సిరియాలో యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది.

ఆయుధ మార్కెట్‌ను సృష్టించుకొని తన సైనిక శక్తిని విస్తరించుకొని ప్రపంచశక్తిగా ఎదగడానికి మధ్య తూర్పు ప్రాంతంపై పట్టు కలిగి ఉండడం రష్యాకు కావాలి. అలాగే ఈ ప్రాంతంలో అశాంతి, అస్థిరత్వం అనేది మెజారిటీగా ముస్లింలున్న చెచెన్యా, అజర్‌బైజాన్, కజకిస్తాన్, టుర్కుస్తాన్, తుర్కెమిస్తాన్, కజగియా ప్రాంతాలను ప్రభావితం చేస్తుంది. ఇది రష్యాకు ప్రమాదకరంగా మారుతుంది.

మధ్య ప్రాచ్యంగా పిలిచే పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతం వ్యూహాత్మకంగా కీలకమైనది. ప్రపంచంలోని మొత్తం చమురు నిక్షేపాలలో మూడింట రెండు వంతులు ఇక్కడే ఉన్నాయి. ఈ ప్రాంతంపై పట్టు అమెరికాకు దాని మిత్రదేశాలకు అవసరంగా మారింది. సౌదీ దేశాల నుండి వచ్చే చమురు పైపులైన్లు సిరియా నుండి అమెరికా, దాని మిత్రదేశాలకు రావాలి. అందువలన, అమెరికాకు సిరియాపై నియంత్రణ అవసరమవుతున్నది. సిరియాలో తమ కీలుబొమ్మ ప్రభుత్వం ఉన్నట్లయితే తమ ప్రయోజనాలను సులువుగా నెరవేర్చుకోవచ్చనేది ఇటు రష్యా, అటు అమెరికాల వ్యూహంలో భాగంగా ఉంటున్నది.

ఇరాన్‌లో మెజారిటీగా షియా ముస్లింలున్నారు. ఇరాన్ ప్రభుత్వం సిరియాలో షియా వర్గానికి చెందిన అసద్ ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు ఏటా వందల కోట్ల డాలర్లను ఖర్చు చేస్తున్నది. వందల మందితో కూడిన పోరాట దళాలను సిరియాకు పంపిస్తున్నది. సైనిక

సలహాలను, రాయితీలతో ఆయుధాలను, రుణాన్ని, చమురును అందిస్తున్నది. లెబనాన్‌లోని షియా ఇస్లామిక్ రాజకీయ మిలటరీ సంస్థ అయిన హిజ్బుల్లాకు ఇరాన్ ఆయుధాలను ప్రధానంగా సిరియా గుండానే పంపించాలి. హిజ్బుల్లా సంస్థ సిరియాలో అసద్‌కు మద్దతుగా వేల మంది ఫైటర్లను పంపించింది. ఐఎస్ఐఎస్‌ను తుదముట్టించేందుకు, ఇరాన్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి, అంతర్యుద్ధానికి ముగింపు పలికేందుకు సిరియాలో సైన్యాన్ని దించుతామని, ఎస్‌డిఎఫ్‌కి బాసటగా నిలుస్తామని అమెరికా జనవరి 2016లో ప్రకటించింది.

సున్నీ పాలిత సౌదీ అరేబియాకు, షియా పాలిత ఇరాన్‌కు మధ్య దశాబ్దాలుగా ఉన్న వైరం సిరియాపై చూపింది. ఇరాక్‌లో బాతిస్టు పార్టీ (సద్దాం హుస్సేన్) పాలన అంతం అయ్యాక సున్నీ షియాల మధ్య ఆధిపత్య పోరుకు సిరియా వేదికగా మారింది.

గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) సభ్యదేశాలతో పాటుగా ఆ ప్రాంతంలోని సున్నీ దేశాలన్నింటికీ రక్షణగా నిలవాలంటే సిరియాను చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని సౌదీ అరబ్ ఆరాటపడుతున్నది. సిరియాలో ప్రభుత్వ వ్యతిరేక దళాలకు సైనిక, ఆర్థిక సహాయ సహకారాలను అందిస్తున్న ప్రధాన దేశం సౌదీ అరేబియా. ఇరాన్ ప్రభావాన్ని తగ్గించాలని సున్నీ పాలిత సౌదీ అరేబియా ప్రయత్నిస్తున్నది.

నేడు సిరియాలో ఆ దేశ ప్రజలకు స్వయం నిర్ణయాధికారం, స్వతంత్రత, స్వేచ్ఛలు లేకుండా పోయాయి. ఓ వైపు మతం పేరుతో ఛాందసత్వం, మరోవైపు నియంతల నిరంకుశత్వం.

ఇంకోవైపు సామ్రాజ్యవాదుల క్రూరత్వం సిరియాలోని ప్రజాస్వామిక, సెక్యులర్, సామ్యవాద, సార్వభౌమత్వాధికార కాంక్షలను నులిమివేస్తున్నాయి. తీవ్రంగా అణచివేస్తున్నాయి.

బాంబులతో, వైమానిక దాడులతో, ప్రమాదకర మిస్సైల్స్‌తో, నీతిబాహ్యమైన రసాయనిక ఆయుధాలతో, విషవాయువులతో సిరియా భూభాగాన్ని అక్కడి ప్రజల జీవితాలను అతలా కుతలం, రక్తసిక్తం చేసి ఎటుచూసినా అపరిమిత విధ్వంసాన్ని కావిస్తున్నారు.

2011లో దాదాపుగా 2 కోట్ల 30 లక్షల జనాభా ఉన్న సిరియాలో 40 లక్షల మంది గాయాలపాలయ్యారు. 5 లక్షలకు పైగా మరణించారు. 60 లక్షల మంది శరణార్థులుగా పక్క దేశాలకు వెళ్లారు. 60 లక్షల మంది సిరియాలోనే అంతర్గతంగా నిర్వాసితులయ్యారు. శరణార్థులుగా వెళ్లేవారి కష్ట నష్టాలు చెప్పనలవి కావు. ఆయా దేశాలు వారిని అనుమతించడం ఒక సమస్య. అక్రమంగా వచ్చిన వారిని జైలు పాల్జేస్తున్నారు.

27 లక్షల ప్రజలు టర్కీకు శరణార్థులుగా వెళ్లారు. ఆ తరువాత లెబనాన్, జోర్డాన్, ఇరాక్, ఈజిప్ట్‌లు శరణార్థులకు ఆశ్రయం ఇచ్చాయి. యూరప్ చేరుకోవడానికి పెద్ద ఎత్తున శరణార్థులు సముద్ర మార్గాన్ని ఎంచుకొని ప్రాణాలు కోల్పోయారు. ఎలాగోలా చేరుకున్న వారిని జైళ్లలో బంధించారు.

17,700 మంది జైళ్లలో మరణించినట్లు, వేల మంది జిహాదిస్టుల చేతుల్లో మరణించినట్లు యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజిస్ (యుఎన్‌ఎచ్‌సిఆర్) చెబుతున్నది.

మహిళల పరిస్థితి దుర్భరంగా మారింది. ఐక్యరాజ్య సమితి గాని, ఇతర అంతర్జాతీయ సంస్థలుగాని అందించే సహాయం పొందేందుకు దళారీలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నది. కోరికలు తీరిస్తే తప్ప ఆకలి తీరని పరిస్థితిని తలుచుకుంటేనే దారుణంగా ఉంటుంది.

1 కోటి 30 లక్షల మందికి ఏదో ఒక రూపంలో సహాయం అందించాల్సిన, అవసరం ఉందని, ఆహార కొరత, అధిక ధరల కారణంగా 70 శాతం పైగా ప్రజలు కడుపేదరికంలో ఉన్నారని ఐక్యరాజ్య సమితి చెబుతున్నది.

సిరియాలో నేడు ఎటు చూసినా శిథిలమైన, శిథిలమవుతున్న భవనాలు, రోడ్లు నానా భీభత్సం తాండవిస్తున్నది. సిరియాలో ఇజ్రాయిల్, ఇరాన్, టర్కీ, అమెరికా, ఇరాక్, లెబనాన్ వంటి దేశాలు తమ సైన్యాలను పంపి అక్కడ ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటూ స్థానిక ప్రజలకు చోటు లేకుండా చేస్తున్నారు. 60 లక్షల సాయుధ బలగాలు చుట్టుముట్టిన ప్రాంతాలలో 29 లక్షల 80 వేల మంది ప్రజలు నిత్యం యుద్ధ భీభత్సం నడుమ సతమతమవుతున్నారు.

ఏక సమయంలో అనేక యుద్ధాలు జరుగుతున్న సిరియా బహుశా ప్రపంచ చరిత్రలో ఎన్నడూ జరగని క్రూరమైన సంఘటనలకు వేదికగా నిలుస్తున్నది. సిరియా వివిధ దేశాలకు, సంస్థలకు రణ రంగస్థలం అయింది. రానురాను సిరియా ఉనికికే ప్రమాదం పొంచి ఉందని అనిపిస్తున్నది.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 2012లో చేసిన జెనీవా తీర్మానాన్ని అమలు చేయాలని సూచించింది. దాని ప్రకారం అన్ని పక్షాల సమ్మతితో పూర్తి అధికారాలతో తాత్కాలిక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఐక్యరాజ్య సమితి మధ్య వర్తిత్వంలో 2014లో తొమ్మిది సార్లు చర్చలు జరిగాయి.

రాజ్యాంగ సవరణలు చేపట్టడం, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడంపై చర్చలు జరిగాయి. కాని అసద్ చర్చలకు సుముఖంగా లేదు. అసద్ వ్యతిరేక వర్గాలు అసద్ గద్దె దిగాల్సిందేనని అంటున్న ఫలితంగా పరిష్కారం దొరకని పరిస్థితి ఏర్పడింది.

సామ్రాజ్యవాద శక్తులు ఇక్కడ తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం పన్నిన పన్నాగాలకు సిరియా బలవుతున్నది. నిత్యం గత ఏడేళ్లుగా బాంబుల మోతలు, వైమానిక దాడులు, రసాయన ఆయుధాల ప్రయోగం, విధ్వంసం మొత్తంగా అక్కడి ప్రజల జీవితాలు చిన్నా భిన్నమవుతున్నాయి. రక్తంతో తడిసిపోతున్నది సిరియా.

2011 నుండి ఐదేళ్లలో 66 లక్షల జనాభా తగ్గిపోయిందని

### అడవిపై హక్కు, అధికారం ఆదివాసులదే

# సుప్రీంకోర్టు తీర్పు - ఆదివాసుల అస్తిత్వం

2011 జనగణనాల ప్రకారం మన దేశంలో 8.6 శాతం (10.4కోట్లకు పైగా) ఆదివాసీ జనాభా ఉంది. వారిలో సుమారు 6 కోట్లకు పైగా ప్రజలు అడవులలో నివసిస్తున్నారు. కానీ, దినదినం వారు తమ అటవీ హక్కుల నుండి వంచింపబడుతున్నారు. మన దేశంలో బ్రిటిష్ వారి హయాంలో ప్రారంభమైన అటవీ చట్టాలు 1947 అధికార మార్పిడి తర్వాత మరింత తీవ్రంగా ఆదివాసీ వ్యతిరేక స్వభావాన్ని సంతరించుకుంటూ వారిని అడవుల నుండి దూరం చేస్తున్నవి. అందులో భాగంగానే ఇటీవల 2019 ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు తీర్పు వెలువడింది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం -2006 అమలు జరిపితే అటవీ ప్రాంతం ధ్వంసం అయిపోతుందనీ, వన్యప్రాణులు నశిస్తాయనీ, అటవీ సంపదకూ, పర్యావరణానికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుందని 'వైల్డ్‌లైఫ్' అనే స్వచ్ఛంద సంస్థతో పాటు వన్యప్రాణి సంరక్షక సంస్థలు 2008లో వేసిన పిటిషన్ (కేసు)ను విచారిస్తూ సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 ప్రకారం సాగు భూములకు పట్టాలు దొరుకని వారిని జులై 27 కల్లా అడవుల నుండి తొలగించాలని 21 రాష్ట్రాలకు ఆదేశాలిచ్చింది. నిజానికి ఈ తీర్పు అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 స్ఫూర్తికి పూర్తి భిన్నమైనది. ఈ తీర్పు లోకసభ ఎన్నికల సమయంలో వెలువడడంతో కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాల మీదా సుప్రీంకోర్టు తీర్పుపై అఫిడవిట్ దాఖలు చేసింది. దానిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా నాయకత్వంలోని ద్విసభ్య ధర్మాసనం స్టే విధించింది. సాగు భూములపై యాజమాన్య హక్కులు దొరుకని వారిని జులై 27లోగా అడవుల నుండి వారిని పంపించివేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుపై ఫిబ్రవరి 28న స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వుతో సమస్య తాత్కాలికంగా వాయిదా పడిందే తప్ప ఆదివాసుల అస్థిత్వ ప్రమాదం తొలగిపోలేదు.

మన దేశంలోని ఆదివాసులు తాము నివసించే అడవులపై తమ యాజమాన్య హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. దోపిడీ పాలక వర్గాలు వారి పోరాటాలను ఎంత తీవ్రంగా అణచివేయ పూనుకుంటున్నప్పటికీ వారు మరింత పట్టుదలతో తమ అడవుల కోసం, అడవులలోని సమస్త ప్రాకృతిక వనరుల కోసం పోరాడుతునేవున్నారు. వారి పోరాటాల ఫలితంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు నూతన అటవీ హక్కుల చట్టాలను రూపొందించక తప్పలేదు. అందులో భాగంగానే 1996నాటి పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టం - 2006 లాంటివి వెలుగు చూశాయి. కానీ, అత్యున్నత విశ్రాంత ప్రభుత్వాధికారులలోని ఒక సెక్షన్ సహ బడా భూస్వామ్య, బడా కార్పోరేటు వర్గాలు వారి హక్కులను కాలరాచి వేయడానికి ఎడతెగని కుట్రలకు పాల్పడుతూనే ఉన్నాయి. వారి కుట్రలకు ఉన్నత, సర్వోన్నత న్యాయస్థానాలు అండగా నిలుస్తూ తమ వర్గ స్వభావాన్ని అవి సుస్పష్టంగా చాటుకుంటున్నవి.

దేశంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాలలో అమలు కోసం రూపొందిన పెసా చట్టాన్ని నిర్వీర్యపరుస్తూ 2002లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడి అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీ ప్రజలను అడవుల నుండి తొలగించాలనే సర్క్యులర్ జారీ చేసింది. దానితో అటవీ ఆక్రమణలు తొలగించే పేరిట అటవీ శాఖ వారు అతి దుర్మార్గంగా సుమారు 3 లక్షల మందిని అడవుల నుండి ఖాళీ చేయించారు. 50 లక్షల మంది పాక్షికంగా భూములు కోల్పోయారు. ఆ సమయంలో ఆదివాసులపై ఎన్నో అకృత్యాలు జరిగాయనీ, వారి పంటలను ధ్వంసం చేశారనీ,

---

వరల్డ్ బ్యాంక్ చెప్పింది. జనావాసాలు తగ్గిపోయి, భవనాలు, రోడ్లు ధ్వంసం అయిపోయి మిగిలేదేముంటుంది. ఆ మిగిలిన ప్రాంతం ఎవరి ఆధిపత్యం కింద పాలించబడుతుందో చరిత్ర నిర్ణయిస్తుంది.

ఇది ప్రపంచ శక్తులు, సిరియాపై సాగిస్తున్న రక్త చరిత్రగా మిగిలిపోతున్నది. సిరియాలో ఇతర దేశాల జోక్యం పూర్తిగా తొలగించి ఆ దేశంలోని వివిధ సంస్థలు రాజకీయ చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నది.

సిరియా ప్రజలు యుద్ధాలను వ్యతిరేకిస్తున్నారు. అసద్ నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. అసద్ నియంతృత్వ పాలనా విధానం అంతర్యుద్ధాన్ని తెస్తే అమెరికా, రష్యా రెండు సామ్రాజ్యవాద శిబిరాల మధ్య జరిగే ప్రచ్ఛన్న యుద్ధానికి సిరియా రణరంగ స్థలంగా మారింది. సిరియా జనాభాలో సగం దేశంలోను, విదేశాల్లోను శరణార్థులుగా బతుకుతున్నారు. మిగిలిన వాళ్లలో 70 శాతం ఆకలితో మగ్గిపోతున్నారు. సామ్రాజ్యవాదులు ఆయుధాలు అమ్ముకోవడానికి సిరియాలో యుద్ధ జ్వాలలు రగిలించడంతో సిరియా ప్రజలు నిత్యం ఆకలి, దారిద్ర్యాలకు గురవుతూ సుఖశాంతులకు, భద్రతకు దూరమవుతున్నారు. ప్రపంచంలో నీతి, శాంతి, అభివృద్ధిల కోసమేనా ఈ విధ్వంసం, మానవ హననం. సిరియాలో నైనా ప్రపంచంలోనైనా శాంతి నెలకొనాలంటే ప్రపంచ పీడిత ప్రజలు ఐక్యమై సామ్రాజ్యవాదాన్ని, నియంతల పాలనను ఓడించాల్సిందే. సామ్రాజ్యవాదుల్ని, నియంతల్ని మట్టుపెట్టకుండా ప్రజలకి నిజమైన భద్రత, సుఖశాంతులు లభించవు. ○

ఇళ్లను తగులబెట్టారనీ, మహిళలపై అత్యాచారాలు జరిపారనీ, ఆదివాసులు దృఢంగా ప్రతిఘటించిన చోట జరిపిన పోలీసు కాల్పుల్లో అనేక మంది ఆదివాసులు చనిపోయారనీ ఈ విషయంపై అధ్యయనం చేసిన సీ.ఆర్.బిజోయ్ పేర్కొనటం గమనార్హం. తత్పర్యవసానంగా అడవులలో నివసిస్తున్న ఆదివాసుల అటవీ హక్కులను గుర్తించాలంటూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున మిలిటెంట్ ఉద్యమం ముందుకు వచ్చింది. ఆ ప్రజా ఉద్యమాల ఫలితంగా ఆనాడు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006'ను రూపొందించింది. కాని అది చాలా తెలివిగానే అమలయ్యే తేదీని మాత్రం పేర్కొనలేదు. అయినప్పటికీ దేశంలోని ప్రజా పోరాటాల ఫలితంగా అది 2008నుండి అమలులోకి వచ్చింది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 ప్రకారం రక్షిత అడవులైనా, రిజర్వు ఫారెస్ట్ అయినా, అభయారణ్యాలు అయినా 2005 డిసెంబర్ కన్నా ముందు నుండి పది ఎకరాల లోపు భూములను సాగు చేసుకుంటున్న వారికి యాజమాన్య హక్కులు ఇవ్వాలని ఈ చట్టం చెబుతోంది. అంతే కాదు నివాసహక్కులు, ఉమ్మడి వనరులపై హక్కులు, సాగుచేసుకునే హక్కులు సహ 13 రకాల హక్కులను ఈ చట్టం ద్వారా ఆదివాసులు పొందారు. అయితే, అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసేతరుల విషయంలో మాత్రం 2005కు పూర్వం మూడు తరాలు అంటే 75 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నట్లు ఆధారాలు చూపాల్సి ఉంటుంది. రైతులకు వ్యక్తిగత పట్టాలివ్వటంతో పాటు గ్రామసభ పేరు మీద సామూహిక పట్టాలివ్వాలని కూడా చట్టం తెలిపింది. ఇందుకుగాను అన్ని గ్రామాలలో 10-15 మందితో కూడిన 'అటవీ హక్కుల కమిటీ'ని ఏర్పర్చాలనీ, అందులో మూడవ వంతు మహిళలు ఉండాలనీ చట్టం వివరించింది. ఆ కమిటీయే ప్రభుత్వ అధికారులకు తగిన ప్రమాణ పత్రాలు సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ చట్టంలో ఇంకా అనేక వివరాలు పొందుపరిచారు. అయితే, అటవీ హక్కుల చట్టంలో భూములకు పట్టాలు దొరుకకుండా తిరస్కరణకు గురైన వారిని ఏకపక్షంగా భూముల నుండి తొలగించమని ఎక్కడా పేర్కొనలేదు. సాగులో ఉన్న ఆదివాసుల భూముల విషయంలో మొదట 1998నే కటాఫ్ సంవత్సరంగా నిర్ణయించారు. కానీ, ఆ తరువాత పెల్లుబికిన అనేక ప్రజా పోరాటాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఒత్తిళ్లతో 2005ను కటాఫ్ సంవత్సరంగా ప్రకటించారు.

మన దేశంలో గడచిన ఐదు దశాబ్దాలకు పైగా భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ నుండి విముక్తి కోసం ప్రజా విప్లవోద్యమం కొనసాగుతోంది. దున్నే వారికే భూమి ప్రాతిపదికన జరుగుతున్న వ్యవసాయక విప్లవాన్ని సమూలంగా నిర్మూలించడానికి సామ్రాజ్యవాదుల దన్నుతో దేశ పాలకవర్గాలు ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా సైనిక దాడులు, వాటికి సాధికారితను పొందడానికి పెద్ద ఎత్తున సంస్కరణలకు పూనుకుంటున్నాయి. దేశంలో నక్సల్బరీ నుండి దండకారణ్యం, తూర్పు కనుమలు, నల్లమల, ఆదిలాబాదు, పశ్చిమ కనుమలు సహ అనేక అటవీ ప్రాంతాలకు నానాటికి విస్తరిస్తూ పెంపొందుతున్న విప్లవోద్యమంలో అడవులు, కొండలు వ్యూహాత్మక ప్రాంతాలుగా నిలిచి కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. ఆదివాసీ ప్రజలు ఉన్నతమైన పోరాట లక్ష్యంతో ఉద్యమిస్తున్నారు. వారి పోరాటాల ఫలితంగా రూపొందించిన చట్టాలను సైతం అవి ఆచరణలో సక్రమంగా అమలు చేయకుండా ప్రచార ఆర్భాటం మాత్రం ఆకాశం దద్దరిల్లేలా చేపట్టాయనడానికి అటవీ హక్కుల గుర్తింపు చట్టమే పెద్ద ఉదాహరణ.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006లో రూపొందగా 2008నుండి అమలులోకి వచ్చింది. ఆ చట్టం వెలుగు చూడడంతో తమ సాగు భూములకు పట్టాలు లభిస్తాయన్న ఆశతో దేశంలోని లక్షలాది ఆదివాసులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగడం ప్రారంభించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖే స్వయంగా వెల్లడించిన వివరాల ప్రకారం భూ యాజమాన్యాల హక్కు కోసం 42 లక్షల దరఖాస్తులు వచ్చాయనీ, వాటిలో 18 లక్షల 90 వేల మందికి పట్టాలు ఇచ్చారనీ, 19 లక్షల 40 వేల మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయనీ, తక్కినవింకా పరిశీలన దశలోనే ఉన్నాయని తెలిపింది. ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రిపోర్టు ప్రకారం ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా కేవలం 1,48,345 సాముదాయక అర్జీలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి. వాటిలో సగం కంటే తక్కువ 72,064 అర్జీలను మాత్రమే ఆమోదించి పట్టాలు ఇవ్వడం జరిగింది. సాముదాయక హక్కుల అర్జీలు పెట్టుకోవటం లేక ఆమోదించటం అనే ప్రక్రియను అధికారులు పెద్ద ఎత్తున నిరోధిస్తూ వచ్చారు. నిజానికి సాముదాయక హక్కులు ఆదివాసులకు ముఖ్యంగా ఆదివాసీ మహిళలకు అటవీ ఉత్పత్తులుసేకరించడానికి ఉపయోగపడతాయి. సమగ్ర సర్వే చేయకుండా, తగిన కారణాలు చూపకుండా దరఖాస్తులను ఏకపక్షంగా తిరస్కరించకూడదు. యుపిఎ హయాంలో ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం అటవీహక్కుల చట్టం అమలు తీరుపై మూడు నివేదికలు సమర్పించింది. చట్టం అమలు తీరు ఆదివాసుల ఆశలను నెరవేర్చే విధంగా లేదనీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు ఘోరంగా ఉన్నదని నివేదించడం గమనార్హం.

ఆదివాసీ ప్రజల జీవితాలతో, అడవితో వారికున్న అనుబంధంతో ఏ మాత్రం సంబంధం లేని పర్యావరణవాదులు, వన్యప్రాణి సంరక్షక సంస్థలు ఆదివాసుల పోడు వ్యవసాయంతో అడవి నాశనం అవుతున్నదని, వన్యప్రాణులు నశిస్తున్నాయని పెద్దఎత్తున గోల చేస్తున్నారు. అడవులు నాశనం కావడానికి కారణం ఆదివాసీల పోడు వ్యవసాయమా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు

చేస్తున్న ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక కార్పొరేటీకరణ అనుకూల విధానాలా? ఆదివాసులు వేల సంవత్సరాలుగా తాము నివసించే అడవులను కాపాడుతూ జీవిక కోసం చేసుకుంటున్న పోడు వ్యవసాయం వలన ఎక్కడా అడవులు నాశనం కాలేదు, కావు కూడా. పెద్ద ఎత్తున వేలాది, లక్షలాది ఎకరాల అటవీ భూముల్ని దురాక్రమించిన కార్పొరేట్ సంస్థల్ని, భూస్వాముల్ని, ప్రైవేట్ వ్యాపారస్తుల్ని, మైనింగ్ మాఫియాలని రక్షిస్తూ దగాకోరు విధానాలతో ఆదివాసుల్ని బలిగొంటున్నారు. పర్యావరణవాదులు, వన్యప్రాణి సంరక్షక సంస్థలు నిజంగా దేశంలోని అడవులను, వన్య ప్రాణులను రక్షించాలంటే ఆదివాసీ ప్రజలతో, వారి మధ్య పని చేస్తున్న విప్లవ సంస్థలతో భుజం భుజం కలిపి మైనింగ్ మాఫియాలకు, కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా అడవులను కాపాడడానికి ముందుకు రావాలి. సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలి. ప్రజలకు నూతన అటవీ చట్టాన్ని అనుసరించి పట్టాలు పంపిణీ చేయాలి అంటూ డిమాండ్ చేస్తూ పోరాడాలి.

నిజానికి అడవుల్ని, పర్యావరణాన్ని కాపాడుతున్నది ఆదివాసులు. ఈ కార్పొరేట్ సంస్థలకి వ్యతిరేకంగా నిలబడి పోరాడుతున్నది ఆదివాసులు. గతంలో యుపిఎ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తే, ఇప్పుడు బీజేపీ అధికారానికి వచ్చాక అటవీ భూముల్ని అడ్డగోలుగా కార్పొరేట్ సంస్థలకి కట్టబెడుతోంది. ల్యాండ్ కాన్‌ఫ్లిక్ట్ వాచ్ (ఎల్‌సిడబ్ల్యూ) అనే సంస్థ వెల్లడించిన గణాంకాల ప్రకారం 2018 జనవరి నాటికి పదకొండు రాష్ట్ర ప్రభుత్వాలు 26 కేసుల్లో గ్రామసభల అభిప్రాయాలనూ, నిర్ణయాలనూ పరిగణలోకి తీసుకోకుండానే, కొన్ని చోట్ల గ్రామసభలు జరపకుండానే అడ్డగోలుగా అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశాయి. జార్ఖండ్‌లో గ్రామసభల అనుమతి లేకుండానే ఐదు లక్షల ఎకరాల అటవీ భూమిని ఒక కార్పొరేట్ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. గాలిజనార్ధన్‌రెడ్డి లాంటి మైనింగ్ మాఫియాలకి ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాలలో గనులతవ్వకం, హరితహారం, అభయారణ్యాలు, పోలవరం వంటి ప్రాజెక్టుల పేరుతో లక్షలాది ఎకరాల అటవీ భూముల్ని ప్రభుత్వం కబ్జాచేస్తున్నది. కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు, భూస్వాములు వేలాది ఎకరాల భూముల్ని కబ్జా చేసి పళ్లతోటలు వేస్తున్నారు. క్వారీలు తవ్వుతున్నారు. భూమిపైన, భూమిలోపల ఎక్కడ సంపద ఉంటే అక్కడికి గద్దల లాగా వాలి, అక్కడ ఉన్న ఆదివాసీ ప్రజలపై దాడులు చేసి తరుముతున్నారు. దొంగే దొంగా, దొంగా అని అరచినట్లు అసలు అటవీ సంపదను దుర్మార్గంగా కబ్జాచేసి, నాశనం చేసే వారే ఆదివాసులని ఆక్రమణదారులు, కబ్జాదారులు అని కాకిగోల చేస్తున్నారు. తరతరాలుగా అడవులలో జీవిస్తున్న మూలవాసులైన ఆదివాసులు ఆక్రమణదారులు, కబ్జాదారులు ఎలా అవుతారు? అసలైన ఆక్రమణదారులు, కబ్జాదారులను ఆదివాసులు ఎదిరించి పోరాడుతున్నారు. అడవుల్ని కాపాడటం కోసం తమ మాన, ప్రాణాలని పణంగా పెడుతున్నారు. ఆక్రమణ దారుల ఆగడాలను అడ్డుకుంటున్నారు. అందుకనే, అడవిలోంచి ఆదివాసుల్ని బయటికి తరిమేస్తే అక్కడి సంపదని మొత్తం కొల్లగొట్ట వచ్చని కార్పొరేట్ సంస్థల, పాలక వర్గాల కుట్ర. అందుకనే, సల్వాజుడుం, సెంద్ర, గ్రీన్‌హంట్, సమాధాన్ వంటి అనేక పేర్లతో క్రూరమైన దాడులు చేయటమే కాకుండా, కొత్తకొత్త చట్టాలు తెచ్చి చట్టబద్ధంగా కూడా దాడులు చేస్తున్నాయి.

దేశంలోని అత్యంత విలువైన అడవులను, సమస్త ప్రకృతి సంపదలను సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల గనుల తవ్వకాలకు, విద్యుత్ ప్రాజెక్టులకు, ఇతర పారిశ్రామిక అవసరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో దేశంలోని రైతాంగం ప్రత్యేకించి ఆదివాసీ రైతాంగం తీవ్రమైన విస్థాపన సమస్యను ఎదుర్కొంటున్నారు. 'స్వాతంత్ర్యా'నంతరం కోట్లాదిగా ఆదివాసులు తమ ఆస్తులను, అస్తిత్వాన్ని కోల్పోయి నగరాలలో మురికివాడల పాలయ్యారు. తమ సామూహిక జీవితాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయి నగరాలలో అమానవీయమైన దోపిడీ, అణచివేతలకి గురవుతూ అత్యంత దయనీయ పరిస్థితులలో బతుకుతున్నారు. అడవికి దూరమైతే ఆదివాసులకి మనుగడ ఉండదు, అస్థిత్వం ఉండదు. కేంద్రంలో బీజేపీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ఈ ప్రభుత్వాలు అన్నీ దేశంలోని సంపదని సామ్రాజ్యవాదులకి అప్పనంగా అప్పగించేవే. అందుకు ఇటీవలే ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన 'భూ సేకరణ చట్టం' పెద్ద ఉదాహరణ. అందుకనే, ఈ దోపిడీ ప్రభుత్వాల చట్టాలు, అవిచ్చే భూమి పట్టాలు ఆదివాసుల్ని అడవి నుండి బేదఖల్ చేయకుండా ఆపుతాయన్న గ్యారంటీ ఏమీ లేదు. కాబట్టి, సామ్రాజ్యవాదుల ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సింగూర్, నందిగ్రాం, నియంగిరి, లోహండిగూడ, కోర్చీ, దుర్లీ, కంతన్‌పెల్లి, విశాఖ, సోంపేట, ఎర్రగుంటపల్లె, సాతకోట్ రైతుల మార్గంలో తమ భూముల కోసం 'దున్నే వారికే భూమి' నినాదం ప్రాతిపదికన రైతాంగం పోరాడి తమ భూములను, అస్థిత్వాన్ని కాపాడుకోవాలి.

సామ్రాజ్యవాదులకి ఊడిగం చేసే భారత పాలకవర్గాల నూతన ఆర్థిక విధానాలకి, కుటిల నీతికి వ్యతిరేకంగా దేశంలోని మైదాన ప్రాంత రైతాంగం, ఆదివాసీ రైతాంగం ఐక్యమై పోరాడాలి. విస్థాపనను వ్యతిరేకిస్తూ భూములను, గ్రామాలను, అస్థిత్వాన్ని కాపాడుకోవటం కోసం పోరాడాలి. 'దున్నేవారికే భూమి కావాలి,' 'అడవిపై ఆదివాసులదే హక్కు, అధికారం' అంటూ నినదిస్తూ ఐక్యంగా పోరాడాలి. కొమురం భీం, గుండాదూర్, బీర్సాముండా వంటి ఆదివాసీ వీరుల బాటలో తుది వరకూ వీరోచితంగా పోరాడాలి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా పోరాటాన్ని కొనసాగించి అడవిపై అధికారాన్ని, రాజ్యాధికారాన్ని సాధించాలి.

# గ్రామసభలను నీరుగారుస్తున్న దుష్టత్రయం.

2014 నుండి గఢ్‌చిరోలీ జిల్లాలో విస్తృతంగా గ్రామసభలు ఏర్పడడం ఆరంభమైంది. 1996లో పెసా చట్టం పురుడుపోసుకున్నప్పటికీ దాదాపు రెండు దశాబ్దాల కాలం అవి జిల్లాలో కీర్తిశేషులు బీ.డీ.శర్మగారి కృషితో అక్కడక్కడ తప్ప పెద్దగా ఉనికిలోకి రాలేదు. కీర్తిశేషులు బీ.డీ. శర్మగారి కృషితో వెలుగు చూసిన పెసా చట్టాన్ని అమలు చేయాలని నేటికీ దేశంలోని అనేక ప్రాంతాల ఆదివాసులు పోరాడుతూనే ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వమే తన చట్టాలన్నింటినీ పెసా చట్టానికి లోబడి సవరించుకొని ఆదివాసీ ప్రాంతాలలో ఆ చట్టాన్ని అమలు చేయాల్సి ఉండగా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల వైఖరి అందుకు పూర్తి భిన్నంగా ఉంది.

గఢ్‌చిరోలీ జిల్లా ప్రజలు నెలల తరబడి తమ చెప్పులు అరిగేలా కలెక్టరాఫీసు చుట్టూ తిరిగి ఆందోళనకు దిగితే తప్ప 2014 తర్వాతి నుండి ఆదివాసీ గ్రామాలలో గ్రామసభల డిక్లరేషన్ జరుగలేదు. గ్రామ గ్రామాన గ్రామసభలు ఏర్పడడంతో ఇక అడవిపై తమకే అన్ని అధికారాలు దక్కుతాయనీ వాస్తవంగానే ఆదివాసీ ప్రజానీకం సంబరపడింది. కానీ వారి ఉత్సాహాన్ని నీరుకారుస్తూ అటవీ శాఖ, దోపిడీ వ్యాపారస్థులు (కాంట్రాక్టర్లు) పోలీసులు–దుష్టత్రయం తొలి నుండి అనేక కుట్రలకూ, కుహకాలకూ ఒడిగడుతున్నారు.

గఢ్‌చిరోలీ జిల్లాలో 2017లో గ్రామసభల నాయకత్వంలో తొలిసారి విస్తృతంగా తునికి ఆకు కోత పనులు – అమ్మకాలు జరిగాయి. ఆ సంవత్సరం జిల్లాలో తునికాకు స్టాండర్డ్ బ్యాగుకు (70 ఆకులతో కూడిన1000 కట్టలు) అత్యధిక రాయాల్టీ రూ.19 వేలు, కనిష్టంగా రూ.14 వేలు లభించాయి. ఆ రాయాల్టీ మొత్తం గ్రామసభలకు చెందగా, తునికి ఆకు వ్యాపారస్థులు విడిగా ఆకు కోత కూలీలకు షేకడా రూ.350/– చెల్లించారు. తునికి ఆకు కళ్లాలపై కొనసాగే పనులన్నీ తమ స్వంత ఖర్చులపైనే వారు పూర్తి చేసుకున్నారు. కానీ 2018 వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీ.ఎస్.టీ. పుణ్యమా అంటూ జిల్లాలో తునికాకు వ్యాపారం చాలా వరకు దెబ్బతింది.

2018 సీజన్‌లో తునికి ఆకు వ్యాపారస్థులు జిల్లాలో అతి కొద్ది చోట్ల మాత్రమే గ్రామసభల వేలం పాటలలో పాల్గొని తునికి ఆకు సేకరణ పనులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తునికి ఆకుపై 18 శాతం జీ.ఎస్.టీ. విధించడంతో తాము వ్యాపారం చేయలేకపోతున్నామనీ వాపోయారు. గ్రామసభల నుండి తునికాకు సేకరణ పనులు పొందినవారు 2018లో అతి తక్కువ రాయాల్టీ చెల్లించారు. కోత కూలీలలో కూడా కోత పెట్టారు. అంతే కాదు, కోతకూలీ ఇకపై తాము చెల్లించలేమని మొండికేశారు. ఫలితంగా ఆదివాసీ ప్రజలు కేంద్రం రూపొందించిన జీ.ఎస్.టీ.కి బలై వ్యాపారస్థుల వ్యాపార విధానాలతో మరింత మోసపోయి ఆర్థిక రాబడిని కోల్పోయారు.

2019 సీజన్ వచ్చేసరికి ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత వికటించాయి. వరుసగా వెదురు పనులు నిలిచిపోవడం, తునికి ఆకు పనులు లేకపోవడం, వర్షాభావంతో పంటలు దెబ్బతినడంతో ప్రజల ఆదాయం ఘోరంగా దెబ్బతింది. మరోవైపూ 2018 నవంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల విధానసభల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తానూహించని విధంగా పరాజయం పాలు కావడంతో ఆగమేఘాల మీద జీ.ఎస్.టీ. కౌన్సిల్ వరుసగా 30–31విడుతలలో సమావేశమై అనేక సరుకులపై జీ.ఎస్.టీ. స్లాబ్‌ను తగ్గించింది. కానీ ఆదివాసుల చిరు ఆదాయ వనరైన తునికాకుపై మాత్రం 18% శ్లాబ్ యధావిధిగానే ఉండడంతో మళ్లీ వ్యాపారస్థులు 2019 సీజన్‌లో వేలం పాటలకు వస్తారా, లేదానన్న అనిశ్చిత పరిస్థితులు గ్రామసభలను వెంటాడాయి. దీనినే అదునుగా తీసుకున్న పోలీసులు గ్రామసభలను నిందిస్తూ తునికాకు వ్యాపారానికి అవే అడ్డు తగులుతున్నాయనీ, అటవీ శాఖ కొనసాగించే వ్యాపారాన్ని అవి కైవశం చేసుకొని ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నాయనీ అవాకులు, చవాకులతో ముమ్మర ప్రచారాన్ని లంఖించుకున్నారు. ఆదివాసీ ప్రజల అభివృద్ధి పట్ల మొసలి కన్నీరు కార్చే మహారాష్ట్ర ప్రభుత్వం వారికి నిజానికి ఇలాంటి పరిస్థితులలో అండగా నిలువాల్సింది పోయి తునికి ఆకు షేకడా కోతకూలీ రేటు కేవలం రూ.270 మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుంది. మరోవైపు పొరుగునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రేటుకు రెట్టింపుకు మించిన రేటును (50 ఆకుల 100 కట్టలకు రూ. 400) ప్రకటించడం గమనార్హం.

వ్యాపారస్థులు, అటవీ శాఖ, పోలీసులు కుమ్మక్కుతో చివరకు జిల్లాలో గరిష్ట రాయాల్టీ రేటు రూ. 8,700, కనిష్టంగా రూ.7 వేలకు లోపు చెల్లించడానికి సిద్ధమైనారు. జిల్లాలో నెలకొని ఉన్న ప్రజల పరిస్థితులలో ఎక్కడికక్కడే గ్రామసభలు అనివార్యంగా వ్యాపారస్థులతో వారు విధించిన షరతులన్నింటికి లోబడి తునికి ఆకు వ్యాపార ఒప్పందాలు చేసుకొక తప్పలేదు. తత్ఫలితంగా, 2019 సీజన్‌లో గ్రామసభలు పెద్ద ఎత్తున రాయల్టీని నష్టపోవడమే గాకుండా తమ రాయాల్టీ నుండే అవి తునికి ఆకు కోత కూలీ షేకడా రూ. 400 కొన్ని చోట్ల, రూ 450/ అతి తక్కువ చోట్ల చెల్లించాయి. 2017కు ముందు వరకు ప్రభుత్వ అటవీ శాఖ నిర్వహించిన కాలంలో తాము పొందిన రాయాల్టీ నుండి వారెన్నడూ కోత కూలీ శ్రామికులకు చెల్లించలేదు. గతంలో రాయాల్టీకి కోత కూలీకి సంబంధమే లేదు. కానీ, ఇపుడు ప్రజల ఆర్థిక దుస్థితులను, పేదరికాన్ని ఆసరా చేసుకొని వ్యాపారస్థులు అనేక విషమ షరతులు విధించి తునికి ఆకు వ్యాపారంలో గ్రామసభలను నష్టపరిచి వారు అనేక లాభాలు పొందారు. పెసా చట్టాన్ని ఆదివాసీ ప్రజలపై భస్మాసుర హస్తంలా మార్చడానికి దుష్ట త్రయం చేస్తున్న పన్నాగాలను

*(మిగతా 46వ పేజీలో......)*

సిద్ధాంత వ్యాసం

# కేంద్రీకృతాధికారం, కార్మికప్రజాస్వామికం-ఈ రెంటి సమ్మేళనమే కేంద్రీకృత ప్రజాస్వామికము

విప్లవకరమైన ప్రజాస్వామికపు ఆచరణ రూపమయిన కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని గూర్చి 1921లో మూడవ ఇంటర్నేషనల్ రూపొందించిన పార్టీ నిర్మాణ సూత్రాలలోని 6,7 సూత్రాలు ప్రపంచంలోని కమ్యూనిస్టు విప్లవకారులందరికీ మార్గదర్శకంగా ఉన్నాయి. కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాన్ని సాకల్యంగా అర్థం చేసుకోడానికి ఆ సూత్రాలను యధాతథంగా ఇచ్చట పేర్కొనడం అవసరం. "ప్రజాస్వామిక కేంద్రీకరణ" అనే పేరుతోనున్న రెండవ శీర్షికలో పొందుపరచబడ్డ, 6,7 సూత్రాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

6. "కమ్యూనిస్టు పార్టీలో అధికారాన్ని కేంద్రీకృతం చేయడం అంటే కేంద్రీకృతాధికారమూ, కార్మిక ప్రజాస్వామికము వాస్తవంలో ఈ రెంటినీ సమ్మిళితం చేయడమే. కేవలం పార్టీ నిర్మాణం మొత్తంగా కదిలి నిరంతరం చేసే కృషిపైనా పోరాటంపైనా ఆధారపడి మాత్రమే అలాంటి సమ్మేళనాన్ని సాధించగలము. కమ్యూనిస్టు పార్టీలో అధికారాన్ని కేంద్రీకృతం చేయడం అంటే అర్థం యాంత్రికంగానూ లేక నామమాత్రంగానూ కేంద్రీకృతం చేయడం కాదు. కమ్యూనిస్టు కార్యకలాపాలన్నింటినీ కేంద్రీకృతం చేయడమనే దానర్థం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యుద్ధానికి సన్నద్ధంగా ఉంటూ పరిస్థితులకు అనుగుణ్యంగా వ్యవహరించే నేర్పు కలిగిన బలమైన నాయకత్వాన్ని నిర్మించడమని దానిఅర్థం. నామమాత్రంగాగానీ, యాంత్రికంగాగానీ, అధికారాన్ని కేంద్రీకృతపరచడమంటే తక్కిన సభ్యులపైననో లేక నిర్మాణానికి బయట ఉన్న విప్లవకర కార్మికవర్గ సముదాయము పైననో పెత్తనం చలాయిస్తూ ఉండే పారిశ్రామికుల నిరంకుశాధికారుల చేతిలో అధికారాన్ని కేంద్రీకరించడం, కార్మిక పోరాటాలు కొనసాగించడము, కమ్యూనిస్టు నాయకత్వాధికారాన్ని కేంద్రీకరించి అమలుజరపడము వగైరా కార్యాచరణ ద్వారా కమ్యూనిస్టు పార్టీ విప్లవ కార్మికవర్గంపై అధికారాన్ని చలాయించ జూస్తోంది అని కమ్యూనిస్టు వ్యతిరేకులు మాత్రమే అనగలరు. అది కేవలం అబద్ధం. అధికారం కొరకుగానీ, ఆధిక్యత కొరకుగానీ పార్టీ లోపల జరిగే పోటీకీ, మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆమోదించిన కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలకు ఎలాంటి సంబంధమూ లేదు.

బూర్జువా రాజ్యాంగ యంత్రంలో సాధారణ ప్రజానీకానికీ, నిరంకుశాధికార వర్గానికీ మధ్య ఉండే ద్వంద్వ విధానము విప్లవ స్వభావం లేని పాత కార్మికోద్యమాలకు సంబంధించిన ఆర్గనైజేషన్‌లలో చెక్కుచెదరకుండా కింది నుండి పైకి వ్యాపించి ఉంది. ప్రమాదకరమయిన బూర్జువా వాతావరణ ప్రభావం వల్ల అలాంటి నిర్మాణాలు, బాధ్యతల నిర్వహణలో రెండు వేరు వేరు భాగాలుగా తయారైనాయి. సమైక్య ప్రయత్నంలో ఉండాల్సిన సజీవ సంబంధాల స్థానే, నిష్ఫలమైన నామమాత్రమైన ప్రజాస్వామికము చోటుచేసుకుంది. చురుకైన నాయకత్వము, స్తబ్దులుగా ఉండే సాధారణ ప్రజలుగా అలాంటి నిర్మాణాలు తయారైనాయి. బూర్జువా వాతావరణ ప్రభావంలో విప్లవకర కార్మికోద్యమాలు కూడ అలాంటి ద్వంద్వ విధానానికి ఫార్మలిజానికి ఎంతోకొంత గురికావడం అనివార్యం.

కమ్యూనిస్టు పార్టీలు ప్రధానంగా ద్వంద్వ విధానాలను అధిగమించాలి. అందు కొరకు క్రమబద్ధమయిన పట్టుదల సడలని, రాజకీయ సంబంధమయిన కృషి కొనసాగించాలి. నిరంతర అభివృద్ధిని సాధిస్తూ పునర్విమర్శించుకొని పురోగమించే పద్ధతులు అవలంభించాలి."

7. "సాధారణ ప్రజలతో కూడిన ఒక సోషలిస్టు పార్టీని (అంటే ఆచరణతో నిమిత్తం లేకుండా ఆశయాలను అంగీకరించే వారందరినీ చేర్చుకొనే పార్టీని) కమ్యూనిస్టు పార్టీగా మార్చాలంటే అంతకు పూర్వమున్న పద్ధతులన్నిటినీ అలానే ఉంచి, కేవలం అధికారాన్నంతటినీ కేంద్ర నాయకత్వం చేతుల్లో కేంద్రీకరింప చేయడం మాత్రమే చాలదు. కేవలం కాగితాలపై (తీర్మానాలపై) ఆమోదించడం ద్వారా లభించే కేంద్రీకృతాధికారం కాదు కావలసింది వాస్తవికమయిన కేంద్రీకృతాధికారం కావాలి. అత్యధికులయిన పార్టీ సభ్యులు తమ సాధారణ కార్యకలాపాలలోనూ, పోరాటాలలోనూ, ఆ కేంద్రీకృతాధికారాన్ని ప్రధానమైన శక్తివంతమయిన సాధనంగా గుర్తించినప్పుడే అలాంటిది సాధ్యపడుతుంది. లేకుంటే ఆ కేంద్రీకృత అధికారం సాధారణ సభ్యులకు నిరంకుశత్వంగా కనిపిస్తుంది. అలాంటప్పుడు అది కేంద్రీకృతాధికారం పట్లనూ, మొత్తం నాయకత్వం పట్లనూ, అసలు కట్టుదిట్టమయిన క్రమశిక్షణ పట్లనూ కూడా వారిలో వ్యతిరేకతకు దారితీయవచ్చు. నిరంకుశాధికారానికి మరో పార్శ్వమే అరాచకవాదం.

పార్టీలో చోటుచేసుకొనే నిరంకుశాధికార, అరాచకవాద ధోరణులను కేవలం నామమాత్రమైన ప్రజాస్వామిక పద్ధతి నిర్మూలించలేదు. నామమాత్రమైన ప్రజాస్వామికాన్ని ఆధారం చేసుకొనే అలాంటి ధోరణులు పుట్టిపెరుగుతాయి. కాబట్టి బలమయిన నాయకత్వాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని కలిగియున్న కేంద్రీకృతాధికారం గల నిర్మాణాన్ని కేవలం నామమాత్రమైన ప్రజాస్వామికముపై ఆధారపడి నిర్మించాలని కాంక్షిస్తే మాత్రం అది సాధ్యపడేది కాదు. పార్టీలో ఉన్న నాయకత్వపు విభాగానికీ, సాధారణ సభ్యులకూ మధ్య, అలానే మొత్తం పార్టీకీ దానికి బయటనున్న విశాల కార్మికవర్గానికీ మధ్య, పరస్పరం సజీవ సంబంధాల అభివృద్ధి కొనసాగింపు అనే అత్యవసర ప్రాథమిక షరతులపై ఆధారపడి

మాత్రమే అలాంటిది సాధ్యపడుతుంది. (1921లో మూడవ ఇంటర్నేషనల్ ఆమోదించిన "పార్టీ నిర్మాణ సూత్రాలు" అనే థీసీస్‌లోని 6,7 సూత్రాలు)

పైన ఉదహరించిన నిర్మాణ సూత్రాలరీత్యా కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకొని ఆచరించడానికి ఈ క్రింది ఐదు ప్రధానాంశాలను సర్వదా మనస్సులో ఉంచుకోవాలి.

1. కేంద్రీకృత ప్రజాస్వామికము అంటే కేంద్రీకృత అధికారాన్నీ, కార్మిక ప్రజాస్వామికాన్నీ-వాస్తవంలో ఈ రెండింటినీ సమ్మిళితం చేయడమే.

2. పార్టీ, పార్టీకి బయట ఉన్న పీడిత ప్రజానీకమూ కదిలి నిరంతరముచేసే కృషి పోరాటాల మూలంగా అలాంటి కేంద్రీకృత ప్రజాస్వామికము సాధ్యపడుతుంది.

3. అధికారాన్ని కేంద్రీకృతం చేయడమంటే అర్థం నామమాత్రంగా కేంద్రీకరించడం కాదు. కమ్యూనిస్టు కార్యకలాపాల నన్నింటినీ కేంద్రీకృతం చేయడమే.

4. చురుకయిన నాయకత్వపు విభాగము, స్తబ్ధతలో ఉండే సాధారణ పార్టీ సభ్యుల పీడిత ప్రజల విభాగము పార్టీ నిర్మాణాలలోని ఈ ద్వంద్వ విధానాన్ని నిర్మూలించాలి.

5. పార్టీలోని నాయకత్వపు విభాగానికీ, సాధారణ పార్టీ సభ్యులకు మధ్యనూ, అలానే మొత్తం పార్టీకీ, పీడిత ప్రజానీకానికీ మధ్యనూ: పరస్పర సజీవ సంబంధాల అభివృద్ధి కొనసాగింపు, అనే అత్యవసర ప్రాథమిక షరతులపై ఆధారపడి మాత్రమే, క్రమబద్ధమయిన పట్టుదలతో కూడిన కృషి ద్వారా, నిరంతరాభివృద్ధినీ సాధిస్తూ, పునర్విమర్శించుకుంటూ పురోగమించే పద్ధతుల నవలంభించాలి.

పై విషయాలను శ్రద్ధగా పరిశీలిస్తే ఒక విషయం బోధపడుతుంది. కేంద్రీకృత ప్రజాస్వామికము అనేది కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కేవలం క్రమశిక్షణను కట్టుదిట్టంగా నెలకొల్పడానికీ, సమాజమంతటా వ్యాపించియున్న బూర్జువా సంస్కృతీ ప్రభావం మూలంగా పార్టీ నిర్మాణంలో గ్రూపులు, ముఠాలు వగైరా ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడానికీ మాత్రమే పరిమితమయిన నిర్మాణ సంబంధమయిన సాంకేతిక విధానము (టెక్నిక్) మాత్రమేకాదు. అయితే కేంద్రీకృత ప్రజాస్వామిక విధానానికీ, క్రమశిక్షణకు సంబంధించిన పై జాగ్రత్తలు పాటించడానికీ అసలు సంబంధమే లేదనికాదు దీని అర్థం. మొత్తం సమస్యకు సంబంధించి అది కేవలం ఒక చిన్న కోణం మాత్రమే. ప్రధానంగా అది, తన నాయకత్వం క్రింది అశేష పీడిత ప్రజానీకంలో విప్లవ చైతన్యాన్ని పెంచి, వారిని సామాజిక విప్లవంలో సంఘటితపరచడానికి, పరిస్థితులకు అనుగుణ్యమయిన వ్యూహమూ ఎత్తుగడలతో వారిని విప్లవయుద్ధంలో నడిపించి విప్లవాన్ని జయప్రదం చేయడానికీ, కార్మికవర్గం ఆచరించవలసిన నిర్మాణ విధానము. అంతేకాదు అది కార్మికవర్గము ఒక్కటి మాత్రమే ఆచరించగలిగిన విప్లవ కార్యాచరణ విధానము అనడంలో కూడా ఆశ్చర్యం లేదు.

"ప్రజలు తమ్ముతాము విముక్తి చేసుకుంటారు." "ప్రజలే నిజమయిన విప్లవకారులు" అనే మార్క్సిస్టు ప్రాథమిక సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసించేవారు మాత్రమే అలాంటి విప్లవ కార్యాచరణకు పూనుకోగలరు. పై సిద్ధాంతాన్ని కేవలం మాటలలో మాత్రమే ఆమోదించేవారు కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని దాని వాస్తవమయిన అర్థంలో అమలుజరుపలేరు. అలాంటి వారి చేతిలో అది నామమాత్రంగానో లేక యాంత్రికంగానో రూపుదాల్చక తప్పదు. కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని పేరుకు మాత్రమే ఆమోదించి, దాని వాస్తవిక అర్థంలో అమలుజరపలేని పార్టీలు పేరుకు కమ్యూనిస్టు పార్టీలుగానే ఉన్నప్పటికీ ఆచరణలో అవి హద్దులులేని పెత్తనం చెలాయించే నాయకులు, వారిని గుడ్డిగా అనుసరించే సాధారణ పార్టీ సభ్యులు-పీడిత ప్రజలుగా చీలి ద్వంద్వ విధానాలు అమలుజరిగే బూర్జువా పార్టీలుగానో లేక విప్లవ ఆదర్శాల పేరుతోనూ, విప్లవకర క్రమశిక్షణ ముసుగులోనూ, పచ్చి నియంతృత్వాన్ని అమలుజరిపే టెర్రరిస్టు పార్టీలలాంటి పెటీబూర్జువా పార్టీలుగానో పరిణమిస్తే ఆశ్చర్యం లేదు. పైన పేర్కొన్న ప్రధానాంశాలను వివరంగా పరిశీలించుదాం.

**కేంద్రీకృతాధికారము, కార్మిక ప్రజాస్వామికాల సమ్మేళనాలు:**

మూడవ ఇంటర్నేషనల్ రూపొందించిన నిర్మాణ సూత్రాలననుసరించి కేంద్రీకృత ప్రజాస్వామికంలో రెండు అంశాలు ఇమిడిఉన్నాయి. ఒకటి కేంద్రీకృత అధికారము, రెండవది కార్మిక ప్రజాస్వామికము. కేంద్రీకృత అధికారము అంటే అపారమయిన విశ్వాసంతో, విప్లవ సారధ్యానికి సంబంధించిన సర్వాధికారాలను నాయకత్వానికి స్వేచ్ఛగా తమంతతాము దఖలుపరచి, తామంగీకరించినా లేకున్నా క్రింది కమిటీలు, పార్టీ సాధారణ సభ్యులు, పీడిత ప్రజలు అమలుజరిపే విధానము, ఆచరణలో అది ఈ రూపంలో ఉంటుంది.

1. ప్రతి కామ్రేడ్‌కూ ప్రతి విషయంలోనూ తన అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంటుంది. కేంద్రకమిటీ తీర్మానాలపై కూడ తన విమర్శ పంపేహక్కు ప్రతి సభ్యుడికి ఉంటుంది.

2. ప్రతి యూనిట్, మెజారిటీ నిర్ణయానికి మైనారిటీ చిత్తశుద్ధితో కట్టుబడి ఉండాలి.

3. క్రింది యూనిట్లు, పై కమిటీల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి. భిన్నాభిప్రాయాలు ఉంటే తెలియపరుస్తూనే పై కమిటీల నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలుజరపాలి.

4. పార్టీ కాంగ్రెసు నిర్ణయాలను అందరూ శిరసావహించాలి.

5. పార్టీ కమిటీలకూ, పార్టీ సభ్యులకూ మధ్య, పార్టీకీ, పీడిత ప్రజలకూ మధ్య కార్మికవర్గ ప్రజాస్వామిక పద్ధతిలో సజీవ సంబంధాలుండాలి.

కార్మిక ప్రజాస్వామికము అంటే నామమాత్రమయిన ప్రజాస్వామికము లాంటిదిగాక, సాధారణ పార్టీ సభ్యుల, విప్లవాన్ని కొనసాగించాల్సిన పీడిత ప్రజల, మనోభీష్టాలనూ చైతన్య స్థాయినీ అనుసరించి మాత్రమే నాయకత్వము కార్యాచరణకు సంబంధించిన నిర్ణయాలు చేసే నిజమయిన ప్రజాస్వామిక విధానము. బూర్జువా సమాజము పెంపొందించిన వాతావరణంలో పై రెండూ ఒకదానికొకటి విరుద్ధమయిన అంశాలుగా కనిపిస్తాయి. కానీ కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, ఆచరణకూ, చిత్తశుద్ధితో అంకితమయిన నాయకత్వం ఉంటే సారాంశంలో ఆ రెండు అంశాలకు మధ్య వైరుధ్యము ఉండాల్సిన పనిలేదు. బూర్జువా వాతావరణంలో పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు అంశాలనూ సమన్వయించి, సమ్మేళనపరచి, విప్లవ పురోభివృద్ధికి కృషిచేయడమే కేంద్రీకృత ప్రజాస్వామిక సారాంశం.

పరస్పర విరుద్ధంగా కనిపించే పై రెండు అంశాలను సమన్వయించడం ఆచరణలో సాధ్యమా? పీడిత ప్రజల, సాధారణ పార్టీ సభ్యుల, అపార విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం ఉన్నప్పుడు అలాంటి సమన్వయం సాధ్యమే. బలమయిన శత్రువుతో పోరాడి విప్లవాన్ని జయప్రదం చేయడానికి అలాంటి సమన్వయం ఒక్కటే అనివార్యంగా పాటించవలసిన విధానంకూడా.

అందువల్లనే కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని ఖచ్చితంగా అమలుజరపడమంటే ఆచరణలో బలమయిన, పీడిత ప్రజల, సాధారణ పార్టీ సభ్యుల ప్రగాఢ విశ్వాసాన్ని పొందిన నాయకత్వాన్ని కమ్యూనిస్టు పార్టీలలో నిర్మించడమేనని, ఇంటర్నేషనల్ రూపొందించిన నిర్మాణ సూత్రాల నుండి పైన ఉదహరించిన ఆరవ సూత్రం వివరించింది. కమ్యూనిస్టు పార్టీల దృష్టిలో బలమయిన నాయకత్వమూ అంటే సర్వదా విప్లవ యుద్ధానికి సన్నద్ధంగా ఉంటూ–విప్లవ పురోభివృద్ధి దృష్ట్యా, అనుక్షణము మారుతూవుండే పరిస్థితులకు అనుగుణ్యంగా త్వరత్వరగా నిర్ణయాలను తీసుకోగలిగి, విప్లవ విజయం కొరకు సర్వస్వాన్ని త్యజించడానికి సిద్ధమై జయప్రదంగా విప్లవ విజయానికి సారధ్యం వహించగల నాయకత్వమనే అర్థం. పై రెండు లక్షణాలలో ఏది లోపించినప్పటికీ అంటే విప్లవానికి సర్వదా సంసిద్ధంగా ఉండేందుకు అవసరమయిన మానసిక సంసిద్ధత లోపించినా, ఆ సన్నద్ధత సమృద్ధిగా ఉండి ఆ యుద్ధంలో సంభవించే ఆటుపోటులకు అనుగుణ్యంగా త్వరత్వరగా పోరాటరూపాలను మార్చుకోగల చాకచక్యము, స్వార్థత్యాగము లోపించినా, ఆ ఆచరణలో విప్లవ విజయానికి తీరని అపచారం కలగకతప్పదు. ఆ రెండు లక్షణాలను సంతరించుకొని, పీడిత ప్రజల సాధారణ పార్టీ సభ్యుల అపార విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వమే, కేంద్రీకృత ప్రజాస్వామికం దాని నిజమైన అర్థంలో అమలుజరగడానికి గ్యారంటీ. కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని వాస్తవంగా అమలుజరపడమంటే సమర్థవంతమైన నాయకత్వాన్ని నిర్మించుకోవడమేననే మాటకు అదే అర్థము.

**పోరాటాల నుండే నాయకత్వం ఉద్భవిస్తుంది:**

సమర్ధవంతమయిన నాయకత్వము ఆకాశము నుండి వూడిపడదు. నిరంతరం వర్గపోరాటాల నుండే పీడిత ప్రజల సాధారణ పార్టీ సభ్యుల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీ నాయకత్వం ఉద్భవిస్తుంది. ఎలాంటి పోరాటాలూ జరగక, ఉద్యమం కేవలం ప్రచార స్థాయిలోనే ఉన్న పలుచోట్ల కూడా పార్టీ సభ్యులుండవచ్చు. ఒక గ్రామంలో ఒక ఫ్యాక్టరీలో లేదా ఒక కాలేజీలో పార్టీసెల్లు ఏర్పడింది అంటే ఆ గ్రామంలోని పీడిత ప్రజానీకాన్ని, ఫ్యాక్టరీలోని కార్మికులను, కాలేజిలోని విద్యార్థులను విప్లవోన్ముఖంగా సంఘటితపరచి నడపడానికి అవసరమైన నాయకత్వం బీజరూపంలో ఏర్పడినట్లే, అలా బీజరూపంలో నున్న నాయకత్వంగా ఏర్పడిన ఆ పార్టీ సెల్లు కూడ అచ్చటి పీడిత ప్రజల ఏదో ఒక రూపమయిన కార్యాచరణలో నుండే పుడుతుంది. కాని గాలిలో నుండి ఏర్పడదు. ఆ తర్వాత ఆ పార్టీ సభ్యులు ఒక ప్లాను ప్రకారం పని విభజించుకొని అచ్చట పీడిత ప్రజలను ఎంతగా ఉత్తేజపరచి వారి దైనందిన (రోజువారీ) సమస్యలపై పోరాటాలకు సన్నద్ధపరుస్తారో, ఎంతటి చాకచక్యముతో సాహసోపేతంగా త్యాగనిరతితో ఆ పోరాటాలను జయప్రదం చేయ ప్రయత్నిస్తారో, ఆ క్రమానికి అనుగుణ్యంగానే వారిలో నుండి పీడిత ప్రజల, సోదర పార్టీ సభ్యుల సానుభూతిపరుల ప్రగాఢ విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం తయారవుతుంది. అలాంటి నాయకత్వాన్ని అచ్చటి పీడిత ప్రజలు, సోదర సభ్యులు, సానుభూతిపరులు ఎంతగా విశ్వసిస్తారంటే తమ భవిష్యత్తుకు సంబంధించిన సర్వవిషయాలపై చొరవతో నిర్ణయాలు తీసుకొని తమకు సారధ్యం వహించే బాధ్యతనంతటినీ ఆ నాయకత్వం చేతులలో ఉంచి దాని ఆదేశాలను చిత్తశుద్ధితో పాటించడానికి తమంతతాముగా సిద్ధపడతారు.

మూడవ ఇంటర్నేషనల్ నిర్మాణ సూత్రాలలోని, పైన ఉదహరించబడ్డ ఆరవ సూత్రం చెబుతున్నట్లుగా కేవలం పార్టీ నిర్మాణం మొత్తంగా అంటే అప్పటికి ఉన్న పార్టీ సభ్యులందరూ కదలి, ఒక ప్లాను ప్రకారం పని విభజించుకొని పీడిత ప్రజలందరినీ ఉత్తేజపరచి తమ సమస్యలపై పోరాటానికి సన్నద్ధపరచి, ఆ సందర్భంగా సంభవించే కష్టాలన్నిటినీ ఆ పీడిత ప్రజానీకమంతటితో పాటు అనుభవించడానికి సిద్ధమై, ఆ పోరాటాన్ని జయప్రదం చేయటానికి అక్కడ పీడిత ప్రజానీకానికి అగ్రగామిగా నిలబడడం ద్వారా మాత్రమే అలాంటి స్థితి సుసాధ్యమవుతుంది.

అధికారాన్ని నాయకత్వం చేతులలో కేంద్రీకరించడమంటే అలాంటి నాయకత్వాన్ని నిర్మించడమే. అలా సాధారణ పార్టీ సభ్యుల, పీడిత ప్రజల ప్రగాఢ విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం లేకుండా అధికారాన్ని కేంద్రీకరింపజేయడము అనే మాటకు అర్థమే లేదు.

ఆ విధంగా, కేంద్రీకృత ప్రజాస్వామిక విధానాన్ని ఖచ్చితంగా అమలుజరుపుట, సమర్థవంతమయిన నాయకత్వం ఏర్పడుట–ఈ రెండూ ఒకదానిపై మరొకటి ఆధారపడియున్న విషయాలు. ఒకటి

జయప్రదంగా అమలుజరిగితేనేగాని రెండోది సాధ్యపడని పరస్పరాశ్రయాలైన అంశాలు.

పై సీట్లలోని పార్టీ సభ్యులు అలాంటి వర్గపోరాటాలకు చొరవతో నాయకత్వం వహించక, కేవలం రాజకీయాలు వల్లిస్తూ కాలక్షేపం చేయసాగితే, అందులోని ఏ ఒక్కరైనా నామమాత్రమయిన, తమకుతాము సంతృప్తిపడే నాయకులు కావచ్చునేమోగాని నిజమయిన పీడిత ప్రజల, సోదర పార్టీ సభ్యుల విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం మాత్రం అలాంటిది కాజాలదు. నిజమయిన అర్థంలో అలాంటి నాయకత్వం కేంద్రీకృత ప్రజాస్వామికం అమలుజరపడం అసంభవం.

**ప్రజాస్వామ్యం లేకుండా కేంద్రీకరణ అసాధ్యం:**

కేంద్రీకృత ప్రజాస్వామికం నిజమయిన అర్థంలో జయప్రదంగా అమలుజరగడానికి పీడిత ప్రజల సోదర పార్టీ సభ్యుల ప్రగాఢ విశ్వాసాన్ని పొందిన నాయకత్వం తప్పనిసరి అయిన షరతు అని చూసాం. ఆ విషయాన్ని చాలా బలంగా పార్టీ సభ్యులందరితో గుర్తింపజేయడానికి మూడవ ఇంటర్నేషనల్ తయారుచేసిన నిర్మాణ సూత్రాలలో కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని వివరించే రెండవ చాప్టరుకు "ప్రజాస్వామిక కేంద్రీకరణ గూర్చి" అని నామకరణం చేయబడింది. ఆ విషయాన్ని ఏ ఒక్కరు ఏమరుపాటుతో కూడ మర్చిపో వీలులేదు.

అలానే అంతటి విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం ఆచరణలో మొత్తముగా కదిలి పీడిత ప్రజల పోరాటాలకు అగ్రగామిగా నిలబడటం ద్వారానే తయారవుతుందని కూడ పైన చూశాం. అందులో గమనించాల్సిన ముఖ్యాంశం పార్టీ మొత్తముగా కదలడం అనేది. పార్టీ సభ్యులందరూ కదలకుండా, ఏ ఒక్కరిద్దరో కదిలి ప్రజాపోరాటాలు నడిపినప్పటికీ కూడ ఆ ఒక్కరిద్దరు పీడిత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకులుగా తయారుగావచ్చు. అవుతారు కూడ. అయితే పీడిత ప్రజలలో అలా ఏర్పడే విశ్వాసం, మొత్తం పార్టీపై కంటే ప్రధానంగా ఆ వ్యక్తులపై కేంద్రీకృతం కావడానికి హెచ్చు అవకాశాలు ఉంటాయి. పార్టీ మొత్తంపైన, పార్టీ కార్యక్రమంపైనగాక అలా వ్యక్తులపై పీడిత ప్రజలలో ఏర్పడే విశ్వాసం వెనుక ఉండే చైతన్యం విప్లవ అవసరాలరీత్యా చాలా దుర్బలమైనది. అందులో విప్లవ చైతన్యానికి బదులు వ్యక్తిపూజ ఎక్కువగా చోటు చేసుకునే అవకాశం హెచ్చు. తద్వారా నాయకులుగా తయారయిన వ్యక్తులు అవకాశవాదులై విప్లవ ద్రోహులుగా తయారయితే వారిపై అపార విశ్వాసము కలిగియున్న పీడిత ప్రజలుకూడ తప్పుదారి పట్టే ప్రమాదం లేకపోలేదు. ప్రతిదేశ విప్లవ చరిత్రలోనూ అలాంటి ఘటనలు కొల్లలుగా కనిపిస్తాయి.

అయితే అందుకు పరిష్కారమేమిటి? పీడిత ప్రజలను ఉత్తేజపరచడములోనూ, వారిని సన్నద్ధపరచి పోరాటాలు కొనసాగించటములోనూ మొత్తం పార్టీ (అంటే పై కమిటీల మార్గదర్శకత్వంలో అచ్చటనున్న పార్టీ సభ్యులందరూ) పాల్గొంటే, అందులో ప్రధానంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తూ నాయకులుగా తయారయిన కొద్దిమందితో పాటు మొత్తం పార్టీపై కూడ పీడిత ప్రజలలో విశ్వాసమేర్పడుతుంది. అంతేకాదు, తద్వారా నాయకులుగా తయారయిన కొంతమందికే గాక ఆ పోరాటంలో పాల్గొన్న తక్కిన పార్టీసభ్యులందరికీ పీడిత ప్రజలందరితోనూ సజీవ సంబంధాలేర్పడతాయి. అలాంటి స్థితిలో నాయకులుగా తయారయిన వారిలో ఒకరిద్దరో లేక మొత్తంగానో విప్లవ ద్రోహానికి తలపెట్టినప్పటికీ, ఆ నాయకులతో పాటుగా మొత్తం పార్టీపై కూడా విశ్వాసం ఏర్పడియున్న కారణంగా, పీడిత ప్రజలందరూ విద్రోహులుగా తయారయిన ''నాయకులను'' గుడ్డిగా అనుసరించలేరు. మొత్తం పార్టీపై కూడా వారికేర్పడిన విశ్వాసము, తక్కిన పార్టీ సభ్యులతో కూడ ఏర్పడ్డ సజీవ సంబంధాలు వారినలా విప్లవ ద్రోహులుగా మారిన ''నాయకులను'' గుడ్డిగా అనుసరించకుండా అడ్డుకుంటాయి.

అందువల్ల "ప్రజాస్వామిక కేంద్రీకరణ"కు సంబంధించి, సమర్థవంతమైన, పీడిత ప్రజల, సాధారణ పార్టీ సభ్యుల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీ నాయకత్వం ఏర్పడడానికి ఎంత ప్రాముఖ్యత ఉందో, ఆ నాయకత్వం క్రింద పనిచేసే సాధారణ పార్టీ సభ్యులలోనూ సమీకృతమయ్యే పీడిత ప్రజానీకంలోనూ, వ్యక్తిత్వము, తప్పొప్పులను తేల్చుకోగల శక్తి, నాయకత్వపు పొరపాటులను ఎత్తి చూపగల ధైర్యము, నాయకత్వము నిరంకుశంగా వ్యవహరిస్తే ధిక్కరించగల సత్తా, పెంపొందాలి అనేదానికి అంతకుమించిన ప్రాముఖ్యత ఉంది. కేంద్రీకృత ప్రజాస్వామికము నిజమయిన అర్థంలో అమలుజరగడానికి పార్టీసభ్యుల, పీడిత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకత్వం ఏర్పడడం ఎంత గ్యారంటీయో, సాధారణ పార్టీ సభ్యులలోనూ, పీడిత ప్రజలోనూ పై చైతన్యం ఏర్పడడం అంతకుమించిన గ్యారంటీ.

సాధారణ పార్టీ సభ్యులలోగాని, పీడిత ప్రజానీకంలోగాని ఆ లక్షణాలు వాటంతటకవే పెంపొందవు. అందుకొరకు పార్టీ పని విధానంలోనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పై పద్ధతిలో కృషి జరిగినప్పుడే పీడిత ప్రజలు విప్లవానికి చైతన్య పూర్వకంగా సన్నద్ధంకావడమేగాక, నిండయిన వ్యక్తిత్వంతోనూ, చొరవతోనూ, గుడ్డి అనుచరులుగాక తమ భవిష్యత్తును తాము రూపొందించుకోగల విప్లవ చైతన్యంతోనూ, పార్టీ నాయకత్వపు ఆదేశాలను శిరసావహించి కృషి చేస్తారు. విప్లవ కార్యాచరణకు చైతన్యంతో పూనుకుంటారు.

కాబట్టి కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని ఖచ్చితంగా అమలు జరపడమంటే సమర్థవంతమయిన పార్టీ నాయకత్వాన్ని నిర్మించుకోవడమెలానో, అలానే సమర్థవంతమయిన నాయకత్వాన్ని నిర్మించడమంటే పార్టీ సభ్యులనూ, పీడిత ప్రజానీకాన్ని విప్లవంలో సంఘటితపరచడానికి నూటికి నూరుపాళ్ళు కార్మికవర్గ ప్రజాస్వామిక పద్ధతుల్లో కామ్రేడ్ మావో వివరించిన ప్రజాపంథా పద్ధతులకు

కట్టుబడి చైతన్యయుతంగా కృషి చేయడం కూడ. అలా ఏర్పడ్డ నాయకత్వమే కేంద్రీకృతాధికారాన్ని సద్వినియోగ పరచగలుగుతుంది. ప్రజాస్వామికం లేకుండా కేంద్రీకరణ సాధ్యంకాదు అనే మాటకు అర్థం అదే.

అలాంటి విప్లవకరమైన, చైతన్యపూరితమయిన పద్ధతిలో కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని అమలుజరిపినప్పుడే కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గ ప్రజాస్వామిక పద్ధతులలో పీడిత ప్రజలను సంఘటితపరచి కేంద్రీకృత పద్ధతులలో అంటే నియంతృత్వ పద్ధతులలో ఫ్యూడలిజాన్ని, సామ్రాజ్యవాదాన్ని దాని తొత్తులను సమూలంగా నిర్మూలించి మనదేశంలో జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయగలుగుతుంది.

తద్వారానే పార్టీ నిర్మాణంలో చురుకయిన నాయకత్వము స్తబ్ధతలో ఉండే సాధారణ సభ్యులు అనే ద్వంద్వ విధానం అంతరిస్తుంది.

అప్పుడే పార్టీకి పీడిత ప్రజానీకానికి మధ్య ఎడతెగని సజీవ సంబంధాలు నెలకొంటాయి.

పార్టీ నిర్మాణములోనూ, పార్టీకి బయట పీడిత ప్రజానీకంలో ఉండే సంబంధాలలోనూ, సంపూర్ణమయిన ప్రజాస్వామికం ఉట్టిపడాలి. అంటే కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని చైతన్యపూర్వకంగా ఆచరించాలి. మనమే చైతన్య పూర్వకంగా సమస్యను బయటకులాగి చర్చకుపెట్టాలి. ప్రజలందరినీ-ఆ సమస్యపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పనీయాలి. మనల్ని తిడుతున్నాసరే-అందుకు సిద్ధపడుతూనే వారి మనసులో ఉన్నదాన్నంతా స్పష్టంగా వెళ్ళగక్కనీయాలి. కొంతమంది కామ్రేడ్స్ ఉన్నారు. ప్రజలు చర్చకుపక్రమిస్తున్నారన్నా నాయకుల, నాయకత్వ సంస్థల అభిప్రాయాలకు విరుద్ధమయిన అభిప్రాయాలను ప్రజలు వెలిబుచ్చితున్నారన్నా అలాంటివారు భయపడతారు. తమ ముందున్న సమస్యలపై చర్చ ముగిసినవెంటనే హడావిడిగా సమావేశాన్ని ముగించి ఇంకేదో మాట్లాడుకుందామనుకుంటున్న ప్రజల ఉత్సుకతను చంపివేస్తారు. మరెవ్వరినీ మాట్లాడనీయకుండా ఉండే అలాంటి వైఖరి మరీ దారుణం. కేంద్రీకృత ప్రజాస్వామికం మన పార్టీ నిబంధనావళిలోనూ రాజ్యాంగ చట్టములోనూ, స్పష్టంగానే రాసివుంది. కాని వారుదాన్ని అమలుజరపరు, కామ్రేడ్స్ మనం విప్లవకారులం మనం నిజంగా ప్రజలకు హానికలిగే తప్పులు చేస్తే మనమే వాటిపై సోదర పార్టీ సభ్యుల, ప్రజల అభిప్రాయాన్ని కోరాలి. వారభిప్రాయాలను ఆత్మపరిశోధన చేసుకోవాలి.

ఒక్కొక్కసారి అలాంటి ఆత్మపరిశోధన ఒకసారికాదు ఎన్నో పర్యాయాలు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారితో ప్రజలు తృప్తిపడకపోతే మరోసారి, మరోసారి ఆ విషయంలో విమర్శించగలవారు ఇక మిగలనంతవరకు ఆత్మవిమర్శ చేసుకోవలసిందే." అని కామ్రేడ్ మావో అన్నాడు.

జనతా ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించడానికి మనం కొనసాగిస్తున్న పోరాటం జయప్రదమయ్యే లోపల శత్రువుయొక్క దారుణ హింసాకృత్యాల మూలంగా, ఎన్నో ఆటుపోట్లకు గురికావచ్చు. పోరాటం నీరసించినప్పుడల్లా ప్రజానీకంలో నిరుత్సాహం వ్యాపించడం సహజం. తిరిగి ప్రజల్లో విశ్వాసాన్ని రేకెత్తించడం పోరాటాన్ని పురోగమింపచేయడానికి పార్టీ మొత్తంగా ఎంతో శ్రమపడక తప్పదు. ఇప్పటికే మన పార్టీ అలాంటి పరిస్థితుల నెన్నింటినో ఎదుర్కొంది. ఇప్పటికీ ఎదుర్కొంటుంది. అలాంటి ఆటుపోటులను ఒడుదుడుకులను తట్టుకొని విప్లవోన్ముఖంగా ప్రజల నుత్తేజపరచడానికి ప్రజాస్వామిక పద్ధతుల అవసరం ఎంతఉందో వివరిస్తూ అదే ఉపన్యాసంలో మావో ఇలా అన్నారు.

"ప్రజలమీద ఆధారపడకుండా ప్రజల, పార్టీ సభ్యుల ఉత్సాహోద్రేకాలను సమీకృతం చెయ్యకుండా ఈ కష్టాలను అధిగమింపలేము. పార్టీ క్యాడర్లకు ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజెప్పకపోయినా, మనం వారి ముందు హృదయం విప్పి మాట్లాడి అలాగే మాట్లాడేందుకు వారిని ప్రోత్సహించకపోయినా, వారు మీరంటే బిడియపడుతూనే ఉంటారు. హృదయం విప్పి మాట్లాడడానికి జంకుతారు. అలాంటప్పుడు వారిలోని ఉత్సాహోద్రేకాన్నంతటినీ సమీకృతపరచటం సంభవం కాదు.

మనం కేంద్రీకృతాధికారమూ-ప్రజాస్వామికమూ, క్రమశిక్షణ-స్వేచ్ఛ లక్ష్యసిద్ధి కొరకు సమైక్యత-వ్యక్తిపరంగా మానసిక ఉపశమనము-ఈ రెండూ ఉన్న ఒక సజీవమయిన బలమయిన రాజకీయ వాతావరణాన్ని సృష్టించాలి. పార్టీ లోపలనూ, పార్టీ బయట ప్రజలలో ఉండే సంబంధాలలోనూ, కూడా అలాంటి వాతావరణాన్ని నిర్మించాలి. అలాంటి వాతారణము లేకుండా ప్రజల ఉత్సాహోద్రేకాలను సమీకృతపరచలేము. ప్రజాస్వామికము లేకుండా మన కష్టాలనెలా అధిగమించలేవో అలానే కేంద్రీకృతాధికారాన్ని అమలుజరిపే విధానం లేకుండా కష్టాల నుండి బయటపడడం కూడ అంతకంటే సాధ్యమయ్యే పనికాదు. అయితే ప్రజాస్వామికం లేకుంటే కేంద్రీకృతాధికారం అమలుజరగడమే అసంభవం."

విప్లవ ప్రజానీకంలోనూ, విప్లవ పార్టీ సభ్యులలోనూ కేంద్రీకృతమయిన సమైక్యతను సాధించకుండా విప్లవ యుద్ధములో పార్టీ నాయకత్వం కేంద్రీకృతాధికారాన్ని అమలుజరపడం సాధ్యమేకాదు. అలాంటి కేంద్రీకృత సమైక్యతను అటుపార్టీ సభ్యులందరిలోనూ, ఇటు పీడిత ప్రజానీకంలోనూ సాధించడానికి ప్రజాస్వామిక పద్ధతికి గల ప్రాముఖ్యతను వివరిస్తూ కామ్రేడ్ మావో ఇలా అన్నారు.

"ప్రజాస్వామికం లేకుంటే కేంద్రీకృతాధికారం దాని నిజమయిన అర్థంలో సాధ్యపడదు. ప్రజాస్వామిక పద్ధతి అమలుజరగకపోతే ప్రజల మధ్య విభిన్న అభిప్రాయాలు అలానే కొనసాగుతాయి. వారి ముందున్న సమస్యల గూర్చి ప్రజలలో ఏకాభిప్రాయము

# కొత్త రిజర్వేషన్ విధానం
# రాజ్యాంగ చట్టం ముసుగులో మనుధర్మ శాస్త్రపు వేటు

పార్లమెంట్‌లో ఎన్నో బిల్లులు పెండింగ్‌లో ఉండగా అగ్రకులాలకు 10% రిజర్వేషన్ బిల్లు మాత్రం ఏ ఆటంకం లేకుండా 48 గంటలలోపు చట్టంగా తయారయ్యింది. చట్టసభలలో మహిళలకి 33% ప్రాతినిధ్యం ఇవ్వాలనే మహిళా బిల్లు ఎన్నో ఏళ్లుగా, చట్ట రూపం తీసుకోకుండా ప్రచార అస్త్రంగానే మిగిలిపోయింది. అన్ని పార్టీలలో ఉన్న భూస్వామ్య పితృస్వామ్య భావజాలానికి ఇది ఒక పెద్ద ఉదాహరణ. షెడ్యూల్డ్ కులాలలో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కోసం దళితుల్లోని ప్రధానంగా మాదిగలు సహ అనేక కులాలు సుమారు నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్నా గానీ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో తమ అవకాశవాద రాజకీయాలకి అనుగుణంగా ఆ సమస్యను ఉపయోగించుకుంటూ తమ పబ్బం గడుపుకుంటున్నారు తప్ప వారి సమస్యను పట్టించుకున్నది లేదు. పీడిత ప్రజల, వర్గాల సమస్యలని పట్టించుకోవటంలో ఏళ్లు గడచిపోయినా గానీ, నిమ్మకు నీరెత్తినట్లు పట్టించుకోని పాలక వర్గ పార్టీలు అన్నీ కలిసి ఈ బిల్లుని ఇంత వేగంగా ఆమోదించి చట్టంగా చేసి అమలు చేయాలనటం లోకసభ ఎన్నికలలో ఓట్లు దండుకునే వారి రాజకీయాలను తెలుపుతుంది.

లోకసభ ఎన్నికలకు ముందరి ఆఖరి శీతాకాలం సమావేశాలు మర్నాడు ముగుస్తాయనగా జనవరి 8న నూట ఇరవై నాలుగవ రాజ్యాంగ సవరణ బిల్లు, 2019 అనే పేరుగల ఈ బిల్లును కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. ఈ బిల్లుని జనవరి 9న లోక్‌సభలో చర్చకు పెడితే నాలుగు గంటల చర్చ అనంతరం 323 మంది సభ్యులు ఆమోదం తెలుపుతూ ఓటు వేశారు. ముగ్గురు సభ్యులు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. ఆ మర్నాడు రాజ్యసభలో చర్చకు పెడితే 8 గంటలు చర్చించి 165 మంది అనుకూలంగా ఓటు వేశారు. కేవలం ఏడుగురు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. అంటే కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన తరువాత 48 గంటల లోపలే ఈ బిల్లు ఆమోదం పొందింది. 103వ రాజ్యాంగ సవరణ చట్టంగా మారి, జనవరి 12న రాష్ట్రపతి ఆమోదం కూడా పొంది, జనవరి 14 నుండి అమలులోకి వచ్చింది. పార్లమెంట్‌లో ఎన్ని పార్టీలు ఉన్నా, అవి ఎంత లౌకికత్వం గురించి చెప్పినా గానీ సభలో మాత్రం ఏ తటపటాయింపు లేకుండానే అవి వాటి బ్రాహ్మణవాద హిందూ అభిమానాన్ని సహజంగానే చాటుకున్నాయి. ఎన్నికల్లో గెలవటం కోసం దళిత, వెనకబడిన వర్గాల అభ్యున్నతి గురించి ఎంత ప్రచారం చేసినా, ఎన్ని హామీలు ఇచ్చినా తుదకు పాలకవర్గ పార్టీలన్నీ తమ దోపిడీ కులాల అధికారం కోసం, హక్కుల కోసమే అంకితమై పనిచేస్తున్నాయి అనే నిజాన్ని మరొక

---

ఏర్పడకపోతే కేంద్రీకృత విధానాన్ని అమలుజరపడమే సాధ్యం కాదు. అసలు కేంద్రీకరణంటే ఏమిటి? ప్రపథమంగా అది ఏ భావ సమైక్యతపై ఆధారపడి పంథానూ, పథకాలనూ, రూపొందించి కార్యాచరణకు సంబంధించిన ఖచ్చితమయిన ఆదేశాలనిస్తామో అలాంటి సరియైన భావాల కేంద్రీకరణ. దాన్నే కేంద్రీకృత సమైక్యత అంటాము. ప్రజలకు సమస్యలే అర్థంగాకపోయినా వారికి అర్థమయ్యి తమ భావాలను స్పష్టంగా చెప్పలేకపోయినా, కోపావేశంలో ఉండి ఆవేశాన్ని వెళ్ళగ్రక్కే అవకాశం వారికి దొరకకపోయినా అలాంటి కేంద్రీకృత సమైక్యత ఎలా సాధ్యపడుతుంది."

పార్టీలోనూ పీడిత ప్రజానీకాన్ని సంఘటితపరచే సందర్భంలోనూ కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని లక్ష్యపెట్టకుండా, తమకు తెలియకుండానే విప్లవాభివృద్ధికి అపారనష్టాన్ని చేకూర్చే కామ్రేడ్స్ యొక్క బ్యూరాక్రటిక్ (నిరంకుశ విధానాలు) విధానాలనూ, ఆ విధానాలమూలంగా పార్టీ నిర్మాణంలో తలయెత్తే కొంతమంది బ్యూరాక్రాట్లను, వారి ద్వారా విప్లవాభివృద్ధికి చేకూరే నష్టాలను వివరిస్తూ కామ్రేడ్ మావో ఇలా మాట్లాడారు.

అయితే అలాంటి కామ్రేడ్సందరూ చెడ్డవారా? ఎంతమాత్రమూ కాదు కామ్రేడ్ మావో చెప్పినట్లు వారిలో చాలామంది ఎంతో అనుభవమున్న కామ్రేడ్స్ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడానికి, సిద్ధపడినవారు, పోరాటంలో నిమగ్నమై ఉన్నారు. అయితే అలాంటి వారిలో ఇంతటి ఘోరమయిన లోపాలు ఎందుకు ప్రతిబింబిస్తున్నాయి. ఇది తీవ్రంగా ఆలోచించాల్సిన ప్రశ్న.

"ప్రజలే నిజమయిన విప్లవకారులు. వారే తమ్ము తాము విముక్తి చేసుకుంటారు." అనే ప్రాథమిక కమ్యూనిస్టు సూత్రాన్ని జీర్ణించుకొని, ప్రజల నుండి ప్రజలలోకి అనే ప్రజాపంథా సూత్రానికి అనుగుణ్యంగా కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతులను పార్టీలోనూ, పార్టీకి బయట పీడిత ప్రజలతో ఉండే సంబంధాలలో, చిత్తశుద్ధితో అమలుజరపడానికి ప్రత్యేక కృషిచేయుట యొక్కటే పై ప్రమాదాన్ని నివారించడానికి ఏకైక మార్గం."

"ప్రజల ఎడల ప్రజాస్వామిక పద్ధతిని అవలంభించడం, శత్రువుపై నియంతృత్వాన్ని అమలుజరపడం ఈ రెండూ వేర్వేరు అంశాలు కాదు. ఆరెండిటి సమన్వయమే కార్మికవర్గ నియంతృత్వము–అదే జనతా ప్రజాస్వామిక నియంతృత్వము."

(జనవరి, జూన్ 1982 'ఎర్రజెండా'లో వచ్చిన వ్యాసాన్ని సంక్షిప్తీకరించి ఇస్తున్నాం)

○

సారి నిరూపించాయి. దోపిడీ కులాల అభిజాత్యాన్ని, పాలక వర్గాల కుటిలత్వాన్ని ఎటువంటి ముసుగులు లేకుండా చాటుకున్నాయి.

దోపిడీలాలలోని పేదవారికి రిజర్వేషన్లు కల్పించాలి అనే వాదన ఈ రోజు కొత్తగా వచ్చినదేమీ కాదు. గతం నుండి కూడా పలు బూర్జువా రాజకీయ పార్టీలు, కొందరు కుహనా మేధావులు తమ వాదనను విన్పిస్తున్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా దోపిడీకులాలలోని పేదవారికి రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నికల్లో ప్రచారం చేసింది. అయితే, గతంలో ఈ డిమాండ్ ముందుకు వచ్చిన సందర్భాలలో సుప్రీంకోర్టు ఆర్థిక పరమైన వెనకబాటు ప్రాతిపదికగా రిజర్వేషన్లను కల్పించటం అనేది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం అని స్పష్టం చేసింది. ఇందిరా సాహ్నీ (1992) కేసులో జస్టిస్ సావంత్, జస్టిస్ సహాయ్‌లు "రిజర్వేషన్లు ఆర్థిక పురోగతికో, పేదరిక నిర్మూలనకో ఉద్దేశించినవి కావు. వారి సామాజిక వెనుకబాటుతనం వల్ల, తత్పర్యవసానమైన విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం వల్ల రాజ్యాధికారానికి బయట ఉండిపోయిన వారికి తగిన వాటా ఇవ్వటం కోసం ఉద్దేశించినవి" అన్నారు. అయినా గానీ, ఇపుడు లోకసభ దానిని బుట్టదాఖలా చేసింది.

బీజేపీ చేతికి అధికార పగ్గాలు వచ్చాక గడచిన 5 సం॥లలో దీని గురించి ఏమి మాట్లాడకుండా తన పదవీ కాలంలోని ఆఖరి పార్లమెంట్ సమావేశంలో ఆఖరి రోజున ఈ బిల్లును హడావుడిగా తీసుకొని వచ్చింది. దీనికి కారణాలు అనుకుంటే ఒకటి 2018 ఎప్రిల్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్.సీ. ఎస్.టీ అత్యాచార నిరోధక చట్టానికి తూట్లు పొడుస్తూ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా ఓట్ల ఆశతో పార్లమెంటు ఆ చట్టాన్ని యధాతథంగా అమలుకు మరో చట్టాన్ని ముందుకు తెచ్చిన నేపథ్యంలో మధ్యప్రదేశ్ సహ దేశంలోని కొన్ని ప్రాంతాలలో దోపిడీ కులాలు తమకూ రిజర్వేషన్లు కావాలనే ఆందోళనకు దిగాయి. దాన్ని సాకుగా చేసుకొని తక్షణం జరిగే లోకసభ ఎన్నికలలో దోపిడీకులాల ఓట్లు దండుకోవాలనే దానితో ఈ బిల్లుకు మోదీ సర్కార్ నడుం బిగించింది. రెండవ కారణం 2018 నవంబర్‌లో వెల్లడైన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చూసి గుండె బేజారెత్తిన బీజేపీ ఎలాగైనా దోపిడీకులాల ఓట్లు సంపాదించి మళ్లీ అధికారం చేపట్టాలనే ఎత్తుగడతోనే ఆఖరి నిముషంలో అంత హడావుడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టింది. దీనిలో బీజేపీ చాణక్యం అందరికీ అర్థం అయినప్పటికీ ఎన్నికల సమయంలో ఇది ఎవరికైనా ఒక పాపీలాప్‌లాగా పని చేస్తుందనేదే అందరి అభిప్రాయం.

ఈ బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు ఎన్నికలలో సహజంగానే దోపిడీకులాల ఓట్లు పడవనే ముందుచూపుతోనే ప్రతిపక్ష పార్టీలు బిల్లుపై చర్చ జరిగిన సమయంలో చిన్న, చిన్న అభ్యంతరాలు ఏవి చెప్పినా గానీ మొత్తంగా బిల్లుని అంగీకరించాయి. ఎంఐఎం, అన్నా డీఎంకే తప్ప అన్నీ బిల్లుపై ఆమోద ఓట్లేశాయి. కీలెరిగి వాతపెట్టడంలో బహు నేర్పరులైన బీజేపీ నేతలు ప్రతిపక్షాల నోరు మూయించి బిల్లు నెగ్గించుకున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ శక్తులు ఎందుకని దళిత, బడుగు వర్గాల రిజర్వేషన్లని వ్యతిరేకిస్తున్నాయి అనే విషయంలో మనకి స్పష్టత ఉండాలి. భారతదేశంలో అమలు అవుతున్న కుల వివక్ష, అణచివేత ఎంతో క్రూరమైనది, దుర్మార్గమైనది. కులాల పేరుతో సమాజంలో అంతరాలు సృష్టించి, వేల సంవత్సరాలుగా దోపిడీ కులాలు అధికారం, సంపద తమ చేతిలో ఉంచుకుని శ్రామిక కులాలైన శూద్ర, దళిత కులాలన్నింటికీ దూరంగా ఉంచారు, ఉంచుతున్నారు. వారిని అంటరానివారుగా, కింది కులాలుగా చూస్తూ వారి శ్రమ శక్తిని అమానవీయంగా దోచుకుంటూ వారిని పశువుల కన్నా హీనంగా చూస్తున్నారు. నేటికీ సమాజంలో దళితులు అంటరానివారుగానే ఉన్నారు. మల మూత్రాలను, మురుగుకాల్వలను శుభ్రం చేసే పనులు ఈనాడు కూడా వారే చేయాలి. ఏ కులం వాళ్లు ఆ కుల వృత్తే చేయాలన్న సామాజిక కట్టుబాటును పరాధీన, దోపిడీ కులాలు బలంగా అమలు చేయటంతో శ్రామిక కులాల బతుకులు అణగారిపోతున్నాయి. వేల సంవత్సరాలుగా సామాజికంగా అమానుషమైన అణచివేతకి గురవుతూన్న దళిత, బడుగు వర్గాల పురోగతికి, కుల నిర్మూలన లక్ష్యంతో అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లని పొందుపరచడానికి ఎనలేని కృషి చేశాడు. ఫలితంగా దళిత, ఆదివాసీలలో కొందరైనా చదువుకుని, ఉద్యోగాలు చేయటం, సమాజంలో తగిన గుర్తింపు కోసం పోరాడడం హిందుత్వ శక్తులు భరించలేకుండా ఉన్నాయి. రిజర్వేషన్ల ఎత్తివేత గురించి అంబేద్కర్‌నే అడ్డం పెట్టుకుంటూ పదే పదే ముందుకు వస్తుంటాయి. కానీ, వారి చర్చలకు ఇప్పటికీ దేశంలోని పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో పాటు ఇప్పుడు ఇంకా తమ అధికారాన్ని దక్కించుకోవడానికి ఇతర రిజర్వేషన్‌లతో పాటుగా దోపిడీ కులాలలోని పేదవారికి 10% రిజర్వేషన్లు ఇవ్వాలనే చట్టాన్ని తీసుకువచ్చాయి.

బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితుల, మైనారిటీలపై చాలా క్రూరమైన దాడులు జరుగుతున్నాయి. ఇవి ఇంకా పెరుగుతాయి. రిజర్వేషన్‌ల ఫలితంగా రోహిత్ వేముల వంటివారు ఉన్నత విద్యనభ్యసించడం గిట్టని హిందుత్వ శక్తులు అనేక రకాలుగా వారిని వేదింపులకు గురిచేసి హతమార్చిన తడి ఆరనేలేదు. ఇక ఇపుడు దోపిడీ కులాలకూ రిజర్వేషన్‌లను తెచ్చారు. నిజానికి వారు ఆ చట్టం పరిధిలో అగ్రకులాలను నిర్వచించిన చందం చూస్తే మళ్లీ అందులోనూ నిరుపేదలకూ అవి దక్కవనేది గమనించాలి. సామాజిక అణచివేత ప్రాతిపదికగా రూపొందిన రిజర్వేషన్లని కాదని అధికార దాహం, అగ్రకులాల అభిమానంతో రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా రూపొందించిన కొత్త రిజర్వేషన్‌లతో లాభపడేది మళ్లీ ఆ కులాలలోని సంపన్నులే!.

దేశంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నప్పుడల్లా అగ్రకులాల

వారు పెద్ద ఎత్తున గగ్గోలు పెట్టడం, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఆందోళనలు, విధ్వంసాలు చేయటం మనకి తెలిసిందే. మరి 70 సంవత్సరాలలో రిజర్వేషన్లు సరిగ్గా అమలు అయ్యాయా? దళితులకి, పీడిత కులాలకి ఎంత వరకు మేలు జరిగిందనేది చూస్తే వాస్తవాలు అర్థమవుతాయి. భారత న్యాయ వ్యవస్థలో అత్యున్నత కోర్టులలో 92 శాతం న్యాయమూర్తులు బ్రాహ్మణులే ఉన్నారు. అందుకనే కోర్టుల్లో మనువాద న్యాయం రాజ్యమేలుతోంది. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులలో 98% అగ్రకులాల వారే ఉన్నారు. ఆలిండియా గ్రేడ్ ఎ సర్వీసులో 89% అగ్రవర్ణాల వారే ఉన్నారు. రాజకీయరంగంలో చూస్తే కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఎంపి, ఎమ్మెల్యేలలో ఎక్కువ శాతం దోపిడీకులాలకి సంబంధించిన వారే ఉన్నారు. ఉద్యోగాలలో కూడా దోపిడీ కులాలదే పై చేయి. డి.ఓ.పి.టి వార్షిక నివేదిక 2014-2015లో కేంద్ర ప్రభుత్వంలోని 55 విభాగాలలో గ్రూపు 'ఎ'లో మొత్తం 74,866 పోస్టులు ఉండగా ఓబీసీలు 8,316 (11.11%), ఎస్సీలు 10,434 (13.94%), ఎస్టీలు 4,354 (5.82%), గ్రూపు 'బి'లో మొత్తం పోస్టులు 1,88,776 కాగా ఓబీసీలు 20,069 (10.63%), ఎస్సీలు 29,373 (15.56%), ఎస్టీలు 12,073 (6.40%)లు కలిగి ఉన్నారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు మొత్తం కలిపి రెండు గ్రూపుల్లో 32 శాతం కూడా లేరు. అంటే రిజర్వేషన్లు అమలు జరిగిన 70 సంవత్సరాల తరువాత కూడా 80 శాతంగా ఉన్న బహుజనులకు 40 శాతం కూడా దొరకలేదు.

అలాగే ఐ.ఐ.టి ముంబై ప్రాతినిధ్య పరంగా టీచింగ్ ఫ్యాకల్టీ వివరాలు. వీటిని ఎం.పి.సింగ్ అనే ఆర్టీఐ కార్యకర్త 2016లో సేకరించాడు. మొత్తం ప్రొఫెసర్లు 223 మంది ఉండగా అందులో అన్నీ జనరల్ కేటగిరి వాళ్లే ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లలో 121 మంది లో 118 జనరల్‌లు, ఓబీసీలు-2, ఎస్సీ-1, ఎస్టీలు లేరు. అసిస్టెంట్ ప్రొఫెసర్లలో123 మందికి 120 మంది జనరల్‌లో, బీసీల్లో - 3, మిగతా కులాల జాడేలేదు. ఈ వివరాలను చూసినప్పుడు రిజర్వేషన్లు ఎంత అవసవ్యంగా అమలు అవుతున్నాయో అర్థం అవుతుంది. పేరుకు రిజర్వేషన్లు అమలు అవుతున్నాగానీ శ్రామిక కులాలకు, మతపరమైన మైనార్టీలకు దొరికిన ఫలితం చాలా తక్కువగానే ఉంది. రాజ్యాంగం ఏమి చెప్పినప్పటికీ ఇప్పటికీ దేశంలో మనుధర్మమే రాజ్యమేలుతోంది. అందుకనే, కోర్టులు, చట్టాలు, చట్టసభలు అన్నీ అగ్రకులాల కొమ్ముకాచేవే. అందుకనే, దేశ జనాభాలో 15 శాతానికి లోపే ఉన్న అగ్రకులాలకి 10 శాతం రిజర్వేషన్ ఇచ్చి 80 శాతంగా ఉన్న శ్రామిక కులాలకు మోసం చేస్తున్నాయి. ప్రభుత్వ సంస్థలలోనే రిజర్వేషన్లు అమలు చేయటంలో ఇంత పక్షపాతం అమలు అవుతుంటే ప్రైవేట్‌సంస్థల్లో రిజర్వేషన్‌లే లేవు. కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల్లో అంతటా దోపిడీకులాల ఉన్నత వర్గాల వారే ఉన్నారు. అక్కడ రిజర్వేషన్లు అమలుకావటం కల్ల.

అగ్రకుల పేదలకి రిజర్వేషన్ అని అనటంలోనే హిందుత్వవాదుల కుట్ర ఉంది. అగ్రకులాల అభివృద్ధికి బహుజనులకు ఇచ్చే రిజర్వేషన్లు అడ్డం అన్న తప్పుడు భావాలు పెంచి వారి మధ్య తగువులు పెడుతున్నారు. వారి పేదరికానికి ఉన్న అసలు కారణాల నుండి పక్కదారి పట్టిస్తున్నారు. దేశంలో ప్రైవేటైజేషన్ పెరిగి ఉద్యోగాలు తగ్గాయి. ప్రభుత్వ సంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాలు తగ్గి అంతటా కార్పొరేట్ సంస్థలు పెరిగిపోయాయి. అగ్రకులాలలోని ఉన్నత వర్గాలకే అన్ని రకాల అవకాశాలు దక్కుతున్నాయి. అసలు ప్రభుత్వోద్యోగాలే లేనప్పుడు, ఉన్నవి తగ్గిపోతున్నప్పుడు ఉద్యోగాలలో కొత్తగా మరికొన్ని రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేయడం నిరుద్యోగులలో ఆశలు, భ్రమలు పెంచడానికే తప్ప మరొకందుకు ఉపయోగపడదు. ఇప్పటివరకూ దళితులకు, వెనుకబడిన కులాలకు రిజర్వ్ చేయబడిన ఉద్యోగాల ఖాళీలే పూర్తిగా నింపనప్పుడు, రిజర్వేషన్ కోటాలో నింపని లక్షలాది ఉద్యోగాల బాక్ లాగ్ ఉన్నప్పుడు, కొత్తగా రిజర్వేషన్‌లు ఇస్తానని వాగ్దానం చేయడం దోపిడీ కులాల యువతను వంచించడం తప్ప మరేమి కాదు. ఇంతకాలం పేదరికం వల్ల ఉన్నత విద్యలో అవకాశాలు పొందలేక పోయినవారికి ఈ కొత్త రిజర్వేషన్ విధానం ద్వారా అవకాశాలు ఇస్తామని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా అవి అవలంభిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల వలన పెరుగుతున్న సామాజిక అసమానతలలో నుండి కొత్త తరహా ఉద్యమాలు ముందుకు వస్తున్నాయి. ఆ ఉద్యమాల జ్వాలలు అసమానతలను రూపుమాపే దిశలో పురోగమించి తీరుతాయి..

అందుకనే ఈ చట్టాన్ని తీసుకుని రావటంలో హిందుత్వ శక్తుల అవకాశవాదాన్ని, కుట్రని ప్రజలలో బహిర్గతం చేయాలి. బూర్జువా పార్టీలు, రివిజనిస్టు పార్టీలు, ఎన్నికల రొంపిలో దిగిన దళిత, బడుగువర్గాలకి చెందిన రకరకాల పార్టీల, సంస్థల బడా నాయకులు కూడా వంచిస్తున్న నేటి తరుణంలో పీడిత ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి వారి అవకాశవాదాల్ని ఎండగట్టాల్సిన అవసరం ఉంది. అన్ని కులాలలోని పీడిత ప్రజలు కుల మతాలకు అతీతంగా ఐక్యం కావాల్సిన తరుణం ఇది. దేశంలోని ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తులు, సంస్థలు అందరూ పీడిత ప్రజలతో ఐక్యం అయ్యి పోరాడితేనే హిందుత్వ కుట్రలను ఓడించగలుగుతాం. మన పోరాటాన్ని రిజర్వేషన్ల వరకే పరిమితం చేయకుండా ఈ దోపిడీ వ్యవస్థని సమూలంగా నిర్మూలించడానికి కొనసాగించాలి. దోపిడీ నిర్మూలనకు ప్రాతిపదిక ఏర్పడుతుంది. భూమి లేని కోట్లాది రైతు కూలీలకు భూములు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, అందరికీ ఉచిత విద్య, వైద్యం లభిస్తుంది. ఆత్మ గౌరవంతో సమస్త ప్రజా జీవనం సాగుతుంది. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసినప్పుడే పీడిత ప్రజల చేతికి అసలైన అర్థంలో రాజ్యాధికారం దొరుకుతుంది.

రిపోర్టు

# దండకారణ్య స్పెషల్ జోన్‌లో శత్రుదాడులను ప్రతిఘటిస్తూ భూమి సమతలీకరణ, ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లను విజయవంతం చేసిన విప్లవ ప్రజానీకానికి, గెరిల్లా యోధులకు విప్లవ జేజేలు

దండకారణ్య స్పెషల్ జోన్‌లో నిరంతరం జరుగుతున్న శత్రు దాడులను ప్రతిఘటిస్తూ ప్రజలు భూమి సమతలీకరణను, ఎన్నికల బహిష్కరణను, టీసీఓసీ క్యాంపెయిన్‌ను విజయవంతం చేశారు. 2018 నవంబర్ నెలలో జరిగిన విధానసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లను గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రమణ్ సింగ్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 15 సంవత్సరాలు నిరావఘాటంగా కొనసాగించిన పాలనలో అటవీ సంపదని కొల్లగొట్టడానికి, ఆదివాసుల్ని అడవి నుండి తరమడానికి సల్వాజుడుం, గ్రీన్‌హంట్, సమాధాన్ పేర్లతో నిర్బంధ క్యాంపెయిన్‌లను అమలు చేసింది. భూపేష్ బఘేల్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 జనవరి నుండి గ్రామాలపై దాడులు చేయటం, ప్రజల్ని కొట్టటం, అరెస్టులు చేయటం, చంపటం, మహిళలపై అత్యాచారాలు చేయటం కొనసాగుతూనే ఉంది. ఎన్నికలకి ముందు జైళ్లలో ఉన్నవారిని విడుదల చేస్తాం అన్నారు. కానీ, అధికారంలోకి వచ్చాక వారిని విడుదల చేయటం అటుంచి, కొత్తగా అరెస్టులు చేసి జైళ్లకి పంపటం పెరిగింది. బస్తర్ నుండి తెలంగాణాకి కూలికి పోయిన వారిని దారికాసి అరెస్టులు చేసి జైళ్లకి పంపుతున్నారు. లొంగిన వారిని ఇన్‌ఫార్మర్లగా తయారు చేసుకుంటున్నారు. సుక్మా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలలోని క్యాంపుల దగ్గరగా ఉన్న గ్రామాలపై దాడులు చేసి ప్రజలను తప్పుడు కేసులలో అరెస్టు చేసి, జైళ్లకి పంపుతున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి మావోయిస్టులు అని ప్రచారం చేస్తున్నారు. 'సమాధాన్' పద్ధతిలో గ్రామాలలోని ప్రజలని రకరకాలుగా మభ్యపెట్టి, భయపెట్టి ఇన్‌ఫార్మర్లగా తయారు చేసుకుంటున్నారు. ఆ సమాచారం ఆధారంగా దాడులు చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో బూటకపు సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలని పోరాట మార్గం నుండి తప్పించి తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాలలోని ప్రజలని పట్టుకెళ్లి సరెండరయినట్లు చూపుతున్నారు.

2019 ఫిబ్రవరి 2వ తేదీన సుక్మా జిల్లా పోలంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొడెల్‌గూడ గ్రామంలోని మహిళలు కట్టెలు ఏరుకోడానికి అడవిలోకి వెళ్లినప్పుడు కూంబింగ్ పేరుతో వచ్చిన పోలీసు బలగాలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపాయి. ఆ కాల్పులలో పోడియా సుక్కి (ముగ్గురు పిల్లల తల్లి) చనిపోయింది. కల్మదేవె తీవ్రంగా గాయపడింది. ఫిబ్రవరి 7వ తేదీన మాడ్ డివిజన్ తాడ్‌బలా గ్రామంలోని మిలీషియా సభ్యులు ఉన్న డేరాను డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపి 10 మంది మిలీషియా సభ్యులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. ఈ రెండు ఘటనలలో చనిపోయిన వారిని మావోయిస్టులు అంటూ శత్రువు ప్రచారం చేశాడు.

2019 ఫిబ్రవరి 29న కామ్రేడ్ గంగాల్ (పీఎం) శత్రువు ఆంబుష్‌లో ఇరుక్కుని అమరుడు అయ్యాడు. సుక్మాజిల్లా, చింతల్‌నార్ స్టేషన్ పరిధిలో ఉన్న భీమారం-గొమ్‌గూడ గ్రామాల నడుమ 2019 మార్చ్ 26న ఉదయం పీఎల్‌జీఏ డేరా పై డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా పోలీసులు డేరాను చుట్టుముట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో కా॥ జగదీష్ (ఎసీఎం), కా॥ దూది హిడమా (పీఎం), కాం॥ వంజం అయితే (పీఎం), కా॥ మొడియామీ సుదరీ (పీఎం) శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులు అయ్యారు దంతెవాడ జిల్లాలో ఏప్రిల్‌లో జరిగిన మరో ఘటనలో కా॥ వర్గేష్, మరొకరు శత్రువు జరిపిన కాల్పుల్లో అమరులయ్యారు.

దండకారణ్య స్పెషల్ జోన్‌లో భాగంగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కూడా ఉంది. మహారాష్ట్ర ప్రభుత్వం గడ్చిరోలి జిల్లాలోని మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించాలనే పథకంలో భాగంగా క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేస్తోంది. 2018 ఏప్రిల్ 22వ తేదీన కసనూరు-తుమ్మిరిగుండ ఘటనలో పీఎల్‌జీఏ ఉన్న డేరా పై ఖచ్చితమైన సమాచారంతో దాడిచేసి 40 మంది కామ్రేడ్స్‌ను సీ-60 బలగాలు క్రూరంగా హత్య చేసిన విషయం మనందరికీ తెలిసిందే. ఆ ఘటన జరిగిన సంవత్సర కాలం తరువాత 2019 ఏప్రిల్ 27న గుందురువాహి గ్రామ పరిధిలో కా॥ రామ్‌కో (డీసీఎం), కా॥ శిల్ప (ఏసీఎం) లను పట్టుకొని హత్యచేశారు. వీరు ఇద్దరూ పార్టీ పనిపై సివిల్‌లో నిరాయుధంగా వెళ్లినప్పుడు నిర్దిష్టమైన సమాచారంతో పట్టుకుని చాలా క్రూరంగా చిత్రహింసలు పెట్టి హత్యచేశారు.

విప్లవ ప్రజా ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రజలు సామూహిక/సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తూ తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు. దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కారు (స్థానికంగా ఆర్‌పీసీలను ఇలా పిలుస్తారు) 2011 నుండి ప్రతి యేటా వ్యవసాయంలో ఉత్పత్తిని పెంపొందించే లక్ష్యంతో 'భూమి చదును, మళ్ల నిర్మాణం, సాగునీటి వ్యవస్థ రూపకల్పన' క్యాంపెయిన్లను కేంద్ర-రాష్ట్ర కిరాయి సాయుధ బలగాల పాశవిక దాడుల మధ్యనే నిర్వహిస్తున్నాయి. క్యాంపెయిన్ల నిర్వహణకు ముందు

ఏరియా వ్యవసాయ వర్క్‌షాపులు నిర్వహించి నిర్దిష్ట పథకాలను రూపొందించుకొని అమలు చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన ఉపకరణాలను, రోజువారీ నిత్యావసర వస్తువులను (తిండి సామగ్రి) ప్రజలు స్వచ్ఛందంగా కొంతభాగం సమకూర్చుకుంటుండగా, అవసరమైన మేరకు ఆర్‌పీసీలు నిధులు కేటాయిస్తున్నాయి. వర్గ ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఈ క్యాంపెయిన్లలో ప్రతి యేటా రెండు నుండి మూడు వారాల వరకు వేలాది మంది ప్రజలు (స్త్రీలు, పురుషులు, పిల్లలు) క్రియాశీలంగా, విప్లవ స్ఫూర్తితో పాల్గొంటున్నారు. 2019లో ఫిబ్రవరిలో నిర్వహించిన క్యాంపెయిన్‌లో వందలాది ఎకరాల భూమిని చదును చేసారు. కొన్ని కుంటలను, చెరువులను కొత్తగా నిర్మించారు. పాత కుంటలను, చెరువులను రిపేరు చేసారు. చెరువులకు కొన్ని చోట్ల కాలువలు నిర్మించి పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించారు.

దండకారణ్యంలో ఇంతటి సైనిక దాడులు అమలు అవుతున్నా గానీ ప్రజలు తమ ప్రజా ప్రభుత్వమైన జనతన సర్కార్‌ను కాపాడుకోడానికి దోపిడీ ప్రభుత్వంతో బరిగీసి పోరాడుతున్నారు. జనతన సర్కార్ పర్యవేక్షణలో ప్రతి పనిని యుద్ధం మధ్యలోనే ఎంతో పట్టుదలతో చేస్తున్నారు. ప్రతి సంవత్సరం చేసినట్లుగానే భూమి సమతలీకరణలో భాగంగా పనులు నిర్వహిస్తున్న ప్రజలపై 20 చోట్ల పోలీసులు ఫైరింగ్ చేశారు. 15 చోట్ల ప్రజలు పోలీసుల చేతిలో చిక్కుకున్నారు. పోలీసులు ప్రజల సామాన్లను ధ్వంసం చేశారు. ఏడుగురు మిలీషియా కామ్రేడ్స్ శత్రువుతో పోరాడుతూ అమరులయ్యారు. ముగ్గురు గాయపడ్డారు. 12 మంది అరెస్టు అయ్యారు. అయినా, ప్రజలు శత్రుదాడుల నడుమనే ఎంతో ధైర్యంతో వాటిని ఎదుర్కొంటూ భూమి సమతలీకరణ పనులను విజయవంతం చేసారు.

17వ లోక్‌సభ ఎన్నికలకు ముందు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ విడుదల చేసిన ఎన్నికల బహిష్కరణ పిలుపును అన్ని డివిజన్‌లలో విస్తృతంగా ప్రజలలోకి తీసుకవెళ్లారు. విప్లవ ప్రజా నిర్మాణాలు ముఖ్యంగా ప్రజలు అత్యంత ప్రజాస్వామికంగా ఎన్నుకుంటున్న జనతన సర్కార్లు విప్లవ ప్రజా పునాది బలంగా ఉన్న అన్ని గ్రామాలలో సభలు సమావేశాలు నిర్వహించి ప్రజలను బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని కోరాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య డొల్లతనాన్ని ఎండగడుతూ విప్లవ ప్రజా నిర్మాణాలు గ్రామ గ్రామాన ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాయి. ఉద్యమ గ్రామాలలోకి పార్లమెంటరీ రాజకీయ పార్టీల నాయకులు ప్రచారానికి రాలేదు. వారి ప్రచార కార్యక్రమాలు ప్రధానంగా రోడ్డుసైడ్ గ్రామాలకు, పట్టణాలకు, పోలీసు క్యాంపులున్న చోటికే పరిమితమయ్యాయి. ఎన్నికల అధికారులు లోతట్టు గ్రామాల పోలింగ్ బూతులను రద్దు చేశారు. అనేక పోలింగ్ బూతులను పోలీసు క్యాంపులున్న చోటికి మార్చారు. అన్ని డివిజన్‌లలో ఉన్న పోలీసు, అర్ధ సైనిక బలగాలకు తోడుగా సక్రమ ఎన్నికల నిర్వహణ పేరుతో వేల సంఖ్యలో అదనపు అర్ధ సైనిక బలగాలను తెచ్చి మోహరించారు. ఎన్నికలకు ముందు నుండే ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుండి ముమ్మర గాలింపులను చేపట్టారు. ఓటర్లంతా ఓటు వేసి తీరాలని పోలీసులు బడి పిల్లలతో అనేక ర్యాలీలు తీయించారు. ప్రసార మాధ్యమాల ద్వార, ప్రింటు మీడియా ద్వారా మావోయిస్టుల ఎన్నికల బహిష్కరణ పిలుపును విఫలం చేయాలనీ ముమ్మర దుష్ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజా నిర్మాణాల కార్యకర్తలను, నాయకులను ముందస్తుగా నిర్బంధించారు. వారు ఎన్ని తంటాలు పడినప్పటికీ ప్రజా వ్యతిరేక దోపిడీ వర్గాల పాలనను నిరసిస్తూ ప్రజలు అనేక చోట్లా ఎన్నికలని పూర్తిగా బహిష్కరించారు. చాలా చోట్ల పాక్షికంగా బహిష్కరించారు. కానీ, మావోయిస్టు ప్రాంతాలలో భారీ పోలింగ్ జరిగినట్టూ మావోయిస్టుల ఎన్నికల బహిష్కరణ పిలుపును ప్రజలు విఫలం చేసినట్టూ 'బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం' సాధించినట్టూ ప్రపంచానికి చాటి చెప్పాల్సిన తమ 'విధి'ని పోలీసులూ ప్రభుత్వ యంత్రాంగమంతా కుమ్మక్కై తమ శక్తికి మించి నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియలో మీడియా యధావిధిగానే తన ప్రజా వ్యతిరేక స్వభావాన్ని ప్రదర్శించుకుంది. అవాకులు, చవాకులతో అసత్య ప్రచారానికి ఒడిగట్టింది.

బూటకపు పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం దండకారణ్యం చేరిన అదనపు బలగాలతో పాటు ముందునుండి తిష్ట వేసి ఉన్న వేలాది బలగాల ప్రజా అణచివేత చర్యలను, సైనిక దాడులను ప్రతిఘటిస్తూ పీ.ఎల్.జీ.ఏ. ఎన్నికల బహిష్కరణ రాజకీయ సమరాన్ని సఫలం చేయడానికి చేపట్టిన అనేక సాయుధ చర్యలలో పదుల సంఖ్యలో పోలీసు, అర్ధ సూనిక బలగాలు చనిపోవడమో, గాయపడడమో జరిగింది. ఈ ప్రజా అధికార రాజకీయ సమరంలో కొనసాగిన ప్రజా ప్రతిఘటనలో ప్రజా గెరిల్లాలకు ఎక్కువ నష్టాలు జరుగకుండా కాపాడుకున్న విప్లవ ప్రజలకు, జనతన సర్కార్లకు విప్లవ జేజేలు.

దండకారణ్య స్పెషల్ జోన్ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ఆదివాసీ ప్రజలు చేస్తున్న పోరాటాలని అణచివేసి, ఆదివాసీలని అడవి నుండి తరిమివేయాలనే కుట్రతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాశవిక దమనకాండను సాగిస్తున్నాయి. ఆ పాశవిక దాడిని తిప్పికొటుతూనే అక్కడి ప్రజాపోరాటం ముందుకు పోతోంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 2019 ఏప్రిల్ 9న తేదీన దంతెవాడ జిల్లా. కువకొండ బ్లాక్ సాంగడి గ్రామం వద్ద బీజేపీ శాసన సభ్యుడు భీమా మండావీ కాన్వాయ్ పైన పీఎల్‌జీఏ ఆంబుష్ చేసి భీమా మండావీని అతనికి రక్షణగా ఉన్న గార్డ్సుతో కలిపి మొత్తం ఐదుగురిని చంపింది. ఈ సాహసిక దాడిలో రెండు ఏకేలు, ఒక ఇన్‌సాస్, 9ఎంఎం మొత్తంగా 4 తుపాకులు దొరికాయి.

కాంకేర్ నియోజకవర్గానికి లోక్‌సభ ఎన్నికలు జరగడాని కన్నా

వారం రోజుల ముందు పీ.ఎల్.జీ.ఏ. సరిహద్దు భద్రతా దళంపై మాటుదాడి జరిపింది. ఏప్రిల్ 14న తేదీన ప్రతాప్‌పూర్ ఏరియాలోని మహలా క్యాంపు నుండి గస్తీకోసం బయటికి వచ్చిన బీఎస్ఎఫ్ బలగాలపై పీఎల్‌జీఏ బలగాలు ఆంబుష్ చేసి బీఎస్ఎఫ్‌కి చెందిన ఎస్సైతో పాటు నలుగురు జవాన్లను మట్టికరిపించాయి. 15 మందిని గాయపరిచాయి.

గడ్‌చిరోలి జిల్లాలో 2019 ఎప్రిల్ 30వ తేదీన కుర్‌ఖేడాలోని దాదాపుర్‌లో గల రోడ్ నిర్మాణ వాహనాలను 36కు పైగా పీఎల్‌జీఏ తగులబెట్టింది. మరుసటి రోజు మే 1నాడు, క్విక్ రియాక్షన్ టీం సీ-60 కమాండో ఘటనా స్థలానికి వాహనంలో వస్తుండగా పీఎల్‌జీఏ మందుపాతర (ఐ.ఇ.డి) పేల్చి ఆ వాహనాన్ని ధ్వంసం చేసింది. ఆ పేలుడు నుండి ప్రాణాలతో బయట పడిన ఒక కమాండో తక్షణం తన ఆయుధం వద్దకు వెళ్తుండగా గెరిల్లాలు అతడిని మట్టు పెట్టారు. ఆ ఘటనలో 15 మంది సీ-60 కమాండోలు చనిపోయారు. మృత కమాండోల నుండి గెరిల్లాలు రెండు ఏ.కే.-47, రెండు ఎస్.ఎల్.ఆర్. ఆయుధాలను, మందుగుండుతో పాటు కమ్యూనికేషన్ సెట్స్, యూ.జీ.బీ.ఎల్. షెల్స్ స్వాధీనపర్చుకున్నారు. 2018 ఏప్రిల్ 22న 40 మంది కామ్రేడ్స్ అమరులైన వారి స్మృతిలో చేపట్టిన ప్రతిఘటన వారం సందర్భంగా ఈ దాడి జరిగింది. 2019 ఏప్రిల్ 27న కా॥ రామ్‌కో, కా॥ శిల్పల బూటకపు ఎన్‌కౌంటర్ అయిన వెంటనే ఈ ఘటన జరగటంతో ప్రజలు పోలీసులకు తగిన శాస్తి జరిగింది అనుకున్నారు.

దక్షిణ గఢ్‌చిరోలీలోని జనతన సర్కార్‌ల నాయకత్వంలో వందలాది మంది ప్రజలు భూంకాల్ దివస్ సందర్భంగా 'భూమి చదును మళ్ల నిర్మాణం సాగు నీటి వ్యవస్థ ఏర్పాటు' క్యాంపెయిన్ పనులలో పాల్గొన్నారు. గత సంవత్సరం కస్నూర్‌లో 40 మంది విప్లవకారులను కమాండోలు హత్య చేసిన తర్వాత దక్షిణ గఢ్‌చిరోలీ ఉద్యమం నడ్డి విరిచామని సంబర పడ్డారు. కానీ డివిజన్‌లోని విప్లవ ప్రజలు తమ పోరాట సంప్రదాయాన్ని నిలుపుకుంటూ శత్రువు కొనసాగించిన భారీ గాలింపులు, సైనిక దాడుల మధ్య భూంకాల్ దివస్‌ను పాటించడమే కాకుండా శత్రువు కళ్ళు కప్పి వారు భూమి చదును క్యాంపెయిన్ కొనసాగించారు. భూంకాల్ దివస్ సందర్భంగా రెండు కార్యశాలలు 75 మందితో జరిగాయి. సూర్జాగఢ్, బాబూలాయిలలో 10 ఫిబ్రవరి కార్యక్రమాలు బహిరంగంగా జరిగాయి. పిదప వందలాది మంది పాల్గొని 2,557 శ్రమ దినాలు పని చేయగా వారికి 128 మంది ప్రజా మిలీషియా కార్యకర్తలు 55 బర్మార్‌లతో సాయుధంగా రక్షణనిచ్చారు. 1,632 మంది మహిళలు, 1,182 మంది పురుషులు 502 గ్రూపులుగా విడిపోయి వివిధ పనులలో పాల్గొన్నారు. వారు కొత్తగా 3 చెరువులను, 6 కుంటలను నిర్మించి 14 పాత కుంటలను మరమ్మత్తు చేశారు. ప్రజలు తమ స్వంత పని ముట్లను సమకూర్చుకొని 224 ఎకరాలలో భూమి చదును చేశారు. అందులో 378 మళ్ళ నిర్మాణం చేశారు. ప్రజలు తమ స్వంత పనిముట్లు తెచ్చుకొని పనులలో పాల్గొన్నారు.

భూమి సమతలీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా 55 గ్రామాలలోని 196 పేద కుటుంబాలకు, 130 మధ్య తరగతి కుటుంబాలకు, 93 ధనిక రైతు కుటుంబాలకు పైన పేర్కొన్న పనులు చేశారు. అలాగే విప్లవోద్యమంలో అసువులు బాసిన 10 మంది గెరిల్లా అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమ క్రమంలో శత్రువు దాడులకు గురై జైలు పాలైన 17 మంది ప్రజా ఉద్యమ కార్యకర్తల కుటుంబాలకు పైపనులలో సహాయపడ్డారు. శ్రమలో పాల్గొన్న ప్రజలు చివరి రోజు సమష్టి భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఉత్తర గఢ్‌చిరోలీలోని కసంసూర్, టిప్రాగఢ్‌లో ఫిబ్రవరి-10 ప్రజా మీటింగ్‌లు జరిగాయి. వాటిలో 4,200మంది పాల్గొన్నారు. భూమి సమతలీకరణ కార్యక్రమాలు శత్రువుకు అంతు పట్టకుండా పూర్తి చేసుకున్నారు. తిప్పాగఢ్‌లో 88 కుటుంబాలకు పని చేశారు. 2,429 బంటాలు (కూపూలు)తీశారు. 63 మళ్లు మరమ్మతు చేశారు. 7 పెద్ద కట్టలను రిపేర్ చేశారు. ఆ పనులలో 1,162 మహిళలు, 1,234 పురుషులు, 125మంది మిలీషియా, 137మంది పిల్లలు మొత్తం 2,658 మంది పాల్గొన్నారు. జనతన సర్కార్, ప్రజలు కలిసి ఉమ్మడి ఖర్చులతో సామూహిక భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఉత్తర్‌బస్తర్‌లోని ప్రతాప్‌పుర్-రావ్‌ఘాట్ సబ్ డివిజన్‌లో భూమి సమతలీకరణ క్యాంపెయిన్ జనవరి 20 నుండి మొదలై ఫిబ్రవరి 15 వరకు దాదాపు 25 రోజులు జరిగింది. దానికి ముందు మూడు రోజులు జనతన సర్కార్లు భూమి సమతలీకరణపై కార్యశాలలు జరుపుకున్నాయి. అక్కడ కేంపెయిన్‌కు సంబంధించి నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు క్యాంపెయిన్ సందర్భంగా విప్లవ వర్గాలకు చెందిన ప్రజల 269 ఎకరాలలో భూమి సమతలీకరణ, మళ్ల నిర్మాణం, చెరువుల మరమ్మత్తు పనులను చేపట్టారు. 132 పేద కుటుంబాలకు, జైలు పాలైయిన 17 కుటుంబాలకు సామూహికంగా సాగు భూముల సంస్కరణ పనులు చేయడంతో పాటు మధ్య, ధనిక రైతు కుటుంబాలకు కూడా సహాయాన్ని అందించారు. కొత్త చెరువుల నిర్మాణంలో భాగంగా 217 కూపులు తవ్వారు. రెండు పాత చెరువులను మరమ్మత్తు చేశారు. ఈ మొత్తం పనిలో 924 మంది మహిళలు, 1,078 మంది పురుషులు, 174 మంది పిల్లలతో పాటు 173 మంది గెరిల్లాలు పాల్గొని క్యాంపెయిన్ జయప్రదం చేశారు.

తీవ్రమైన శత్రువు దాడుల మధ్య పోరాట పట్టుదలతో భూమి సమతలీకరణ క్యాంపెయిన్‌లో పాల్గొని జయప్రదం చేసిన ప్రజలకు జనతన సర్కార్‌లు విప్లవాభివందనాలు తెలియచేశాయి. డీకే స్పెషల్ జోన్‌లో బూటకపు ఎన్నికలను బహిష్కరించిన విప్లవ ప్రజలకు, పీఎల్‌జీఏ బలగాలకు విప్లవ జేజేలు పలుకుదాం.

## తెలంగాణలో విజయవంతమైన బూటకపు పార్లమెంటు ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్

సీ.పీ.ఐ. (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బూటకపు 17వ పార్లమెంటు ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ విజయవంతమయ్యింది. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, ప్రకటనలు ద్వారా రాష్ట్రంలోని ఉద్యమ ప్రభావం ఉన్న అన్ని చోట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓట్లు కోసం వచ్చే రాజకీయ నాలుకులను నిలదిసేలా ప్రజల్ని చైతన్యవరిచారు. ప్రజలదైనందిన సమస్యలతోపాటు భూమి, ఇల్లు లాంటి మౌళిక సమస్యలను గురించి ఓట్లకు వచ్చిన రాజకీయ పార్టీల నేతలను నిలదీశారు. రాజకీయ నాయకులను అడ్డుకున్నందుకు ప్రజాసంఘాలవారిని ప్రజలను పోలీసులు అరెస్టు చేయడం, కొట్టడం, తప్పుడు కేసులు పెట్టడం చేశారు.

భద్రాద్రి కొత్తగుడెం నుండి కొమరంభీం జిల్లా వరకు, ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దు అంతటా వేల సంఖ్యలో గ్రేహౌండ్స్, కోబ్రా, సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలను మోహరించి పెద్దఎత్తున కూంబింగ్‌లు చేపట్టారు. 150 మందిని అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో దళసభ్యులను హత్య చేశారు. ఎన్నికలకమిషన్, పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అధికార పార్టీకి సహకరించి, అధికార పార్టీ గెలుపుకు శాయశక్తులా కృషి చేశాయి.

అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణలో 75 శాతం ఓట్లు వేయగా పార్లమెంట్ ఎన్నికలకు 61 శాతం మాత్రమే ఓట్లు వేశారు. ఉద్యమ ప్రాంతాలయిన భద్రాద్రి కొత్తగుడెం ఏజెన్సీ ప్రాంతం ఖమ్మం జిల్లాలో మేడ్చల్‌లో (42 శాతం) నిజామాబాద్ జిల్లాలో (48 శాతం) వరంగల్‌లో 55శాతం మాత్రమే ఓట్లు వేసినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఉద్యమ ప్రాంతాలలోని పోలింగ్ బూత్‌లను పోలీసు క్యాంపులున్న చోటకు మార్చి బలవంతంగా ఓట్లు వేయించడం, దొంగ ఓట్లు వేసుకోవడం చేశారు.

ఈ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శత్రువు దాడులు పెరుగుతుండడంతో డీకె-టీజీ బలగాలు జాయింట్‌గా నెల రోజుల పాటు టి.సి.ఓ.సిని నిర్వహించాయి. ఆరాయణ్‌పూర్ వద్ద ఆంబూష్ నిర్వహించి ఇద్దరు పోలీసులను ఖతం చేసి 4గురు పోలీసులను గాయపరిచారు. ఒక ఇన్‌సాస్ కొన్ని తూటాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. తోంగూడెం గ్రామం వద్ద ఇంటెలిజెన్సీ కోసం వచ్చిన ఇద్దరు డీఆర్జీ పోలీసులను ఖతం చేశారు. కావురి-మీనం గ్రామాల మధ్య దళంపై దాడిచేసి తిరిగిపోతున్న గ్రేహౌండ్స్, డీఆర్జీ పోలీసులపై కౌంటర్ దాడిచేయడం జరిగింది. ఈ క్యాంపెయిన్ సందర్భంగా ముగ్గురు ముఖ్య ఇన్‌ఫార్మర్లను ఖతం చేయడం, కొందర్ని హెచ్చరించడం, నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం జరిగింది. ఇతర పనులను సమన్వయం చేస్తూ, మాస్ వర్క్ చేస్తూనే ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను కొనసాగించడం జరిగింది.

నిజామాబాద్ జిల్లాలో ఎర్ర జొన్న, పసుపు పండించే రైతులు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని నిరసనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను విమర్శిస్తూ 170 మంది రైతులు నిజామాబాద్ నియోజిక వర్గంలో నామినేషన్లు వేశారు. ఈ రైతాంగ నిరసన చర్య దేశవ్యాప్తంగా ప్రచారమయ్యింది. ఆ రైతాంగానికి నైతిక మద్దతు లభించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించవని బహిరంగమయ్యింది. ప్రజలు వేల సంఖ్యలో "నోటా"కు ఓటు వేసారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీటికెట్‌పై గెలిచి టీ.ఆర్.ఎస్.లో చేరిన రాజకీయనాయకులను నిలదీయడంతో పాటు చెప్పులు, రాళ్ళతో కొట్టారు.

ఏ బూర్జువా పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఒరిగేదేమి లేదు. తిరిగి సామ్రాజ్యవాదులకు, దళారీ పెట్టుబడిదారులకు, భూస్వాములకు సేవలు చేస్తాయి. ప్రజల హక్కులను కాలరాస్తాయి. అందుకే ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం, విప్లవ రాజ్యాధికార స్థాపనకు పోరాడుతాం అంటూ ఉద్యమప్రాంత ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. బూటకపు ఎన్నికలను బహిష్కరించి జనతన సర్కర్ల నిర్మాణం కోసం విప్లవ ప్రజలు పోరాడుతున్నారు.

---

**(33వ *పేజీ తరువాయి...*)**

మహిళలు, ఉద్యోగులు వివిధ సెక్షన్ల ప్రజలతోనూ వాళ్ళకి అర్థం అయ్యే భాషలో రాజకీయాలను చెప్పి ఓపికతో ఒప్పించి విప్లవ కార్యకలాపాలలో పాల్గొనేలాగా, సహకరించేలాగా కృషి చేసింది. తనతో వున్న సహచర కామ్రేడ్స్‌ను రాజకీయంగా, మిలిటరీపరంగా ఎదిగిస్తూ నిత్యనిర్బంధంలో కొత్త ఎత్తుగడలతో ఉద్యమాన్ని కాపాడి, అభివృద్ధి చేసింది. దండకారణ్య ఉద్యమానికి, ఒడిషా ఉద్యమానికి మధ్య వారధిగా విశేష కృషి చేసింది. ఒడిశా, దండకారణ్య ఉద్యమాలకు, సీతానది ఏరియాఉద్యమం సమన్వయంగా ఉండడంతో శతృవు ఆ ఏరియాపై తీవ్రనిర్బంధం కొనసాగిస్తున్నాడు. ఈ సంవత్సరకాలంలో దళసభ్యుడు కామ్రేడ్ జైసింగ్‌ను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. ఏరియా కమాండర్‌తో సహా మరో సభ్యుడ్ని అరెస్టుచేసి, తీవ్రనిర్బంధాన్ని అమలు చేసినప్పటికీ, అక్కడి ప్రజల్లో పార్టీని నిలబెట్టడానికి కామ్రేడ్ సీమ తుదిశ్వాస వరకూ అలుపెరుగని కృషి చేసింది.

27 సంవత్సరాలు అనుభవంతో, పూర్తి విశ్వాసంతో, ప్రజలకి అంకితమై పనిచేసిన కామ్రేడ్ సీమ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుందాం. సీనియర్ మహిళా నేత కామ్రేడ్ సీమకు జోహార్లు.

○

# అమరుల సంస్మరణ

## గుండుర్‌వాహీ అమరులు రామ్‌కో, శిల్పలకు జోహార్లు

కా॥ రామ్‌కో (46), కా॥ శిల్పా (29) అనే ఇద్దరు మహిళా కామ్రేడ్స్‌ను భామ్రాగఢ్ తాలుకా గుండుర్ వాహీ గ్రామ సమీపంలో ఇన్‌ఫార్మర్ అందచేసిన సమాచారంతో గఢ్‌చిరోలీ జిల్లా సీ-60 కమాండోలు పట్టుకున్నారు. ఆ కామ్రేడ్స్ ఇద్దరూ నిరాయుధంగా పార్టీ పనిమీద సివిల్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా కచ్చితమైన సమాచారంతో 2019 ఏప్రిల్ 27న ఉదయం 10 గం॥ సమయంలో కమాండోలు దారి కాచి వారిని పట్టుకున్నారు. వారిద్దర్నీ వెంటనే అడవిలోకి తీసుకుని వెళ్లి 4 గంటల పాటు క్రూరమైన చిత్రహింసలకి గురిచేసి చంపారు. శత్రువు ఎన్ని చిత్రహింసలు పెట్టినా గానీ పార్టీ రహస్యాలను, తోటి కామ్రేడ్స్‌ను కాపాడుతూ తమ నిండు ప్రాణాలను విప్లవం కోసం వారు అర్పించారు.

### కా॥ రామ్‌కో



కా॥ రామ్‌కో ఉరఫ్ కమలా నరోటీ (46) ఏటపల్లి తాసిల్ కసన్‌సూర్ ఏరియా కోయన్‌దూడ్ గ్రామంలో నరోటీ కుటుంబంలో పుట్టి పెరిగింది. రామ్‌కో తండ్రి మన్‌కూ నరోటీది ఆదివాసీ ధనిక రైతు కుటుంబం. 1980 తర్వాత ఈ ప్రాంతానికి వచ్చిన విప్లవ రాజకీయాలకి ప్రభావితుడై ఆదివాసీ రైతుకూలి సంఘంలో క్రియాశీలంగా పనిచేశాడు. పార్టీ సభ్యుడిగా ఆ ప్రాంతంలో జరిగిన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి, ప్రజలందరి విశ్వాసాన్ని, ప్రేమని పొందాడు. రామ్‌కో తల్లి గ్రామ కేఏఎంఎస్‌లో పనిచేసింది. రామ్‌కో తండ్రి మన్‌కూ నరోటీ పై పోలీసులు టాడా కేసు పెట్టి అరెస్టు చేశారు. జైలుకి పంపారు. జైలు నుండి బయటికి వచ్చాక తీవ్ర అనారోగ్యంతో మంచాన పడి ఉన్నప్పటికీ 2002లో మరణించేంత వరకూ విప్లవ రాజకీయాలని అంటిపెట్టుకుని ఉన్నాడు.

ఇటువంటి విప్లవ కార్యాచరణ కలిగిన కుటుంబంలో పుట్టి, పెరిగిన రామ్‌కో పై చిన్న వయసు నుండి పార్టీ ప్రభావం పడింది. తండ్రితో పాటు దళం దగ్గరికి అన్నం, నీళ్లు తీసుకుని వచ్చేది. దళ కమాండర్‌తో, పార్టీ కామ్రేడ్స్‌తో ఎంతో సన్నిహితంగా ఉంటూ, అన్నీ అడిగి తెలుసుకునేది. అన్ని పనులలో ఉత్సాహంగా పాల్గొనేది. ఇంటి దగ్గర ఉంటూ సంఘ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పనిచేసేది. జిల్లాలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లను, ప్రజలపై పోలీసులు చేసే దమనకాండను, తన తండ్రి అరెస్టును వ్యతిరేకిస్తూ జరిగిన ఎన్నో ప్రజాందోళనలలో భాగమైంది. గ్రామంలోని పెత్తందార్ల అణచివేతని, పెత్తనాన్ని ప్రతిఘటిస్తూ సంఘాన్ని శక్తివంతంగా నిలబెడుతూ రామ్‌కో ప్రజలకి నాయకత్వం వహించింది. తన తండ్రి అరెస్టు అయ్యి జైలులో ఉంటే, ఒకపక్క గ్రామంలో సంఘం కార్యకలాపాలు నడుపుతూనే, మరొక పక్క పెద్దకూతురుగా ఇంటి బాధ్యతలు కూడా నిర్వహించింది. రామ్‌కో చిన్నతనం నుండి విప్లవ రాజకీయాలు నేర్చుకుంటూ ప్రజా పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొంటూ, నాయకత్వం వహిస్తూ ఒక కార్యకర్తగా, నాయకురాలిగా తన చైతన్యానికి పదును పెట్టుకుంది.

కా॥ రామ్‌కో గ్రామంలో పార్టీ ఇచ్చిన పనులు చేస్తూ, క్రమంగా 2004లో పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలోకి బర్తీ అయ్యింది. మొదటి నుండి కూడా గట్ట-భామ్రాగడ్ ఏరియాలోనే పనిచేసింది. ఇంటి దగ్గర ఉన్నప్పటి నుండి సంఘ కార్యకలాపాలలో ప్రజలని సంఘటితం చేసిన అనుభవం ఉన్న రామ్‌కో ఏరియాలోని ప్రజలతో లతలాగా అల్లుకునిపోయింది. 2007లో రామ్‌కో ఏరియా కమిటీ సభ్యురాలు అయ్యింది. 2010 నుండి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఏరియాలో పార్టీని గట్టిగా నిలబెట్టింది. 2015 డిసెంబర్‌లో జరిగిన డివిజన్ ప్లీనంలో కా॥ రామ్‌కోని డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. కా॥ రామ్‌కో 2016 నుండి 2019 ఏప్రిల్ 27 వరకు డీవీసీ సభ్యురాలిగా ప్రజలకి తన సేవలు అందించింది. పార్టీ సభ్యురాలుగా ఆమె చేసిన ప్రమాణానికి కట్టుబడి చివరి క్షణం వరకు కృషి చేసింది.

గఢ్‌చిరోలీ జిల్లాలో 2014 నుండి పెసా, గ్రామసభలు మొదలయ్యాయి. ప్రజా పోరాటాల నుండి చిట-పట చినుకులు రాలినట్లు సంస్కరణలు వస్తుంటాయి అని, అవి విప్లవ మార్గం నుండి దారి తప్పిస్తాయని సంస్కరణల అసలు స్వభావాన్ని ప్రజలకి విప్పి చెప్పింది. పెసా, గ్రామసభలు కాదు జనతన సర్కార్‌లు నిర్మించుకుని ప్రజారాజ్యాన్ని శక్తివంతంగా నడిపించాలి అని ప్రజలకి ముక్తి మార్గాన్ని చూపింది.

గఢ్‌చిరోలీలో ఉద్యమం మొదటి నుండి కూడా తీవ్ర నిర్బంధాన్ని

ప్రతిఘటిస్తూనే ముందుకు సాగింది. కా॥ రామ్‌కో ఆ నిర్బంధ పరిస్థితులలో నీళ్లల్లో చేపలా ప్రజలలో కలిసిపోయింది. శత్రు క్యాంపుల మధ్యనే ప్రజల్ని కదిలించింది. సంఘాలు నడిపింది. జనతన సర్కార్ నిర్మాణాలను, గ్రామసభలను నడిపింది. 2018 ఏప్రిల్ 22 కసనూర్-తుమ్మిరిగుండ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 40 మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు. వారిలో జిల్లా కమిటీ సెక్రటరీ కా॥ శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు కా॥ నందు, కా॥ సాయినాథ్‌లు కూడా అమరులు అయ్యారు. జిల్లా కమిటీ నష్టపోయి డివిజన్ ఉద్యమం తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో ఎంతో నిబ్బరంగా అన్ని పనులలో ముందు ఉండి నడిపించింది. శత్రు చేతికి చిక్కినా గానీ ధైర్యంగా శత్రువుని ఎదుర్కొంది. ప్రజలకోసం తన నిండు ప్రాణాలని అర్పించింది.

గట్ట, కసనూర్ ఏరియాల నడుమ సూర్జాగఢ్ మెట్ట విస్తరించి ఉంది. అందులోని ఇనుప ఖనిజం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం, సామ్రాజ్యవాదులతో కలిసి దశాబ్దానికిపైగా అనేక ప్రయత్నాలు చేస్తున్నది. గనుల తవ్వకానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలను కదిలించి వేల మందితో ప్రదర్శనలు చేయించటంలో, మిలిటెంట్‌గా ప్రతిఘటనా చర్యలు చేపడుతూ ఆ ఉద్యమాన్ని సుదీర్ఘ కాలంగా నడిపిన దానిలో కామ్రేడ్ రామ్‌కో పాత్ర గణనీయమైనది. కా॥ రామ్‌కో లాంటి స్థానిక మిలిటెంట్ నాయకురాలు ప్రజల మధ్య ఉండడాన్ని సహించలేని దోపిడీ పాలకవర్గాలు పథకం ప్రకారం ఆమెను బూటకపు ఎన్‌కౌంటర్ హత్య చేశాయి.

కా॥ రామ్‌కో నరోటి పార్టీలో విప్లవానికి అంకితమై పనిచేస్తున్న సహయోధుడిని సహచరునిగా ఎన్నుకుంది. 2006లో వివాహం అయ్యింది.

ఎర్రగా, సన్నగా, చిన్నగా ఉండే రూపం, చెరగని చిరునవ్వుతో అందరిని ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా పలకరించే కా॥ రామ్‌కో రూపం అందరి మనస్సుల్లో చెక్కు చెదర కుండా ఉండిపోతుంది. ఉద్యమానికి ఉపయోగపడే విషయాలు తెలుసుకోవాలనే తృష్ణ, ప్రజలకి తెలియజేయాలనే తపన తన నుండి నేర్చుకోవాలి. తీవ్ర నిర్బంధ పరిస్థితులలో కూడా ప్రజలని అంటిపెట్టుకుని పనిచేయటంలో, కష్టకాలంలో బాధ్యతల్ని మీదేసుకుని పనిచేయటంలో, పట్టుదలతో తన కర్తవ్యాన్ని నెరవేర్చటంలో కా॥ రామ్‌కో అందరికీ ఆదర్శంగా నిలిచింది. రామ్‌కో ఆశయాలను కొనసాగిద్దాం.

## కా॥ శిల్ప



కా॥ శిల్ప (29) మిరంగుడ్ వంచ గ్రామంలో పేద దుర్వా కుటుంబంలో పుట్టింది. ఆ ప్రాంతంలో జరుగుతున్న విప్లవ కార్యక్రమాలు చూసి ఉత్సాహపడి 2010 చివరిలో దళంలో బర్తీ అయ్యింది. పార్టీ ఇచ్చిన బాధ్యతల్ని, పనులని ఎంతో సంతోషంగా నిర్వర్తించేది. గత 3 సంవత్సరాలుగా ఏరియా సీఎన్ఎం బాధ్యతలు స్వీకరించి తన ఆట, పాటలతో ప్రజలలో విప్లవ రాజకీయాలు ప్రచారం చేసింది. పాతబడిన, ప్రగతి నిరోధకమైన తెగ సాంప్రదాయాలను, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతిని విడిచి నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పాలని గ్రామ-గ్రామాన ప్రచారం చేసింది. 2018లో కా॥ శిల్ప వివాహం జరిగింది. గట్టా-భామ్రాగడ్ ఏరియాలో కా॥ శిల్ప ఆట, పాటలు చూసిన ప్రజలు, యువతీ-యువకులు ఎన్నటికీ మరిచిపోరు. కా॥ శిల్ప ఆశయాలను కొనసాగిద్దాం.

**(34వ పేజీ తరువాయి...)**

సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఎదిగిన సీమ స్థానిక ప్రజలకు విశ్వసనీయమైన నాయకురాలిగా పనిచేసింది. పార్టీ అందించిన చైతన్యంతో ప్రజలు సంఘటితపడి విప్లవ రాజకీయ చైతన్యంతో పోరాడి అనేక సమస్యలు పరిష్కరించుకున్నారు. అందులో భాగంగా ఫారెస్ట్ గార్డ్‌ల దోపిడీ, దౌర్జన్యాన్ని ఎదిరించి ఆ గ్రామాల నుండి వెళ్లగొట్టారు. ఉదంతి ఏరియాలో అభయారణ్యానికి వ్యతిరేకంగా పెద్దెత్తున ఆందోళన చేశారు. రైతాంగ ఆర్థిక సమస్యలు, వ్యవసాయక సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివాసీ రైతాంగాన్ని కదిలించి నకిలీ విత్తనాలు, నకిలీ మందులకు వ్యతిరేకంగా, జొన్నపంట గిట్టుబాటు ధర కోసం, అధిక వడ్డీ రేట్లకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టారు.

2012లో సీతానది ఏరియా కమాండర్‌గా 2013లో నగరి ఏరియా కమిటీ కార్యదర్శిగా డివిజనల్ కమిటీ (డీ.వీ.సీ.ఎమ్.) సభ్యురాలిగా కృషి చేసింది. ఆ తదుపరి జరిగిన ఒడిషా రాష్ట్ర ప్రథమ మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యింది. ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించింది. ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పని చేస్తూ నిర్దిష్టంగా సీతానది ఉద్యమ ప్రాంతానికి నాయకత్వాన్ని అందించింది. విద్యార్థి, యువజనులతోనూ,

*(మిగతాది 31వ పేజీలో...)*

# కామ్రేడ్ సీమ అమరత్వంతో సీతానది ఎరుపెక్కింది

## ఉద్యమ పురోగమనంలో ఎల్లలు దాటి విస్తరించిన సీమ ఉద్యమ జీవితం

మహారాష్ట్రలోని గఢ్‌చిరోలీలో పుట్టి, ఛత్తీస్‌ఘడ్ మాడ్‌మెట్టపై రాటుదేలి, ఒడిశా ఉద్యమ విస్తరణలో కీలకంగా నిలిచింది కామ్రేడ్ సీమ. అన్ని విషయాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోరాడగలరన్న విశ్వాసంతో పని చేసి నిరూపించింది. ఉద్యమంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా, అనారోగ్య సమస్యలు ఎంత వేధిస్తున్నా చెదరని చిరునవ్వు ఆమె సొంతం.

2019 జూన్ 18న సమాచార ఆధారంగా వెళ్లిన ఎస్.టి.ఎఫ్ బలగాలు దళం వున్న దేరాను చుట్టు ముట్టి దాడి చేసినప్పుడు అనారోగ్యంతో వున్న కామ్రేడ్ సీమ శత్రువు జరిపిన కాల్పులలో గాయపడి, పోలీసుల చేత చిక్కి చిత్రహింసలకు గురై అమరురాలయ్యింది.

మహారాష్ట్రలోని గఢ్‌చిరోలీ జిల్లా కసంసూర్ ఏరియా బుర్గీ గ్రామానికి చెందిన వెడద వారి కుటుంబంలో సీమ 50 సంవత్సరాల క్రితం పుట్టింది. తల్లి, తండ్రి ఆమెకు పెట్టిన పేరు శ్యాంబాయి. శ్యామ వర్ణంలో ఉన్న ఆమెను ఇంట్లో అందరూ 'మెస్సీ' (కోయలో ఒక రకమైన తేనే) అని పిలిచేవారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినప్పటికీ చిన్నప్పటి నుండి ఆమె కష్టపడి ఎన్నో పనులు చేసేది. తునికాకు కోయటం, వెదురు నరకడం వంటి పనులు చేసింది. గ్రామంలోని సమష్టి పనుల్లో భాగమయ్యింది.

ఆ ఏరియాలో పనిచేస్తున్న ఏటపల్లి దళం బుర్గీ గ్రామంలో నిర్మించిన క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ (కే.ఏ.ఎమ్.ఎస్.)లో చేరి కామ్రేడ్ శ్యాంబాయి పనిచేసింది. కే.ఏ.ఎమ్.ఎస్. డివిజనల్ కమిటీలో ఉంటూ మహిళా ఉద్యమానికి నాయకత్వం వహించింది. డివిజన్‌లో కూలీ రేట్ల పెంపుదల కోసం, సమాజంలో ఆదివాసీ తెగ పెద్దల దాష్టీకాలకు వ్యతిరేకంగా పితృస్వామ్య వ్యతిరేక పోరాటాలలోనూ పాల్గొని నాయకత్వాన్ని అందించింది. వివిధ సందర్భాలలో పార్టీ ఇచ్చిన పిలుపులను చేపట్టి ఆ ప్రాంతంలోని ప్రజలలో విస్తృత క్యాంపెయిన్‌లు నిర్వహించడంలో మెస్సీ ముందు భాగానుండేది.

1993లో కామ్రేడ్ మెస్సీ పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది. గఢ్‌చిరోలీ ప్లాటూన్‌లో గీత పేరుతో 1998 వరకు పనిచేసింది. ఆ జిల్లా ఉద్యమంలో పని చేస్తున్న కామ్రేడ్ గంగన్న సిడామ్‌తో ఆమె వివాహం జరిగింది.

కామ్రేడ్ శ్యాంబాయి గఢ్‌చిరోలీ జిల్లాలో మహారాష్ట్ర ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని అమలు చేస్తున్న సమయంలో విప్లవకర కార్యకలాపాల్లో భాగమై బాధ్యతలు స్వీకరించింది. 1991-94 మధ్య గఢ్‌చిరోలీ జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌లు పెద్ద ఎత్తున జరిగాయి. ఆ సమయంలో సుమారు 60 మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు. గఢ్‌చిరోలీ జిల్లాలోని విప్లవోద్యమాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 1991లో 'ప్రత్యేక అణచివేత పథకాన్ని' ప్రవేశ పెట్టింది. 1992లో సీ-60 కమాండో దళాల నిర్మాణం చేసింది. జిల్లాలో విప్లవోద్యమానికి సహకరించిన వారిని రకరకాల పద్ధతులలో అణచివేస్తూ, టాడా కేసులో ఇరికించి, జైలు పాలు చేసింది. అటువంటి సమయంలో కామ్రేడ్ శ్యామల శత్రు నిర్బంధాన్ని లెక్క చేయకుండా ఉద్యమంలో భాగమయి, నీటిలో చేపలా ప్రజలలో తిరుగుతూ ఎంతో మెలుకువగా పని చేసింది. కామ్రేడ్ శ్యాంబాయి ఉద్యమంలోకి వచ్చాక, ఆ ప్రభావంతో బుర్గీ గ్రామం నుండి దాదాపు ఒక ప్లాటూన్ సంఖ్యలో యువతీ, యువకులు భర్తీ అయ్యారు. కామ్రేడ్ శ్యాంబాయి తన ఇంటి వారు, తమ గ్రామంలోని వాళ్ళు పార్టీలోకి వచ్చేలా, ఉద్యమాన్ని వెన్నంటి వుండేలా కృషి చేసింది. బుర్గీ గ్రామం ఉద్యమానికి ఒక కోటలా తయారు అయింది. బుర్గీ గ్రామం నుండి విప్లవోద్యమంలో చేరిన కామ్రేడ్ చందన, కామ్రేడ్ నాగేష్, కామ్రేడ్ ముకేష్ వంటి ఎంతో మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు.

ఉద్యమ అవసరాల రీత్యా ఇద్దరూ మాడ్ డివిజన్‌కి బదిలీ అయ్యారు. 1998లో మాడ్ డివిజన్‌లో కొత్తగా ఏర్పడిన ప్రత్యేక మహిళా దళంలో మొదట సభ్యురాలిగా వుంటూ, 2000 సంవత్సరం నాటికి కమాండర్‌గా ఎదిగింది. అక్కడ ఆమె జరీనా పేరుతో ప్రజలలో పని చేసింది. 2001మార్చ్‌లో పార్టీ 9వ కాంగ్రెస్ జరిగినప్పుడు ఆమె నాయకత్వంలోని మహిళ దళం రక్షణ బాధ్యతల్లో పాల్గొనటమే కాకుండా, మార్చ్ 8న జరిగిన బహిరంగ సభలో మహిళల సమస్యలపై కామ్రేడ్ జరీనా ఉపన్యసించింది.

ఉద్యమంలో భాగంగా ఎదుగుతున్న జరీనాని 2006 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన మాడ్ డివిజన్ మహాసభలో ప్రతినిధులు డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీలో సభ్యురాలుగా ఆమె ముఖ్యంగా మహిళ ఉద్యమాన్ని పెంపొందించడానికి కృషి చేసింది. ప్రజల నుండి నేర్చుకోవటంలో, తనకు తెలిసింది ప్రజలకి చెప్పటంలో, ప్రజల్ని సంఘటితం చేయటంలో జరీనా ఎంతో కృషి చేసింది. జరీనా పని చేసిన ప్రాంతంలోని ప్రజలు తనను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ అడుగుతుంటారు. కేడర్‌తో కలిసి పోవటంలో, తనకి తెలిసిన విషయాలు వారికి చెపుతూ వారిని ఎదిగించుకోవటంలో జరీనా ఆదర్శనీయంగా వుండేది.

పార్టీ ఆదేశాల మేరకు ఉద్యమ విస్తరణలో భాగంగా వెళ్ళిన బలగాలతో పాటు కామ్రేడ్స్ గంగన్న, జరీనా ఇద్దరు ఒరిస్సాకు వెళ్ళారు. 10 సంవత్సరాల పాటు మైన్‌పుర్ డివిజన్‌లోని సీతానదీ ఏరియాలో ఆమె దృఢ దీక్షతో పని చేసింది. అక్కడ సీమ పేరుతో ప్రజలలో అల్లుకుపోయింది. కొత్త ప్రాంతంలో ప్రజల కట్టుబాట్లు, వివిధ రకాల స్థానిక భాషలు (ఛత్తీస్‌గఢ్, ఒడియా, కమార్ వంటివి) నేర్చుకుని ప్రజలలో కలిసిపోయింది. మూడు రాష్ట్రాలలోని

*(మిగతాది 33వ పేజీలో...)*

# కార్మికవర్గ పుత్రిక కామ్రేడ్ కామేశ్వరి కి అరుణారుణ జోహార్లు

## ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల ఉద్యమాల స్ఫూర్తి ప్రతీకలు మన కోరాపుట్ అమరులు

2019 మే 8న ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా నందపూర్ సమితి బలే గ్రామ పంచాయితీలో కిటుకవాకంఠిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ కామేశ్వరితో పాటు మరో 4గురు కామ్రేడ్స్ అమరులయ్యారు.



విజయనగరం జిల్లా కురుపాం మండలం దిగువ ఆవిరి గ్రామనికి చెందిన సవర బిడ్డ బిడ్డిక లక్ష్మి (క్రాంతి), ఏరియా కమిటీ సభ్యురాలు, విశాఖ జిల్లా గుర్తేడు మండలం బురద కోట గ్రామనికి చెందిన కువ్వీ ఆదివాసీ కామ్రేడ్ జప్పిరాయింగి సత్తిబాబు (సుదర్శన్), ఏరియా కమిటీ సభ్యుడు, కామ్రేడ్ క్రిష్ణ, ఏరియా కమిటీ సభ్యుడు, కామ్రేడ్ గీత, పార్టీ సభ్యురాలు.

కామ్రేడ్ కామేశ్వరి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం తాలుకాలోని ముమ్మిడివరం గ్రామంలో మత్స్యకారుల కుటుంబంలో 45 ఏళ్ల కిందట జన్మించింది. తర్వాత కాలంలో తల్లి పుట్టిన ఊరు శ్రీకాకుళంలో బుడితి గ్రామంలో వాళ్ల కుటుంబం స్థిరపడింది.

తనతోపాటు ఆర్‌టీసీలో కండక్టర్‌గా ఉంటూ, కార్మికోద్యమ నాయకుడుగా ఎదిగిన కా॥ రవి ప్రభావంతో విప్లవోద్యమం వైపు ఆకర్షితురాలయ్యింది. కా॥ కామేశ్వరి ఆర్‌టీసీ కండక్టర్‌గా ఉంటూ, ఆ వృత్తిలో సాధకబాధకాలను ప్రత్యక్షంగా అనుభవించింది. ఆర్‌టీసీలోని కార్మికులతో పాటు మహిళా కార్మికులను కూడగట్టింది. కార్మికరంగంలోని పార్టీ యూనిట్‌కు కార్యదర్శిగా కొనసాగింది. ఆనాడు కా॥ రవి లేని లోటును (కా॥ రవి రహస్య జీవితానికి వెళ్లిన తరువాత) కార్మికరంగంలో పూడ్చడమే కాకుండా కార్మికోద్యమ నాయకురాలుగా నిలబడింది. వారి ప్రేమాభిమానాలు చూరగొన్నది. కార్మిక సమస్యల పరిష్కారానికి పూనుకున్నది.

ఒక దశాబ్ద కాలం పాటు కా॥ కామేశ్వరి ఆర్‌టీసీ కార్మికుల్లో విస్తృత స్థాయిలో చేసిన ప్రచార, ఆందోళన, నిర్మాణ కృషి ఫలితంగా తూర్పుగోదావరి జిల్లాలోని ప్రతీ ఆర్‌టీసీ డిపోలో ఆమెకు గుర్తింపు ఉండేది. రాష్ట్ర వ్యాపితంగా ఆర్‌టీసీ సమ్మెతో పాటు, స్థానిక డిపోలలో జరిగే ఆందోళనలలోను ఆమె మిలిటెంట్‌గా పాల్గొనడం, వీధి నాటికలు ప్రదర్శించడం, ముందు భాగాన నిలిచిపోరవగా, చురుకుగా వ్యవహరించడంతో అందరికి తలలో నాల్కలా ఉండేది. గోదావరి పుష్కరాల సందర్భంగా స్పాంటేనియస్‌గా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఆందోళన చేసి డిమాండ్‌లు సాధించడంలోను మంచి పాత్ర నిర్వహించింది. జాతీయ ట్రేడ్ యూనియన్లను అవకాశవాద నాయకత్వాన్ని కాదని న్యాయమైన కార్మికుల డిమాండ్స్ సాధనకు అన్ని రకాల యూనియన్లలోని కార్మికులను జేఏసీల ద్వారా ఐక్యకార్యాచరణలోకి తెచ్చి ఉద్యమాలు నడిపి డిమాండ్స్ సాధించడంలో మంచి నైపుణ్యాన్ని సాధించింది. అందరి విశ్వాసాన్ని చూరగొంది.

సామాజిక ఉత్పత్తిలో నిరంతరం తన పాత్రను మెరుగుపరుచుకునే కామేశ్వరి శ్రమతత్వాన్ని, కార్మికవర్గ అంతర్జాతీయతను అలవరచుకుని క్రమశిక్షణతో కమ్యూనిస్టు రాజకీయాలకు అంకితం కావడం ద్వారా విప్లవపార్టీ ఇచ్చిన పిలుపు నందుకుని వృత్తి విప్లవకారిణిగా విప్లవోద్యమ నిర్మాణంలో భాగమయ్యింది. ఆర్‌టీసీ కాజువల్ కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాలు నిర్మించి పోరాడిన దానిలో కీలక పాత్ర నిర్వహించింది. ప్రైవేటైజేషన్ వ్యతిరేక ఆందోళనలోను, అనేక ప్రజాస్వామిక, సామాజిక ఉద్యమాలలోను పాల్గొని ఆ సంస్థలతో మంచి సంబంధాలను ఏర్పరచుకుని తన అవగాహనను పెంచుకుంది. ఏఓబీ ఉద్యమంలో భాగంగా ఆమె చివరి వరకు కార్మికరంగంతో పరిచయంలో ఉంటూ తన అనుభవజ్ఞానాన్ని వారికి అందిస్తూ నేతృత్వాన్ని అందించింది.

2009 సెప్టెంబర్‌లో పీడిత ప్రజల విముక్తికి అంకితమై పూర్తిగా రహస్య జీవితానికి వచ్చింది. 2010 మార్చి వరకు ఒడిశా ఎస్‌ఓసీ ఘుంసర దళంలో కొంత కాలం పనిచేసింది. 2010 మార్చి నుండి 2012 ఫిబ్రవరి వరకు నియంగిరి కాశీపూర్ ప్రాంతంలోని ఆదివాసీ, దళితుల మధ్య పనిచేసింది.

2011 జనవరి 10న తన జీవిత సహచరుడు, నియంగిరి కాశీపూర్ పీడిత ప్రజల నాయకుడు కా॥ రవితో పాటు 9 మంది కామ్రేడ్స్ కాశీపూర్‌లో అమరులయ్యారు. తన కళ్ల ముందే కా॥ రవి నేలకొరిగినా, ఆ ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో పోరాడుతూ సురక్షితంగా రిట్రీట్ అయ్యింది. కా॥ స్వరూప మిగిలిన కామ్రేడ్స్‌కు ఎంతో ధైర్యాన్నిస్తూ వారిని ఐక్యంగా నిలబెట్టింది. కా॥ స్వరూపకు ఒడియా, కువ్వి భాషలు రావడంతో పాటు ప్రజల్లో అప్పటికే గుర్తింపు ఉండడం వల్ల తిరిగి నియంగిరి ప్రజలను విస్థాపిత ఉద్యమం లో ఐక్యం చేయగలిగింది. 2011 డిసెంబర్‌లో జరిగిన ఒడిశా రాష్ట్ర ప్రత్యేక ప్లీనంలో ప్రతినిధిగా పాల్గొంది. ఆ ఉద్యమంతో తక్కువ సంబంధం ఉన్నప్పటికీ ఉద్యమ సమస్యలను రాజకీయంగా విశ్లేషించి విమర్శనాత్మక దృష్టితో అనేక విషయాలను ప్రతినిధుల ముందు ఉంచింది. ఆ ప్లీనంలో మితవాద, అవకాశవాదంతో పార్టీకి నష్టం చేస్తున్న పండా తప్పులను తీవ్రంగా విమర్శించింది. ఆ ప్లీనంలో ఆమోదించిన రాజకీయ సమీక్షను సుసంపన్నం చేయడంలో తన కృషి ఉంది.

2012 మార్చి నుండి తన అమరత్వం వరకు ఏఓబీలోని ఆదివాసీ, దళిత ప్రజలని, విస్థాపిత ప్రజలను కూడగట్టడంలో యూఎఫ్ పనిలో తీవ్రకృషిని కొనసాగించింది. ఒడియాలో

కరపత్రాలు, స్టేట్‌మెంట్లు రాసి రాజకీయంగా ప్రచారం చేసింది. తన ఈ కృషి ఏఓబీలోని కోరాపుట్ ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది.

పెద్ద కూతురుగా కామేశ్వరి తండ్రి చనిపోయాక తల్లికి అండగా నిలిచి ముగ్గురు చెల్లెళ్ల పెంపకం బాధ్యతను నెరవేర్చింది. మేనమామతో చిన్న వయస్సులోనే పెండ్లి జరిగి ఒక పాపకు జన్మనిచ్చింది. తర్వాత మేనమామలోని పితృస్వామిక ఆధిపత్యాన్ని సహించలేక విడాకులు తీసుకుంది. పాప బాధ్యతను తనే స్వీకరించి విద్యా బుద్ధులు నేర్పించింది. తను పాపకు దూరంగా ఉంటూనే పీడిత ప్రజల పిల్లల్ని తన పిల్లలుగా భావించి ఆచరణలో ఉన్నతంగా నిలిచింది. తన తర్వాత చెల్లి కామ్రేడ్ శ్వేత (సత్యవతి) 2005లో మల్కనగిరి జిల్లా పూజారిగుడ ఎన్‌కౌంటర్‌లో అమరురాలైన విషయం తెలిసి ఆమె మరింత పట్టుదలగా విప్లవ కార్యాచరణకు అంకితమయింది.

ఏఓబీ ఉద్యమం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న సమయంలో కోరాపుట్ రైతాంగ పోరాటాల వెల్లువ వచ్చింది. ఆ సమయంలో ఆదివాసీ రైతాంగాన్ని మహిళలను కదిలించి వర్గపోరాటం నడపడంలోను, నిర్మాణాత్మక సహకారం అందించడంలో, ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాలను సమన్వయించి నాయకత్వానికి మద్దతును అందించడంలో చురుకైన పాత్రను నిర్వహించింది. ఒడిశా గ్రామీణ ప్రాంతాల మధ్య సమన్వయానికి, ఏఓబీ–ఓఎస్ రెండు జోన్‌ల మధ్య సంబంధాలు అభివృద్ధి కావడానికి ఆమె ఒడియా భాష నేర్చుకుని ఎంతో కృషి చేసింది. బాక్సైట్ వ్యతిరేక ఆందోళనలో, కాఫీ ప్లాంటేషన్ వ్యతిరేక ఆందోళనలోను ప్రజల్ని ఐక్యపరచడంలో, విద్యార్థి ఉద్యోగులతో కలిసి, వారి ఉద్యమాలతో ఐక్యమయ్యి ఉత్సాహంగా నేతృత్వాన్ని అందించింది. బోల్షివిక్ పత్రిక నిర్వహణలోను, యూఎఫ్ నిర్మాణ కృషిలోను ఏఓబీ ఎస్‌జెడ్‌సీకి ఆమె ఎంతో సహకరించింది.

కా॥ కామేశ్వరి అమరత్వం డివిజన్ ఉద్యమానికే గాక, ఏఓబి ఉద్యమానికి కూడా నష్టం. పట్టణ, కార్మిక ఉద్యమ అనుభవంతో పాటు, గెరిల్లా యుద్ధ అనుభవం కలిగిన సీనియర్ మహిళా కామ్రేడ్, భవిష్యత్‌లో నాయకత్వంలోకి రాగలిగిన కామ్రేడ్‌ను కోల్పోయాం. కార్మికవర్గంలో పనిచేసి రావడం వల్ల ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించేది, తప్పులను సూటిగా విమర్శించడంతో పాటు పట్టణ జీవితంలోని పెటీబూర్జువా అలవాట్ల నుండి బయటపడి డిక్లాసిఫై కావడం కొరకు కృషి చేసింది.

## *మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ కామ్రేడ్ అమరుడు బొడ్డుపల్లి నారాయణ (60)కు అరుణారుణ జోహార్లు*

కామ్రేడ్ నారాయణ దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్లికల్లు గ్రామ నివాసి. 60 సంవత్సరాల వయస్సులో నారాయణ కన్నుమూసిన విషయం ఆలస్యంగా పార్టీకి తెలిసింది. ఆ ప్రాంతంలో ఉద్యమం దెబ్బతినడం, ఆయనతో సంబంధం ఉన్న కామ్రేడ్స్ అమరులు కావడంతో ఆయన మరణ వార్త వెంటనే తెలియలేదు. విప్లవోద్యమంలో, వేరే రాష్ట్రంలో పని చేస్తున్న ఆయన బిడ్డకు తద్వారా పార్టీకి ఆ విషాద వార్త ఏడు సంవత్సరాల తర్వాతనే తెలిసింది.

మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన నారాయణ ఆ గ్రామంలో మొదటి విద్యావంతుడు.ఆయన తన ఉన్నత పాఠశాల విద్యను కల్వకుర్తిలో పూర్తి చేసాడు. కొద్ది కాలం ఆదిలాబాద్ జిల్లా బోధన్‌లో అకౌంటెంట్‌గా పనిచేసాడు. కామ్రేడ్ నారాయణ దంపతులకు నల్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు పుట్టారు.

ఎల్లికల్లు గ్రామంలోనే ఉంటూ మెకానిక్‌గా స్థిరపడిన నారాయణ విప్లవోద్యమ కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. 1990లలో సారా వ్యతిరేక పోరాటంలో భాగంగా ఆ ప్రాంతంలో ప్రమాదవశాత్తు అమరుడయిన కామ్రేడ్ అంజన్న ఆయనకు ప్రాణ స్నేహితుడు. అంజన్న పరిచయం చేసిన పీపుల్స్‌వార్ పార్టీ రాజకీయాలతో ఆ అమరుడి ఆశయాలను కొనసాగించే లక్ష్యంతో జీవితాంతం వరకు ఆ రాజకీయాలకు అంకితమై బాధ్యతగా నారాయణ పని చేసాడు.

ఎల్లికల్లులో రైతు కూలీ సంఘానికి నాయకత్వం వహిస్తూ ప్రజలను సమీకరించి పలు పోరాటాలను నడిపాడు. ఆ క్రమంలో శత్రు నిర్బంధాన్ని ఎదుర్కొన్నాడు. మెకానిక్‌గా అనేక ప్రాంతాలకు వెళ్ళే నారాయణ పార్టీ సంబంధాల విస్తరణకు చాలా కృషి చేసాడు.

1990ల తర్వాతి నిర్బంధ పరిస్థితులలో రహస్య పని విధానం అలవరుచుకుని అక్కడి దళాలతో నిరంతర సంబంధాలలో ఉంటూ ప్రజలకూ పార్టీకీ మధ్య వారధిగా పనిచేసాడు. గ్రామంలో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ ఉద్యమంలో జరిగే మంచి చెడులను విమర్శనాత్మకంగా పరిశీలించి పార్టీకి సహకరించిన నారాయణ ఆ ప్రాంత ప్రజలకు తలలో నాలికగా మారిపోయాడు. పార్టీ అప్పజెప్పిన అనేక టెక్నికల్ పనుల్లో విశ్వసనీయంగా పని చేసాడు. కుటుంబంలో అందరికి విప్లవోద్యమంపట్ల విశ్వాసం కల్పించడంతో పాటు బిడ్డలను ఉద్యమంలోకి పంపాడు. ఆడపిల్లలు అన్నివిధాల ఎదగాలంటూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేవాడు.

దళానికి అన్ని రకాలుగా సహకరించిన నారాయణను పోలీసులు పలుసార్లు అరెస్టు చేసి అనేక చిత్రహింసలకు గురిచేసారు. నిప్పులు చెరిగే నిర్బంధంలో కామ్రేడ్స్ అమరులవుతున్న క్రమంలో కూడా ఆ ప్రాంతానికి కొత్తగా వెళ్ళిన కామ్రేడ్స్‌కు ఆయన ఎంతో సహకారాన్ని అందించేవాడు. భారతదేశ పీడిత ప్రజలందరి ఆశాజ్యోతిగా విప్లవోద్యమం ఎదగడం వెనుక నారాయణ లాంటి వారి త్యాగాలున్నాయి. అలాంటి వారి అసమాన త్యాగాలు, కృషితో ముందుకు సాగుతున్న విప్లవోద్యమం కామ్రేడ్ నారాయణకు వినమ్రంగా జోహార్లు చెబుతోంది. అటువంటి అజ్ఞాత త్యాగ ధనుల త్యాగాలను గుర్తు చేసుకుందాం, ఎత్తి పడదాం.

ఎమ్.ఎమ్.సీ అమరులు

'సమాధాన్' దాడులను ప్రతిఘటిస్తూ

# 'శిల్ప' కొండలలో కాలూనుకుంటున్న ప్రజా విప్లవోద్యమం

2016 ప్రారంభం నాటికి దండకారణ్యం దాటి మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులలోని విశాల అటవీ ప్రాంతానికి విప్లవోద్యమం విస్తరించింది. 1990ల నుండి ఆ ప్రాంతంలో కొనసాగుతున్న విప్లవోద్యమానికి అండగా, ఆ విప్లవోద్యమం పై ఆధారపడి విస్తరించిన విప్లవోద్యమం ఆ నూతన ప్రాంతంలో అపార ప్రజా మద్దతుతో గత మూడేళ్లలో కాలూనుకోగలిగింది. కానీ, భారత పాలకవర్గాలు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ విప్లవోద్యమం కాలూనుకోకుండా, నిలదొక్కుకుండా నిరంతరం తీవ్రమైన సైనిక దాడులకు పాల్పడుతున్నవి. గతంలోనూ 2006-07 వరకు ముమ్మరమైన సైనిక దాడులను కొనసాగించిన ఫలితంగా విప్లవశక్తులు తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికి మళ్లీ దశాబ్ద కాలం తిరక్కముందే మరింత విశాల ప్రాంతానికి, ప్రజలలోకి మరిన్ని అదనపు బలగాలతో విప్లవోద్యమం చేరుకుంది.

మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం (ఎమ్.ఎమ్.సీ.) సువిశాల అటవీ ప్రాంతం. దట్టమైన దేవదారు (సాల) వనాలను కలిగి ఉండి ఎతైన కొండలతో కూడుకున్న ఆ ప్రాంతంలో వివిధ మూలవాసీ తెగల జన సముదాయాలున్నవి. అంతే కాకుండా, ఆ అడవుల గర్భాన్ని చీల్చుకుంటూ వలస భారతంలోనే జాతీయ రహదారులు, రైల్వే మార్గాలు నిర్మితమయ్యాయి. ఆ ప్రాంతంలోనే ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యానికి గురై విలుప్తమవుతున్న తెగల జాబితాలోకి చేరిన బైగా మూలవాసీ జన సముదాయం గతానికి అవశేషంగా నేటికింకా మిగిలి ఉంది. ఆ ప్రాంతం అపార ప్రాకృతిక సంపదలకు నిలయం. దేశంలో ఎంతో ప్రాచుర్యం పొంది దేశ, విదేశీ పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్న 'కన్హా జాతీయ పార్క్', 'భోరందేవ్ రక్షిత అడవులు' అక్కడి ఆదివాసీ ప్రజా జీవితాలలో కల్లోలం సృష్టించి, వారి జీవితాలను ధ్వంసం చేసి రూపొందినవే. ఉత్తర, దక్షిణ భారతావనికి కేంద్రంగా నిలచిన మధ్య భారతంలోని కీలకమైన ప్రాంతమది. ఇంకా అనేకానేక ప్రాముఖ్యతలు సంతరించుకున్న ఆ ప్రాంతంలో విప్లవోద్యమం కాలూనుకోకూడదనీ భారత పాలకవర్గాలు కృత నిశ్చయంతో వ్యూహాత్మకంగానే ఎడతెరిపిలేని సైనిక దాడులకు పాల్పడుతున్నాయి.

ఆ ప్రాంతంలోని మూలవాసీ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ ప్రాంతం రాజ్యాంగం పేర్కొన్న ఐదవ షెడ్యూల్ కిందే ఉన్నప్పటికీ, ఆ ప్రాంతంలో పెసా చట్టాన్ని అమలు చేయాలనీ, గ్రామసభలను ప్రకటించాలనీ 23 ఏండ్ల క్రితమే చట్టం ఘోషించినప్పటికీ ఆ మూలవాసీ ప్రజలకు అవేవీ ఒనగూరలేదు. పుష్కర కాలం క్రితమే 'నూతన అటవీ హక్కుల చట్టం-2006' వెలుగుచూసినప్పటికీ ఆ ప్రాంతవాసుల సాగుభూములకు ప్రభుత్వ పట్టాలే లభించలేదు. అందులో పేర్కొన్న 13 రకాల హక్కులలో ఏ ఒక్కటీ అటవీ శాఖ అధికారులు వారికి దక్కనివ్వ లేదు. వారి జీవనోపాధికి పరిపడా సాగు భూములు లేక, స్థిర వ్యవసాయ పద్ధతులు బోధపడక, కొండ ప్రాంతాలలో అనివార్యంగా వారు చేసుకునే కాలం చెల్లిన పోడు వ్యవసాయంతో పొట్ట గడువక తుదకు వారు తమ జీవిక కొసం అడవిలోని అడ్డాకులు (పావురాకులు) సేకరించి అమ్ముకొని చాలీ చాలని జీవితాలతో రోజులు గడుపుతున్న బైగా ఆదివాసీలు అత్యంత వెనుకబడి ఉన్నారు. మైదాన ప్రాంతాలలోని ఆదివాసీ ప్రజలు పూటగడువక పొట్ట చేతపట్టుకొని దేశంలోని అనేక నగరాలకు, మహానగరాలకు కూలీ పనులకు వెళ్లి దారుణమైన, అసహజమైన ఫుట్‌పాత్ జీవితాలు అనుభవిస్తున్నారు. అనాదిగా వారు ఆ అడవిలోనే జీవిస్తున్నప్పటికీ, నానాటికి వారు ఆ అడవుల నుండి పరాయికరణ చెందుతూ అనవమాన భారతంలోని పట్టణాలలో కడుపేదరికాన్ని అనుభవిస్తున్నారు. అలాంటి ప్రాంతంలోకి విప్లవోద్యమం విస్తరించడం వారికి ఎంతో శక్తి నిచ్చింది. వారు తమ సర్వస్వాన్ని ఒడ్డి విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి పూనుకుంటున్నారు.

ఆ ప్రాంతంలోని మూడు రాష్ట్రాలలో బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులే అధికారంలో ఉండడంతో అక్కడి మూలవాసీ ప్రజలు తమ ఆర్థిక, రాజకీయ సమస్యలకు తోడు సామాజిక, సాంస్కృతిక రంగాలలో అదనపు సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారిని మూలవాసులుగా గుర్తించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బ్రాహ్మణ కౌటిల్యంతో వనవాసులుగా వారికి ముద్రవేసి జన్మతః ఆ మూలవాసీ ప్రజలను బ్రాహ్మణీకరించడానికి ఎడతెగని పాట్లు పడుతున్నారు. 'ఘర్‌వాపసీ' పేరుతో దాడులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో బ్రాహ్మణ దేవతల ప్రార్థన చేయకుండా మూలవాసీల పిల్లలకు కనీసం తిండైనా దొరుకని దుస్థితి నెలకొంది. కోడిగుడ్లు సైతం మాంసాహారం అంటూ మాంసప్రియ మూలవాసీ పిల్లలను 100% శాకాహారులుగా బలవంతంగా బ్రాహ్మణం మలుస్తోంది. దర్రెకస్స ప్రాంతంలోని కచ్చార్‌గడ్‌లో నున్న ఆదివాసీ దేవతలను బ్రాహ్మణీకరించడానికి రాజ్యం అనేక కుట్రలకు పాల్పడుతోంది. బ్రాహ్మణానికి తోడు క్రైస్తవం చేరి మతాల మధ్య చిచ్చు రేపుతూ ప్రజలను సమిధలుగా మారుస్తున్నారు. ఈ దాష్టీకాల నుండి ప్రజలను కాపాడుతూ వారికి అండగా నిలుస్తున్న విప్లవ పార్టీని తుదకంటా నిర్మూలించడానికి హిందుత్వ సంస్థలు దాడులకు పాల్పడుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో 15 యేండ్ల భారతీయ జనతా పార్టీ పాలన 2018 విధానసభ ఎన్నికల్లో పొందిన ఓటమితో ముగిసి కాంగ్రెస్ గద్దెనెక్కింది. ఛత్తీస్‌గఢ్ చిన్న రాష్ట్రం కావడంతో అభివృద్ధికి అనేక అవకాశాలు ఉంటాయనీ ప్రజలను మురిపింపచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో మధ్యప్రదేశ్‌లాగే మూడో వంతు ప్రజలు మూలవాసీలు కావడం, దట్టమైన అడవులు, అపార ఖనిజ నిక్షేపాలు, పుష్కలమైన జల వనరులు వుండడంతో బడా కార్పొరేట్ సంస్థలు రాష్ట్రాన్ని

కొల్లగొట్టడానికి పోటీ పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వాటితో అనేక ఒప్పందాలు చేసుకొని వాటి అమలుకై రాష్ట్రాన్ని ఖాకీ వనాలుగా మార్చివేసింది. వేల సంఖ్యలో పోలీసు, అర్ధసైనిక బలగాలను రాష్ట్రంలో మోహరించారు. ప్రజల, ప్రజా అస్థుల సంరక్షణలో దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాడుతున్న విప్లవకారులను, వారు నిర్మిస్తున్న విప్లవప్రజా సంఘాలను తుదముట్టించడానికి పోలీసు బలగాలు తీవ్రమైన అణచివేత దాడులకు పూనుకుంటున్నాయి. ప్రజలు తమ అస్థులకోసం ఆత్మగౌరం కోసం అధికారం కోసం చేస్తున్న పోరాటాలను ఉక్కు పాదంతో అణచివేయడానికి పోలీసులు కార్పెట్ సెక్యూరిటీని అమలు చేస్తున్నయి. అడవినీ గ్రామాలను అనేక సెక్టార్లుగా విభజించి పోలీసు క్యాంపులు నెలకొల్పుతూ గనుల తవ్వకాలకు ఆగమేఘాల మీద ప్రయత్నిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన అనతికాలంలోనే ఎమ్.ఎమ్.సీ. జోన్‌లోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో గల ఛూఈఖదాన్ తాలూకాలోనున్న భాజీ ఢోంగ్రీ ఇనుపగనుల తవ్వకానికి భూపేశ్ బఘేల్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే బసంత్‌పుర్, దుటాగఢ్ గనుల తవ్వకానికి కూడా అనుమతి ఏ క్షణానైనా ఇవ్వడానికి ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2013లో అప్పటి ప్రభుత్వ ప్రయత్నాలను వమ్ము చేస్తూ సాగిన ప్రజాందోళన ఫలితంగా ఇప్పటివరకూ నిలిచిపోయిన గనుల తవ్వకాలను తిరిగి ప్రారంభించడానికి కార్పోరేట్ సెక్యూరిటీని పటిష్టం చేస్తున్నారు. అందులో భాగంగా గత ఆరు మాసాలలో రాజనంద్‌గాం జిల్లాలోని ఘాగ్రా, భావే, గోటా, కౌరవ్, దర్బాన్‌టోలాలతో పాటు కబీర్‌ధాం (కవర్ధా) జిల్లాలోని తేలీటోలా, పండ్రీ, మోహన్‌పుర్‌లోనే కొత్తగా పోలీసు క్యాంపులు వేయడం కాకుండా పొరుగున ఉన్న మధ్యప్రదేశ్‌లోని మండ్లా జిల్లాలోని లట్రాలో, బాలాఘాట్‌లోని ఖైరో, టేమ్నీ, టీమ్కీటోలాలలో కలిపి మొత్తంగా 13 నూతన క్యాంపులు వ్యూహాత్మక దృష్టితో వేశారు. వీటిని కలుపుకొని విప్లవోద్యమ విస్తరణను అడ్డుకొవడానికి గత మూడేళ్లలో 21 పోలీసు క్యాంపులు వేశారు. ప్రతి క్యాంపులో దాదాపు 250–300 సంఖ్యతో ప్రత్యేక, ప్రశిక్షిత బలగాలను పెడుతున్నారు. విప్లవకారుల కదలికలను నియంత్రించడానికి సెక్టార్లను దిగ్బంధనం చేస్తూ ముమ్మరమైన గాలింపు చర్యలు చేపడుతున్నారు. కీలకమైన ప్రాంతాలలో మాటుదాడులకు కూచుంటున్నారు. ఇటీవల ఒక మాటుదాడీలో చిక్కుకున్న గెరిల్లా దళంపై పోలీసులు జరిపిన కాల్పులలో సునీల్, ప్రతిమాలు అమరులయ్యారు.ఆ జోన్‌లో జరిగిన ఇతర శతృ సైనిక దాడులలో కామ్రేడ్స్ సాగెన్‌దీ, అశోక్, నందినీ అనే కామ్రేడ్స్ అసువులు బాసారు. గెరిల్లా దళాలపై గత ఆరు మాసాలలో పది చోట్లా సమాచార ఆధారిత దాడులు జరిగాయి. ఆ దాడులలో ముగ్గురు గెరిల్లాలు గాయపడగా వారిని ప్రజలు బతికించుకున్నారు. 2018 మేలో జరిగిన ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ ఆజాద్ అమరుడయ్యాడు. రోడ్లపై వెళ్లే ప్రయాణికులను పోలీసులు నిరంతరం తనఖీలు చేస్తున్నారు. సంతలలో ఏ కొన్ని సరుకులు ఎక్కువ మోతాదులో జనం కొనుగోలు చేసినా వారి గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకొని నానారకాలుగా వారిని వేదిస్తున్నారు. విప్లవ ద్రోహుల సమాచారంతో పోలీసులు గెరిల్లాల ఆనుపానాలను తెలుసుకొని దాడులు చేయడమే కాకుండా వారి డంపులను స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక క్యాంపెయిన్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆధునిక మానవ రహిత విమానాలను (డ్రోన్‌లను) ప్రవేశపెట్టారు. ఇవి రోజువారి గెరిల్లాల స్థావరాలను పసిగట్టడానికి వినియోగించబడుతున్నాయి. గత పది మాసాలలో పోలీసులు జరిపిన అన్ని దాడులలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పది మాసాల కింద పోలీసులకు లొంగిపోయిన జీ.ఆర్.బీ. డివిజన్ కార్యదర్శి ద్రోహి పహాడ్‌సింగ్ కీలక పాత్ర పోషించాడు.

నూతన ప్రాంతాలకు విప్లవోద్యమాన్ని విస్తరిస్తూ తమ వేడి వేడి నెత్తుర్లను ధార పోసిన వీరులెందరో శిల్పి కొండలలో, ఆదివాసీ హృదయాలలో నిలిచిపోయి చిరస్మరణీయులైనారు. ప్రజావీరులు–మృత్యుంజయులంటూ అక్కడి విప్లవోద్యమాన్ని నిలుపుకోవడానికి, వారి అసంపూర్ణ ఆశయాలను పరిపూర్తి చేయడానికి అక్కడి పార్టీ కేడర్లు, ప్రజా గెరిల్లాలు, విప్లవ ప్రజలు గత మూడేళ్లుగా సామ్రాజ్యవాద బ్రాహ్మణవాద ప్రాయోజిత ఫాసిస్టు 'సమాధాన్' సైనిక వ్యూహంతో తలపడుతున్నారు. ఆ ప్రజా విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి యావత్ విప్లవ శిబిరం పూనుకోవలసిన కీలక సమయమిది. దేశంలోని సమస్త ఆదివాసులు తమ సోదర ఆదివాసులకు అండగా నిలువాల్సిన తరుణమిది. ఆ ప్రాంతం నుండి ఘరానా కార్పోరేటు సంస్థలు కొల్లగొట్టుకపోతున్న ప్రాకృతిక వనరులను కాపాడుకోవడానికి నిజమైన దేశభక్తులంతా కుత్సిత, కపట దేశభక్తినీ, సామ్రాజ్యవాదాన్ని అంటకాగుతున్న బ్రాహ్మణ జాతీయ వాదాన్నీ ఎండగడుతూ నడుం బిగించాల్సిన ఆవశ్యకత నేడెంతో ఉంది. అక్కడి విప్లవోద్యమంపై విరుచుకుపడుతున్న 'హాక్‌ఫోర్సు', 'సీ–60' 'డీ.ఆర్.జీ.' కమాండో బలగాలను, అర్ధ సైనిక బలగాలను ఎదుర్కొంటున్న ప్రజా విప్లవ శక్తులతో భుజం భుజం కలుపుతూ సమస్త ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలురు, లౌకికవాదులు ప్రజా పోరాటాలలో ముందుండాలని అక్కడి పార్టీ విజ్ఞప్తి చేసింది.

విప్లవకారులను అమానుషమైన హత్యలు చేయడానికి రాజనంద్‌గాం జిల్లాలో ఐ.పీ.ఎస్. అధికారి వై.పీ. సింగ్ నాయకత్వంలో ఒక ప్రత్యేక నరహంతక దళం పని చేస్తోంది. నిరాయుధులైన కామ్రేడ్స్‌ను పట్టుకొని ముందు కర్రలతో ఆపాదమస్తకం విపరీతంగా బాది, తర్వాత అచేతనావస్థలో పడి ఉన్న వారిపై రాళ్లేత్తేసి అతి క్రూరంగా, అనాగరికంగా చంపడం ఆ నరహంతకదళం ప్రత్యేకత. 28 జూన్, 2017నాడు గండాయి పోలీసు స్టేషన్ పరిధిలో గల సుక్తరా గ్రామ సమీపంలో నిరాయుధులైన నందూ, రాజులను; 9 ఫిబ్రవరి, 2018 రోజు గాతాపార్ పోలీసు స్టేషన్ పరిధిలోగల లచ్చున్‌టోలాలో కామ్రేడ్స్ వినోద్, సాగర్‌లను; ఆ తర్వాత మరో రెండు మాసాలకు దూటాగఢ్ అడవిలో ప్రత్యేక పనిపై సివిల్‌లో వెళ్తున్న నవయువ్వన

ప్రాయంలోనున్న అక్షయ్ (19)ని; 29 మే, 2018నాడు కన్‌గుర్రా అడవిలో కామ్రేడ్ ఆజాద్‌ను వై.పీ. సింగ్ నాయకత్వంలో ఏర్పడిన నరహంతకదళం విచక్షణారహితంగా హింసించి హత్య చేసింది. ఆ ప్రాంతంలో ఇప్పటివరకూ పోలీసుల చేత చిక్కిన కామ్రేడ్స్ నందరినీ ఒక్క తూటా కూడా కాల్చకుండానే యమయాతనలకు గురి చేసి ఆ నరహంతకదళం హతమార్చి బూటకపు ఎదురుకాల్పుల కథలల్లడం దానికి సర్వసాధారణమైంది. ఎమ్.ఎమ్.సీ. ప్రాంతంలో విప్లవోద్యమ పురోగమనంలో ఇటీవల ఆ తరహా హత్యలకు గురై అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం. అమరుల ఆదర్శ జీవితాల విశేషాలు చూద్దాం.

## కామ్రేడ్ మంగూ (సునీల్)



బీజాపుర్ జిల్లా గంగలూర్ ప్రాంతంలోని పిడియా-మదుమ్ గ్రామంలో మద్కం బండి, ఇడిమేల ముగ్గురి సంతానంలో కామ్రేడ్ సునీల్ ఒకరు. తల్లి తండ్రులు ఆయనకు మంగూ అనే పేరు పెట్టారు. కామ్రేడ్ సునీల్ చిన్న తనం నుండి వ్యవసాయ పనులతో పాటు పశువులను మేపుతూ తల్లి తండ్రులకు బాసటగా వుండేవాడు. వారిది పేద కుటుంబం కావడంతో స్కూల్‌కు వెళ్లే అవకాశమే లేదు. వారి కుటుంబం దంతెవాడ జిల్లా కువ్వకొండ బ్లాక్‌లోని సమేలి ఊరి నుండి బతుకుతెరువుకోసం మదుం చేరింది. వారు ఎంతో కష్టపడి విప్లవోద్యమ అండతో అడవి భూమిని సాగులోకి తెచ్చుకున్నారు. అత్యంత పేదరికంలో వుండడంతో కామ్రేడ్ సునీల్ చిన్నతనంలోనే తన పినతల్లి వద్దకు పశువుల కాపరిగా కొంతకాలం వుండి పరిస్థితులు సహకరించకపోవడంతో తిరిగి తన కుటుంబం వద్దకు చేరాడు.

గంగలూర్ ప్రాంతం విప్లవోద్యమానికి బలమైన కేంద్రాలలో ఒకటి. ఆ ప్రాంతంలో చిన్నా పెద్దలంతా ఏదో ఒక ప్రజా నిర్మాణంలో వుంటూ విప్లవోద్యమంలో పాలుపంచుకుంటున్నారనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. మద్కం మంగూ వ్యవసాయ పనులలో పాల్గొంటూనే గ్రామ చేతన నాట్య మంచ్ (సీ.ఎన్.ఎమ్.)లో చేరి విప్లవ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనసాగాడు. ఆ ప్రాంతంలోని అనేక గ్రామాలకు వెళ్ళి సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చాడు. ఫాసిస్టు సల్వాజుడుం, గ్రీన్‌హంట్ దాడులను ఎదుర్కొంటూ తమ మనుగడకోసం పోరాడుతున్న ప్రజలకు ఆ విప్లవ సాంస్కృతిక ప్రదర్శనలు గొప్ప పోరాట సందేశాన్నిచ్చేవి. కామ్రేడ్ మంగూ రెండు సంవత్సరాలు సీ.ఎన్.ఎమ్.లో పని చేస్తూనే ప్రజా మిలీషియా చర్యలలో క్రియాశీలంగా పాల్గొనేవాడు. 2013లో పోలీసులు మదుమ్‌పై దాడి చేసి పట్టుబడిన గ్రామస్తులను గంగలూర్ పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లారు. వారిలో కామ్రేడ్ మంగూ కూడా వున్నాడు. పోలీసులు ఎంత వేదించిన తనకు తెలిసిన ఏ ఒక్క పార్టీ రహస్యం ఆయన పోలీసులకు చెప్పలేదు. వెంటనే గ్రామ మహిళలంతా జమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ గ్రామస్తులను విడిపించుకవచ్చారు. కామ్రేడ్ మంగూ 2015 జులైలో విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు.

2015లో పార్టీ చేపట్టిన నూతన విస్తరణలో కామ్రేడ్ మంగూ భాగమై ఎమ్.ఎమ్.సీ. ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ నూతనంగా ఉనికిలోకి వచ్చిన కే.బీ. (కన్హ-భోరందేవ్) డివిజన్‌లో భాగమైనాడు. కామ్రేడ్ మంగూ అక్కడికి వెళ్లిన తర్వాత సునీల్ పేరుతో ప్రజలలో పని చేస్తూ మూడు రాష్ట్రాల సరిహద్దులలో మూడు ప్రాంతాల ప్రజలతో కలసి వారి భాషలు నేర్చుకుంటూ ఎంతో ఉత్సాహంగా విప్లవ కార్యక్రమాలు కొనసాగించాడు. చదువు రాని సునీల్ ఒక చేత తుపాకి మరో చేత కలం పట్టి చదువు నేర్చుకున్నాడు. విప్లవోద్యమాన్ని తుదకంటా నిర్మూలించే దుష్ట లక్ష్యంతో మూడు రాష్ట్రాల పోలీసు బలగాలు కొనసాగించిన అనేక సైనిక దాడుల నుండి ఎంతో అప్రమత్తతతో బయటపడుతూ పని చేసిన కామ్రేడ్ సునీల్ తుదకు 2018 మే 31 నాడు కబీర్‌ధామ్ జిల్లా తారేగావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బక్రీ అడవిలో జరిగిన ఎదురు కాల్పులలో పోలీసులతో అత్యంత ధైర్య సాహసాలతో పోరాడుతూ అసువులు బాశాడు. 18 యేండ్ల నవయవ్వన ప్రాయంలో విప్లవోద్యమంలోకి అడుగుపెట్టిన కామ్రేడ్ మంగూ తన 21వ యేటి వరకు ఒక విప్లవ పార్టీ సభ్యుడిగా ఎదిగి విప్లవాశయాల సాధనలో ప్రాణ త్యాగం చేశాడు. కామ్రేడ్ సునీల్ అమరత్వం నేటి యువతరానికి విప్లవ బాటను చూపుతుంది.

## కోస్మీ పోరాట వారసుడు కోరేటి దొవెన్ (సునీల్)

కామ్రేడ్ వినోద్ గఢ్‌చిరోలీ జిల్లా ధనోరా తాలూకా కోస్మీ గ్రామంలో కోరేటి వారి కుటుంబంలో 30 యేండ్ల క్రితం జన్మించాడు. ఆయనకు తల్లి తండ్రులు దొవెన్ పేరు పెట్టుకున్నారు. 1990ల ప్రారంభంలో గఢ్‌చిరోలీ జిల్లాలోని టిప్రాగఢ్ ప్రాంతానికి విప్లవోద్యమం విస్తరించిన తర్వాత బలమైన ప్రజాపునాది ఏర్పడిన గ్రామాలలో కోస్మీ ఒకటి. విప్లవ ప్రజా నిర్మాణాలలో సంఘటితపడిన



ఆ ఊరి రైతులు, మహిళలు, యువకులు ఒకవైపు ప్రజా పోరాటాలలో ఎంతో క్రియాశీలంగా పాల్గొంటూ మరోవైపు ఉద్యమంలోకి దాదాపు రెండు డజన్‌ల సంఖ్యలో ఆ ఊరి యువతీ యువకులు భర్తీ అయ్యారు. వారిలో దావెన్ ఒకరు. దావెన్ దళంలో భర్తీ అయ్యే నాటికి ఆ ఊర్లో జనతన సర్కారు ఏర్పడి అనేక విప్లవ సంస్కరణలను చేపట్టి కొనసాగిస్తూండింది. వాటన్నింటిలో మిలీషియా కార్యకర్తగా దావెన్ క్రియాశీల పాత్ర ఉంది. ఆ క్రమంలోనే దావెన్ 2012-13లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో భాగమయ్యాడు.

విప్లవోద్యమంలో చేరిపోయిన దావెన్ వినోద్ పేరుతో జిల్లాలోని టిప్రాగఢ్, కోర్చీలలో ఎక్కువ కాలం పని చేశాడు. ఆయన పట్టుదల, అధ్యయనం, గెరిల్లా చర్యలలో చూపే చొరవతో పాటు ఆయన కుటుంబం, గ్రామ వారసత్వాన్ని పరిగణనలోనికి తీసుకున్న పై కమిటీ కామ్రేడ్ సనీల్‌ను కేంద్ర కమిటీ సభ్యుడి రక్షణ దళంలోకి బదిలీ చేసింది. ఆ బాధ్యతలలో దాదాపు మూడేళ్లు ఎంతో విశ్వసనీయంగా తన సేవలందించాడు. ఆ సమయంలో కంప్యూటర్ నేర్చుకున్నాడు. ఆ తర్వాత విప్లవోద్యమ అవసరాల రీత్యా ఆర్గనైజేషన్ పనులలోకి వెళ్లాడు. అక్కడ ఆయన దర్రెకస్స, తాండా, మలాజ్‌ఖండ్ ప్రాంతాలలో పని చేశాడు. అక్కడున్న సైనిక నిర్మాణాలలో భాగమై ప్రజా యుద్ధ నిర్వహణలో పాలు పంచుకుంటూ ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. ఆయన సైనిక సామర్థ్యం, సైనిక చర్యల నిర్వహణను అర్థం చేసుకున్న తన యూనిట్ సభ్యులు, పై పార్టీ ఆయనను ప్లాటూన్ డిప్యూటిగా నియమించింది. ఆయన ఉక్కు క్రమశిక్షణ కలిగిన కామ్రేడ్. ఆయనలో కుటుంబ, గ్రామ విప్లవ నిర్మాణాల వారసత్వంగానే కమ్యూనిస్టు విలువలు అబ్బాయి. ఆయన ఎక్కడున్నా విప్లవ కార్యకలాపాలలో అవిరామ కృషి చేసేవాడు. ఆయన ప్రజలను నిజమైన గురువులుగా భావించేవాడు.. ఆయన ప్రజల నుండి నిత్యం ఒక వినమ్రత కలిగిన విద్యార్థిగా అనేక విషయాలు నేర్చుకునేవాడు. అతడు విప్లవ ద్రోహులను శిక్షించడంలో ముందుండేవాడు. ఆయన పాల్గొన్న మిలటరీ చర్యలలో మంచి విజయాలు సాధించాడు. ఆయన అమరత్వం ( 2018 ఫిబ్రవరి

9) నూతన విస్తరణ ఉద్యమానికి ఎంతో లోటు అయినప్పటికి ఆయన నిలిపిన ఆదర్శాలు అనేక మంది యువతను విప్లవకారులుగా తీర్చిదిద్దుతాయి.

## కామ్రేడ్ సాగర్ అమర్ రహే

రాజ్‌నందగాం జిల్లా ఖైరాగఢ్ తాలూకా గాతాపార్ పోలీస్‌స్టేషన్



పరిధిలోగల బోర్లా గ్రామ సమీపాన నిరాయుధులైన కామ్రేడ్ సాగర్, వినోద్‌లను ద్రోహి చైతురాం అందించిన సమాచారంతో పోలీసులు 2018 ఫిబ్రవరి 9నాడు అరెస్టు చేశారు. ఆ ఇద్దరు గెరిల్లాలను పోలీసు హంతక దళం నిర్దాక్షిణ్యంగా, పాశవికంగా హత్యచేసింది.

కామ్రేడ్ సాగర్ బీజాపూర్ జిల్లా గంగలూర్ ప్రాంతంలోని మోస్లా గ్రామంలో 20 ఏండ్ల క్రితం ఏమ్లా కుటుంబంలో జన్మించాడు. ఆయనకు తల్లి తండ్రులు పైకూ అని పేరు పెట్టుకున్నారు. కామ్రేడ్ పైకూ చిన్నతనంలోనే విప్లవోద్యమం పట్లా ఆకర్షితుడయ్యాడు. ఫాసిస్టు సల్వా జుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ల మధ్య పెరిగిన తరం కావడంతో ఆయనలో సహజంగానే తన ఆదివాసీ సమాజం పట్లా అపార ప్రేమాభిమానం ఉండేది. తమ ఉనికి కోసం, ఆత్మ గౌరవం కోసం జీవన్మరణ పోరాటం చేస్తున్న ప్రజల కోసం వర్గపోరులో ఎంతటి త్యాగాలకైనా వెనుదీయరాదనే దృఢ సంకల్పం ఆయనలో నరనరాన జీర్ణించుకుంది. ఆయన చిన్ననాటి నుంచే సీఎన్నెం లో భాగమై విప్లవ ఆట-పాటలతో ప్రజలను అలరించేవాడు. గంగలూరు ప్రాంతంలో ఎదిగిన అందరు యువతీ యువకుల్లాగా ప్రజా మిలీషియాలో పాలు పంచుకున్నాడు. ఆయన అనేక మిలీషియా చర్యలలో పాల్గొని జనతన సర్కార్లను, ప్రజలను కాపాడడంలో తన వంతు పాత్ర ఆయన పోషించాడు. ఆ క్రమంలో ఆయన 2015 జులైలో పూర్తికాలం విప్లవకారుడిగా ఉద్యమంలో

*(మిగతాది 44వ పేజీలో...)*

# కామ్రేడ్స్ మున్నీ, అనిత, రాజు, ప్రమీలాలకు విప్లవ జోహార్లు!

మైన్‌పుర్–నువపడా డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ సీమను డీఆర్‌జీ హంతకులు పట్టుకొని హత్య చేసిన నెత్తుటి తడి ఆరక ముందే అదే ఏరియాలోని (సీతా నది) కట్టిగావ్ అటవీ ప్రాంతంలో ఏరియా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ రాజు, ప్రమీలాలు; పార్టీ సభ్యులు కామ్రేడ్స్ మున్నీ, అనితలు శతృవుతో పోరాడుతూ జూలై 6న అమరులైనారు. గోబ్రా, సీతానది ఏరియా కమిటీల కామ్రేడ్స్ రాజకీయ తరగతులు జరుపుకుంటుండగా శతృదాడి చేసి ఈ నలుగురు కామ్రేడ్స్‌ను చంపివేశారు. వారందరికి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిద్దాం.

## భూమి పుత్రిక కామ్రేడ్ గనేశ్వరి (ప్రమీలా) విప్లవ సేవలు అవిస్మరణీయం

కామ్రేడ్ ప్రమీలా 25 సంవత్సరాల క్రితం గరియాబంద్ జిల్లా, ఉదంతీ ఏరియాలోని గోనా గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో జన్మించింది. తల్లి తండ్రులకు కలిగిన అయిదుగురి సంతానంలో మూడవ బిడ్డ కామ్రేడ్ ప్రమీలా. కామ్రేడ్ ప్రమీలాకు ఇంటి దగ్గరి పేరు గనేశ్వరీ నేతం. చిన్న తనంలోనే తండ్రి చనిపోవడంతో, 5వ తరగతి వరకే ఆమె చదువు సాగింది. తల్లితో వుంటూ ఆమె ఇంటి పనుల్లో, వ్యవసాయ పనుల్లో పాల్గొనేది.

2007లో పార్టీ మైన్‌పుర్ ఏరియాకు విస్తరించింది. గెరిల్లా దళం గ్రామంకు వెళ్లగానే గనేశ్వరి ఎంతో ఉత్సాహంతో చేరుకునేది. విప్లవకారులు పాడే విప్లవ గీతాలు, వారు చెప్పే విప్లవ రాజకీయాలకు ఆమె ఆకర్షితురాలయి మొదట సంఘంలో చేరింది. ఆ చైతన్యంతో తెగపెద్దలకు వ్యతిరేకంగా పోరాడింది.

ఆ గ్రామం నుండి గెరిల్లా దళంలోకి అయిదుగురు భర్తీ అయ్యారు. వారిలో కామ్రేడ్ ప్రమీలా కూడా ఉంది. 2009 మార్చ్‌లో దళంలోకి భర్తీ అయిన ప్రమీలా 201వరకు ఉదంతీ లోకల్ గెరిల్లా దళంలో సభ్యురాలిగా, 2011 నుండి 2019 జూలై 6నాడు తను అమరురాలయ్యేంత వరకు సీతానది ప్రాంతంలో పని చేసింది. సీతానది ప్రాంతంలోని ఆదివాసీలను, ఇతర ప్రజలను సంఘాల్లోకి సమీకృతం చేసింది. సీతానది అటవీ ప్రాంతాన్ని ప్రభుత్వం అభయారణ్యంగా ప్రకటించి, అక్కడి ప్రజల్ని విస్థాపితుల్ని చేయడానికి వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన పోరాటంలో వారిని సంఘటితం చేసీ కదిలించడంలో ప్రమీలా పాత్ర కూడా వుంది.

ఆమె రాజకీయ అభివృద్ధి, చైతన్యాన్ని గుర్తించి 2012లో ఏరియా కమిటీ పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చింది. ఆ తర్వాత 2016లో ఏరియా కమిటీ సభ్యురాలిగా డివిజనల్ కమిటీ ప్రమోట్ చేసింది.

ఆ గ్రామం నుండి రిక్రూట్ అయినవాళ్లలో ఊగిసలాటకు గురై కొందరు ఉద్యమాన్ని వదిలి వెనక్కి వెళ్ళి పోయారు. కానీ వారి బలహీనతలను సహృదయంతో అర్థం చేసుకున్న కామ్రేడ్ ప్రమీలా పార్టీలో దృఢంగా నిలబడింది. ప్రజలతో, పార్టీలోని అన్ని శ్రేణుల కామ్రేడ్స్‌తో కలిసి మెలిసి వుండేది. పార్టీ క్రమశిక్షణను పాటించేది. తనకు తెలిసిన మేరకు ఉద్యమ సమస్యల్ని ఏరియా కమిటీలో చర్చించేది. పార్టీలో జరిగే ఎలాంటి తప్పులనైనా విమర్శించేది. తను ఇష్టపడిన ఏరియా కమిటీ సభ్యుడితో కామ్రేడ్ ప్రమీలాకు వివాహం అయ్యింది. హర్మోన్స్ లోపం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ప్రమీలా స్థూలకాయంగా మారింది. తీవ్ర అనారోగ్య సమస్య, అత్యంత పాశవికమైన శత్రు దాడుల మధ్య ఆమె అంతంతమాత్రంగానే దొరికే వైద్య చికిత్స పొందుతూ చాలా పట్టుదలగా పనిచేస్తూ ప్రజల కొరకు ప్రాణాలర్పించింది.

**కామ్రేడ్ గనేశ్వరి (ప్రమీల)కి విప్లవ జోహార్లు!**

## కామ్రేడ్ కొమురా బాలు (రాజు)

కామ్రేడ్ రాజు వయస్సు 25 సంవత్సరాలు. కాంకేర్ జిల్లా, అంతాగఢ్ బ్లాక్ అలయినార్ గ్రామంలో తల్లి సోమారి, తండ్రి చైనులకు కలిగిన ఆరుగురి సంతానంలో కామ్రేడ్ రాజు నాలుగవవాడు. కామ్రేడ్ రాజుకు తల్లి తండ్రులు బాలు అని పేరు పెట్టారు.

చిన్న వయస్సులో విప్లవ కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యి, 2008, డిసెంబర్ 2న దళంలోకి భర్తీ అయ్యాడు. భర్తీ అయిన తర్వాత ఆరునెలలు కిస్కోడ్డో దళంలో పని చేశాడు. దళంలోనే చదువు నేర్చుకున్నాడు. కిస్కోడ్డో ఏరియాలో తెగ పెద్దల ఆధిపత్యానికి వ్యతిరేకంగా దళంతో కలిసి ప్రజల్ని ఐక్యం చేశాడు. యువకులను ఉత్సాహపరుస్తూ సంఘటితం చేయడంలో, మిలీషియాలోకి భర్తీ చేయడంలో కామ్రేడ్ రాజు ముందున్నాడు.

విప్లవోద్యమాన్ని విస్తరించడానికి మైన్‌పుర్ డివిజన్‌కు బదిలీ కావాలనీ పార్టీ ప్రతిపాదించగా, వెంటనే చాలా సంతోషంగా ఆమోదించి వెళ్ళాడు. ఆ సమయంలో ఆయనతో పాటుగా అయిదుగురు విస్తరణకు వెళ్ళితే, వారిలో నుండి నల్గురు దిగజారగా కామ్రేడ్ రాజు మాత్రం ఉద్యమంలో దృఢంగా నిలబడ్డాడు.

మైన్‌పుర్ డివిజన్‌లోని ఉదంతీ దళంలో 2009 నుండి 2011వరకు దళ సభ్యుడిగా పని చేశాడు. 2011లో పార్టీ సభ్యుడయ్యాడు. 2012లో ఉదంతీ దళం నుండి బదిలీ అయి మరో అయిదు సంవత్సరాలు (2017 వరకు) జిల్లా కమిటీ సభ్యుడికి రక్షణగార్డ్‌గా బాధ్యతలను నిర్వర్తించాడు. 2016తో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. గార్డునుండి బదిలీ అయ్యి, 2017 నుండి 2019 జూలై 6నాడు అమరుడయ్యేవరకు గోబ్రా ఏరియా కమిటీ సభ్యుడిగా వుంటూ, అక్కడి ఉద్యమానికి నాయకత్వం వహించాడు.

కామ్రేడ్ రాజు ఉదంతి ఏరియాలో, గోబ్రా ఏరియాలో తీవ్ర నిర్బంధం మధ్య పనిచేశాడు. ప్రజల ఆదరాభిమానాలు పొందాడు. ప్రజలని సంఘాల్లో సంఘటితం చేస్తూ, పోరాటంలో వారిని

మందుంచేవాడు. శత్రువుతో పోరాడడంలో రాజు ఒక మంచి సాహసిక పోరాట యోధుడిగా గుర్తింపు పొందాడు.

గ్రామంలో మిలీషియాలో వున్నప్పుడే అనేక ప్రతిఘటన చర్యల్లో పాల్గొన్నాడు. దళంతో పాటు కూడా పలు సైనిక చర్యలలో పాల్గొన్నాడు. ఆర్గనైజేషనల్‌గా, గార్డుగా బాధ్యతలు నిర్వహించిన ఈ 11 సంవత్సరాల్లో కామ్రేడ్ రాజు దాదాపు 17 ఎన్‌కౌంటర్‌లలో శత్రువుతో సాహసికంగా పోరాడాడు. తన దళాన్ని, పార్టీ నాయకత్వాన్ని కాపాడడంలో ముందున్నాడు. ఎన్‌కౌంటర్స్‌లో గాయపడిన కామ్రేడ్స్‌ను రక్షించడం, వారికి వైద్య సేవలు అందించడంలో ఆయనకు ఆయనే సాటి.

గావ్‌సావ్ ఎన్‌కౌంటర్‌లో, జోలారాం, గాజీముంరా, జోలరామ్, బ్యేస్, కల్లారి ఎన్‌కౌంటర్‌లో ధైర్యంగా పోరాడాడు. తోటి కామ్రేడ్స్‌ని పోలీసు కాల్పుల నుండి రక్షించాడు. జూన్ 18వ తేదీన కట్టీగావ్ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సీమ (డీ.వీ.సీ.ఎం.) తన కళ్ళ ముందే నేల కొరిగినా, ఏ మాత్రం చవించకుండా మిగిలిన కామ్రేడ్స్‌ను రిట్రీట్ చేయడంలో, గాయపడిన కామ్రేడ్స్‌కు వైద్య సేవలు అందించడంలో తన పాత్రను పోషించాడు.

సివిల్‌లో చాలా చాకచక్యంగా పార్టీ అప్పజెప్పిన పనులు చేసేవాడు. ఇన్‌ఫార్మర్లను, వర్గ శత్రువులను నిర్మూలించడంలో ముందుండేవాడు.

మైన్‌పుర్‌కు వెళ్లిన కొద్ది కాలానికే ఛత్తీస్‌ఘడ్, హిందీ, స్థానిక ప్రజల కమర్ భాషలను నేర్చుకున్నాడు. సీదా సాదాగా వుండే కామ్రేడ్ రాజు పీడిత ప్రజలకు తలలో నాలుకలా వ్యవహరించేవాడు. ఆ అమరవీరుడి ఆదర్శాలతో అక్కడి ఉద్యమం పురోగమించి తీరుతుంది.

## కామ్రేడ్ పోమ్లా మాసే (మున్నీ) అమర రహే

నారాయణపుర్ జిల్లా ఇంద్రావతి ఏరియా, తాకిలోడ్ పంచాయితీ, జాడ్కా గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో 28 సంవత్సరాల క్రితం కామ్రేడ్ మున్నీ జన్మించింది. కామ్రేడ్ మున్నీ స్వంత పేరు కామ్రేడ్ మాసే.

ఇంద్రావతి ఏరియాలోని ప్రజా ఉద్యమ కార్యకలాపాలకు చిన్ననాటి నుంచే ఆకర్షితురాలయ్యింది. తాకిలోడ్ ప్రాంతంలో భూస్వాములకు, తెగపెద్దలకు వ్యతిరేకంగా, వారి పితృస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు జరిపిన పోరాటాల ప్రభావం కామ్రేడ్ మున్నీపై ఎంతో వుంది. దానితో తాను కూడా పూర్తికాలం ఉద్యమంలో పని చేయడానికి సిద్ధపడి 2005 నవంబర్‌లో దళంలో భర్తీ అయ్యింది. తను పూర్తికాలం విప్లవ కార్యకర్తగా వుంటూ మహిళా సంఘాల్ని కలుస్తూ వారితో పాటు అనేక పోరాటాలలో పాల్గొంది. తను భర్తీ అయిన ప్రారంభ సమయంలోనే ప్రజలపై ఫాసిస్టు సల్వాజుడుం విరుచుకు పడింది. అప్పుడు ప్రజల్ని సంఘటితంగా నిలబెట్టడంలో తన వంతు పాత్ర తాను నిర్వహించింది.

ఒడిశాలో ఉద్యమ విస్తరణకై 2010 మధ్య కాలంలో పార్టీ చేపట్టిన అదనపు బలగాల సమీకరణలో మున్నీ భాగమై అక్కడికి వెళ్ళింది. అక్కడ నూతనంగా ఏర్పడిన బొలంగీర్-బరగడ్-మహాసముంద్ (బీ.బీ.ఎమ్.) డివిజన్ ఉద్యమ ప్రాంతంలో పని చేసింది. ఉద్యమ అవసరల రీత్యా 2012లో నువపాడా డివిజన్‌లోని కోయల్‌బీతర్ దళంలో పని చేసింది. 2013 నుండి 2015 వరకు డివిజన్ కమిటీ సభ్యురాలికి గార్డ్‌గా రక్షణ బాధ్యతలలో వుండి నాయకత్వ రక్షణలో తన అమూల్యా సేవలను అందించింది. 2016 నుండి 2018 జూలై వరకు ప్లాటూన్‌లో పని చేసింది. అందులో భాగంగా కమిటీ సమావేశాల సందర్భంగా ప్రొటెక్షన్ బాధ్యతలను, ఆర్గనైజేషన్ పనుల్లో నాయకత్వానికి రక్షణగా వుండడంతో పాటు ప్రతిఘటన చర్యలలో చొరవగా పాల్గొంది. 2018 జూలైలో గోబ్రా దళంలో సభ్యురాలిగా బదిలీ అయ్యింది. ఆ సమయంలోనే ఆ దళ కమాండర్‌ను ఇష్టపడి పెళ్ళి చేసుకున్నది.

కామ్రేడ్ మున్నీ ప్రజలతో చాలా సన్నిహితంగా వుండేది. వంటరిగా (సివిల్) వెళ్ళి ప్రజల్ని ఆర్గనైజ్ చేసేది. నాయకత్వం చేప్పే అనేక ముఖ్యమైన పనులను చాలా చాకచక్యంగా చేసేది. ఆ పనులు చేసేప్పుడు నిబ్బరంగా వుండేది.

తను త్వరగానే హిందీ, ఒడియా, కమర్ భాషలను నేర్చుకుని ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలతో మమేకం కాగలిగింది. మిలటరీ రీత్యా ధృఢంగా వుండేది. 2010లో విస్తరణకు వెళ్ళిన తొలినాళ్ళలోనే మహాసముంద్ జిల్లా పడ్కిపల్లిలో ఎన్‌కౌంటర్ జరిగి 9 మంది కామ్రేడ్స్ అమరులైనారు. కొత్త ప్రాంతం అయినా శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ మున్నీ ఆ ఘటనలో రిట్రీట్ అయ్యింది. ఇంకా అనేక మిలటరీ చర్యల్ని సఫలం చేయడానికి ఆమె ఎంతో కృషి చేసింది.

ఆర్గనైజేషన్, మిలటరీ అనువభం వున్న కామ్రేడ్, గోబ్రా ఏరియాకు వచ్చిన కొద్ది కాలానికే అమరురాలు కావడం ఆ ప్రాంత ఉద్యమానికి వెంటనే పూడ్చుకోలేని నష్టమే అయినప్పటికీ ఆమె సంఘటితం చేసిన యువత ఆమె లేని లోటు కచ్చితంగా తీరుస్తారు, ఆమె జీవితాశయాలను పరిపూర్తి చేస్తారు.

## కామ్రేడ్ కోవాసి అడ్మే (అనిత) విప్లవ సేవలు చిరస్మరణీయం

కామ్రేడ్ అనిత, సుక్మా జిల్లా, దక్షిణ బస్తర్ డివిజన్, కిష్టారం ఏరియాలో దుర్మా గ్రామంలోని ఆదివాసీ పేద కుటుంబంలో జన్మించింది. తన తల్లి తండ్రులకు కలిగిన రెండవ సంతానం అడ్మే.

గ్రామంలో పితృస్వామిక అణిచివేతకు వ్యతిరేకంగా అడ్మే కేఏఎంఎస్‌లో ఉంటూ పోరాడింది. కుటుంబం వాళ్లు తనకు ఇష్టం లేని వివాహాన్ని బలవంతంగా చేయ తలపెట్టడంతో వ్యతిరేకించి మహిళల సమస్యలపై దళంలో చేరి పోరాడాలని నిర్ణయించుకుని, 2007లో భర్తీ అయింది. ఆమె శారీరక ధృఢత్వం, ఆట పాటల్లో చాలాకీగా వుండడం చూసి పార్టీ ఆమెకు ఇన్‌స్ట్రక్టర్ టీమ్ బాధ్యతను అప్పజెప్పింది. 2008 నుండి 2014

వరకు మిలటరీ శిక్షణ ఇచ్చే ఇన్‌స్ట్రక్టర్‌గా వుండి, ఏరియాలోని అనేక మంది మిలీషియాకు మిలటరీ శిక్షణను నేర్పించింది.

2014లో ఒడిశా విస్తరణకు వెళ్ళాలని పార్టీ ఆమె ముందు ప్రతిపాదించగా చాలా ఉత్సాహంగా స్వీకరించి వెళ్ళింది. ఒడిశాలోని బొలంగీర్-బర్గడ్-మహసముంద్ (బీ.బీ.ఎమ్.) డివిజన్ ఉద్యమ ప్రాంతంలోని బొలంగీర్ దళంలో 2015 నుండి 2018 వరకు పని చేసింది. 2018 చివర్లో మైన్‌పుర్ డివిజన్‌కు బదిలీ అయ్యి, డివిజన్ కమిటీ సభ్యురాలికి రక్షణ గార్డుగా పనిచేసింది. ఒడిషాలో పని చేసిన 5 సంవత్సరాలల్లో అనేక కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ పని చేసింది. తీవ్ర అనారోగ్యం మధ్య కూడా ప్రజలను అంటిపెట్టుకుని ఉంటూ 2019 జులై 6నాడు శతృవు దాడిలో సహచర కామ్రేడ్స్ నలుగురితో పాటుగా అనిత అమరురాలైంది. కామ్రేడ్ అనిత అమరత్వం దక్షిణ బస్తర్‌లోని కిష్టారం నుండి బీబీఎం వరకు విస్తరించిన విప్లవ ప్రజలకు చిరస్మరణీయమైనదే!

## కొడంగ్ నది సదా స్మరించే మృత్యుంజయులు కామ్రేడ్స్ రాంశిల, ప్రదీప్

కొందమాల్ జిల్లాలోని కొడంగ్ ప్రాంతంలోనున్న కొడంగ్ నదిని దాటుతుండగా, నదీ ప్రవాహంలో మునిగి 2018, సెప్టెంబర్‌లో కామ్రేడ్స్ రాంశిల, ప్రదీప్‌లు అసువులుబాసారు. వీరిద్దరూ పార్టీలో ఏరియా కమిటీ సభ్యులు, జీవితంలో జీవన సహచరులు, మరణంలోనూ అమర సహచరులుగానే నిలిచి కొడంగ్‌కు వన్నె తెచ్చిన మృత్యుంజయులు.

**కామ్రేడ్ రాంశిల** దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ భైరాంగఢ్ ఏరియా నుండి ఉద్యమంలోకి అడుగు పెట్టింది. ఆమె స్వంత ఊరు వెచ్చం. ఆ కామ్రేడ్ ఓయం కుటుంబంలో 25 సంవత్సరాల క్రితం జన్మించింది. ఇంట్లో ముద్దుగా ఆమెను పిల్చుకునే పేరు శ్యామల. చిన్నప్పటి నుండి ఉద్యమ పొత్తిళ్లలో పెరిగిన కామ్రేడ్ రాంశిల ఎదుగుతూ గ్రామ సంఘంలో చేరింది. తరతరాలుగా ఆదివాసీ ప్రజలు అనుభవించిన తెగ పెద్దల ఆధిపత్యాన్ని, సమాజంలో వున్న పితృస్వామ్యాన్ని, ప్రభుత్వ దోపిడీ, అణచివేతలను ఆమె తెలుసుకొని పోరాడడానికి సన్నద్ధమయ్యింది. 2007లో కామ్రేడ్ శ్యామల ఉద్యమంలో చేరిపోయింది. మొదట మిర్తూర్ దళంలో పని చేసింది. ఆమె తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలను గుర్తించిన పార్టీ ఆమెకు 2008లో టైలర్ బాధ్యతలనూ ఆ తర్వాత 2009లో డాక్టర్ బాధ్యతలనూ అప్పజెప్పింది. పార్టీ అప్పజెప్పిన ఏ పనులనైనా కామ్రేడ్ శ్యామల మనస్ఫూర్తిగా స్వీకరించేది. అలా టైలర్‌గా గెరిల్లా బలగాలకు యూనిఫాం డ్రెస్‌లను, డాక్టర్‌గా గెరిల్లాలకు, ప్రజలకు వైద్య సేవలను అందించింది. అన్ని సేవలలోనూ ఆమె అందరి మన్ననలను పొందింది.

పార్టీ పిలుపునందుకుని 2014లో ఆమె ఒడిశా విస్తరణ ప్రాంతానికి ఉత్సాహంగా వెళ్లింది. నూతనంగా ఏర్పడిన కందమాల్-కలహండి-బౌద్ధ్-నయాగడ (కే.కే.బీ.ఎన్) డివిజనల్ కమిటీ నాయకత్వంలోని కొడంగ్ ఏరియాలో పని చేసింది. 2016లో మహానది ప్రాంతానికి బదిలీ అయింది. కామ్రేడ్ శ్యామల మంచి ప్రజా కళాకారిణి. ఆమె తన ఆట, పాటలతో కందమాల్ బౌద్ధ్ ప్రాంతంలోని కువ్వీ ప్రజలను అలరించి వారిని సంఘటితం చేయడంలో మంచి కృషి చేసింది. తీవ్ర నిర్బంధం మధ్య ప్రజలను సంఘటితం చేస్తూ వారితో సజీవ సంబంధాలను కొనసాగించింది. ఒడియా, కువ్వీ భాషలను నేర్చుకుని పాటలు కూడా రాసింది. 2017 జూలైలో ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయ్యింది. 2017 అక్టోబర్‌లో ఆమెకు తనకు నచ్చిన కామ్రేడ్ ప్రదీప్‌తో వివాహమయ్యింది.

2017 సెప్టెంబర్‌లో జరిగిన కే.కే.బీ.ఎన్. ప్లీనంలో ఆమె ప్రతినిధిగా పాల్గొన్నది. కువ్వీ, ఒడియా ప్రజలలో మరింత మమేకం అయి ప్రజలను సంఘటితం చేయాలని మాట్లాడింది. 2018 మే 13న జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లా నాయకత్వంతో సహ అయిదుగురు కామ్రేడ్స్ అమరులైనారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ధైర్యంగా పోరాడుతూ బయటపడి, అందులో గాయపడిన కామ్రేడ్స్‌కు ఆమె వైద్యం చేసింది.

కామ్రేడ్ శ్యామల ఎప్పుడూ ఉత్సాహంగా చిరునవ్వుతో వుండేది. ఆమె ఎక్కడైనా అందరితో సునాయాసంగా ఐక్యం అయ్యేది. ఆమె తన అభిప్రాయాలు నిర్మోహమాటంగా చెప్పేది. పార్టీ పనుల రీత్యా వెళ్తూ దారిలో కొడంగ్ నది దాటుతుండగా కామ్రేడ్ రాంశిలతో సహ కామ్రేడ్ ప్రదీప్ నీట మునిగి పోయారు. వీరి అమరత్వాన్ని ప్రజలు సదా స్మరించుకుంటారు.

**కామ్రేడ్ ప్రదీప్** దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియా నుండి 2013లో ఉద్యమంలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు. ప్రదీప్ మల్లూరు గ్రామంలో పేద కుటుంబంలో జన్మించాడు. గ్రామంలో తల్లి-తండ్రులు పెట్టుకున్న పేరు విజ్జా. ప్రజలపై సల్వాజుడుం దాడి విరుచుకు పడడం వల్ల బాల్యంలో ప్రదీప్ చదువుకోలేక పోయాడు, గ్రామంలో వున్నప్పుడే పార్టీ రాజకీయాలతో, విప్లవ కార్యక్రమాలతో ప్రభావితమై 2013లో భర్తీ అయ్యాడు. భర్తీ అయ్యాక నాలుగు నెలలు గంగులూరు ఏరియా ప్రజల మధ్య పని చేశాడు. పార్టీ నిర్ణయం మేరకు 2014లో ఒడిశాలోని ఉద్యమ విస్తరణ ప్రాంతానికి సిద్ధం అయి వెళ్లాడు.

2014 నుండి 2018 సెప్టెంబర్‌లో తను అమరుడయ్యే వరకు నూతనంగా విస్తరించిన కే.కే.బీ.ఎన్. డివిజన్‌లోనే, కొడంగ్ ఏరియాలోని కువ్వీ ఆదివాసీల మధ్యనే పని చేశాడు. 2018 మేలో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. తను ఎక్కువ కాలం డివిజన్ కమిటీ సభ్యుడికి సురక్షా గార్డుగా పని చేశాడు. 2017 అక్టోబర్‌లో కామ్రేడ్ ప్రదీప్, రాంశిలలు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. వీరిద్దరూ మహానది ఏరియా కమిటీలో పని చేయాలని పార్టీ నిర్ణయించింది. వారు అందుకు ఎలాంటి శషభిషలు లేకుండా సిద్ధమయ్యారు.

2008లో ఆర్.ఎస్.ఎస్. మతోన్మాదులు కందమాల్

ప్రాంతంలో సృష్టించిన మతకల్లోలాలలో క్రైస్తవ దళితులు, కువ్వీ ఆదివాసీలపై హత్యకాండను కొనసాగించారు. ఆ మతోన్మాద దాడికి కారకుడైన లక్ష్మణానంద సరస్వతినీ ప్రజా గెరిల్లాలు ఖతం చేసిన ప్రాంతం కావడంతో పార్టీ విస్తరణను ప్రజలు స్వాగతించారు. ఆ ప్రాంతంలో కామ్రేడ్ ప్రదీప్ వారి భాషను నేర్చుకుంటూ, ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించాడు. కొడంగ్ ఏరియాలో కామ్రేడ్ ప్రదీప్ ప్రజలపై, ఏరియాపై మంచి పట్టు సాధించడం వల్ల ప్రజల్లో విప్లవోద్యమం త్వరగా నిలబడడానికి ఉపయోగపడింది.

తీవ్ర నిర్బంధం ఉన్న దళం ద్వారా ఒంటరిగా కూడా ప్రజలతో సంబంధాలు కొనసాగించడం, ప్రతిఘటన, ఇతర ముఖ్యమైన పనుల సందర్భంగా సప్లయ్‌లు సమకూర్చడంలో కామ్రేడ్ ప్రదీప్ మంచి పాత్రను పోషించాడు.

కామ్రేడ్ ప్రదీప్ సాదాసీదాగా ఉండి పార్టీ చెప్పిన పనులను ఎంతో ఉత్సాహంగా పూర్తి చేసేవాడు.

2018 సెప్టెంబర్‌లో కొడంగ్ నది దాటుతుండగా, తన సహచరి కామ్రేడ్ రాంశిల నీట మునగడం చూసి, ఆమెను రక్షించడం కొరకు వెళ్ళిన కామ్రేడ్ ప్రదీప్ కూడా మునిగి పోవడంతో ఏకకాలంలో ఇద్దరూ అమరలయ్యారు. వారి అమరత్వంతో ఎర్రబారిన కొడంగ్ వేనవేల వారి వారసులను సృష్టించుకు తీరుతుంది.

---

***(40వ పేజీ తరువాయి...)***

కొనసాగడానికి నిర్ణయం తీసుకున్నాడు.

కామ్రేడ్ సాగర్ విస్తరణ ప్రాంతానికి చేరిన తర్వాత జీ.ఆర్.బీ. (గోందియా-రాజ్‌నంద్‌గాం-బాలాగాట్) డివిజన్‌లో భాగమై తన విప్లవ సేవలు అందించాడు. పార్టీ ఆయనకు సైనిక చర్యలలో ఉన్న ఆసక్తి, అనుభవంతో ఆక్షన్ టీం బాధ్యతలు అప్పగించింది. ఆయన ఏ బాధ్యతలు చేపట్టినప్పటికి వాటికి పూర్తిగా న్యాయం చేసేవాడు. ఆయన పని విధానం, ఉత్సాహం, చొరవను అర్థం చేసుకున్న పార్టీ ఆయనను ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడిగా ప్రమోట్ చేసింది. ఆయన అనేక సైనిక చర్యలలో పాల్గొని శత్రువుతో సాహసంగా పోరాడాడు. ఆయనకు అడవి మూలికల ఔషధ గుణాలు తెలిసి ఉండడంతో వాటితో తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యం సోదర కామ్రేడ్స్‌కు, ప్రజలకు చేసేవాడు.

## పట్టణం నుండి అడవి బాట పట్టిన కామ్రేడ్ ఆజాద్

కామ్రేడ్ ఆజాద్ మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా గోండ్‌పిప్రీ తాలూకా సరండీ గ్రామంలో పేద ఆదివాసీ మెశ్రాం కుటుంబంలో 30 సంవత్సరాల క్రితం జన్మించాడు. ఆయనకు తల్లి తండ్రులు గోపాల్ అనే పేరు పెట్టుకున్నారు. కామ్రేడ్ గోపాల్ విద్యార్థి దశ నుండే పోరాట స్వభావాన్ని సంతరించుకున్నాడు. ఆయన హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న సమయంలోనే విద్యార్థులను సంఘటితం చేసి వారిని వారి సమస్యలపై కదిలించి పోరాటాలకు నాయకత్వం వహించాడు. విద్య వ్యాపారీకరణ-బ్రాహ్మణీకరణకు వ్యతిరేకంగా చంద్రపూర్ జిల్లా విద్యార్థుల పోరాటానికి నాయకత్వం వహించాడు. డిగ్రీ వరకు చదువుకున్న గోపాల్ చేపడుతున్న మిలిటెంట్ కార్యకలాపాల గురించి సమాచారం సేకరించుకున్న పోలీసులు ఆయన్ని ఓసారి అరెస్టు చేసి జైలు పాలు చేశారు. కొద్ది మాసాలలో బెయిల్‌పై జైలు నుండి విడుదలై వచ్చాక కామ్రేడ్ గోపాల్ గఢ్‌చిరోలీ-గోందియా-బాలాగాట్ జిల్లాలలో దశాబ్దాలుగా జరుగుతున్న ఆదివాసీ ప్రజా పోరాటాలలో తానూ భాగమయ్యాడు.

2010లో అడవి ఉద్యమానికి చేరిన గోపాల్ మెశ్రాం ఆజాద్ పేరుతో తన విప్లవ కార్యక్రమాలను ప్రారంభించాడు. అనతి కాలంలోనే ఆయన ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. ఆ తర్వాత గోందియా జిల్లా దరెకస్స ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎన్నికై ఆ ప్రాంత ప్రజా ఉద్యమానికి, పార్టీకి నాయకత్వం వహించాడు. ఆయన చాలా చురుకైన కామ్రేడ్. ఆ ప్రజా నాయకుడి అమరత్వం విస్తరణ ఉద్యమానికి ఎంతో నష్టాన్ని కలిగించినప్పటికీ, ఆయన అమరత్వం మూడు జిల్లాల యువతకు (చంద్రపూర్, గఢ్‌చిరోలీ, గోందియా) ఎంతో ఉద్యమ ప్రేరణను అందిస్తూ, ఆదర్శంగా నిల్చి వారి ముందు పోరుదారులు పరిచింది. ఆ ప్రజాయోధుడి విప్లవ సేవలను, అంకితభావాన్ని స్మరించుకుంటూ విప్లవ జోహార్లర్పిద్దాం.

## తొలి తరం ఉద్యమ నేత్రి కామ్రేడ్ సాగెన్‌దీ త్యాగం మహోన్నతం

1990ల నాటి విప్లవ విస్తరణోద్యమంలో భాగంగా విప్లవ కార్యకలాపాలు బాలాగాట్ జిల్లాకు విస్తరించాయి. బాలాగాట్ జిల్లా పర్సవాడ ప్రాంతం ఆనాటి విప్లవ కార్యకలాపాలకు కేంద్రంగా నిలిచింది. ఆ ప్రాంతంలో కటిక పేద ఆదివాసీ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు విప్లవోద్యమం సరైన పరిష్కార మార్గం చూపడంతో చురుకైన యువత విప్లవోద్యమంలో భాగం కావడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చింది. అలా ముందుకు వచ్చినవారిలో ఆనాటికి యవ్వన ప్రాయంలో ఉన్న కామ్రేడ్ సాగెన్ ఉద్యమంలో చేరి దాదాపు మూడు దశాబ్దాల కాలంలో అనేక ఆటుపోట్లలో కాకలు తీరింది. ఆమెతో పాటు ఉద్యమంలో చేరిన శక్తులు కాలక్రమంలో కొందరు దిగజారిపోయినా ఆమె విప్లవ సంకల్పం ఏమాత్రం సడలలేదు. ఆమె తనతో పాటు ఉద్యమంలో విప్లవ దీక్షా-దక్షతలతో పని చేస్తూ అసువులు బాసిన వీరయోధుల త్యాగాలను ప్రేరణగా తీసుకొని ఎదుగుతూ వచ్చింది. ఆమె ఈ తరం ఉద్యమ మహిళలకు ఒక సీనియర్ మహిళగా నిల్చి, సబ్-డివిజన్ మహిళా సబ్ కమిటీకి నాయకత్వం వహించింది.

కామ్రేడ్ సాగెన్‌దీ ఎంతో అణకువతో ఉండేది. రాజకీయాలు నేర్చుకోవడంలో అత్యంత శ్రద్ధాసక్తులు కనబర్చేది. తనతో ఉండేవారి విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొంటూ ప్రజలలో సాగెన్‌దీ 'ప్యారానాం'గా నిలిచిపోయింది.

# తాడ్‌బల్ల గ్రామంలో ప్రజా మిలీషియాపై భూపేష్ బఘేల్ ప్రభుత్వ హత్యాకాండను ఖండించండి!

దోపిడీ సమాజాన్ని కూల్చి సోషలిజం-కమ్యూనిజం స్థాపనే లక్ష్యంగా పోరాడుతున్న సీపీఐ (మావోయిస్టు)ను సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ఈ దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో మిలాఖతై మన పార్టీపై, విప్లవ ప్రజానీకంపై పాశవికమైన దాడిని కొనసాగిస్తున్నాయి. ఈ దాడి రోజు రోజుకు తీవ్రతరమవుతున్నది. ప్రజలు తమ భూమి, భుక్తి, విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతూ ప్రాణత్యాగాలు చేస్తున్నారు. జల్-జంగల్-జమీన్‌పై హక్కు మాదేనంటూ, ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సీపీఐ (మావోయిస్టు) సైన్యంలో చేరి, తమ రక్తాన్ని ధారపోస్తూ నెత్తుటి చరిత్రను లిఖిస్తున్నారు.

ఈ మధ్య అంటే 2018 నవంబర్ నెలలో జరిగిన ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల్లో గత 15 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగిన బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం చిత్తుగా ఓడిపోయి, భూపేష్ బఘేల్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అది అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే నిరాయుధంగా ఉన్న మిలీషియాపై క్రూర మృగంలా మీద పడి తన రక్తదాహాన్ని తీర్చుకుంది.

మాడ్ డివిజన్‌లో ఇంద్రావతి ఏరియాలో తాడ్‌బల్ల అనేది ఒక గ్రామం. ఇంద్రావతి నదికి దగ్గరలో ఉంటుంది. ప్రజా మిలీషియా ఆర్‌పీసీలను శత్రు దాడి నుండి రక్షించేందుకు రోజు వారీగా వివిధ మిలటరీ విన్యాసాలు చేస్తుంది. అందులో భాగంగానే తాడ్‌బల్ల అనే గ్రామంలో మూడు ఆర్‌పీసీ (పల్లి, కోల్‌నార్, ఊత్‌లా ఆర్‌పీసీ)లకు చెందిన మిలీషియా సభ్యులు 70 మంది సమీకరించబడ్డారు. ఈ సమాచారం శత్రువు తన నెట్‌వర్క్ ద్వారా తెలుసుకుని, పక్కా సమాచారంతో దాడి కోసం 6-2-2019న రాత్రే బలగాలు బీజాపూర్, భైరంగఢ్ క్యాంపుల నుండి ఏడు బ్యాచీలుగా బయలుదేరాయి. ఇంద్రావతి నదిని రాత్రికి రాత్రే పల్లి దగ్గర దాటాయి.

శత్రువుకు మిలీషియా డేరా ఎక్కడ ఉన్నదనేది ఖచ్చితంగా తెలియదు. కానీ మిలీషియా కామ్రేడ్స్ లొల్లి విని డేరాను పసిగట్టాడు. దాంతో శత్రువుకు ఐదు నిముషాల దగ్గరగా సివిల్‌లో వచ్చి రెక్కీ చేసుకునే అవకాశం కూడా కలిగింది. దీంతో మిలీషియా క్యాంపును శత్రు బలగాలు మూడు వైపులా చుట్టుముట్టాయి. నాలుగవ వైపు చుట్టుముట్టాల్సిన శత్రు బలగాలు కొంత ఆలశ్యం కావడం వల్ల కొంత దూరంగా ఉండిపోయాయి.

2019 ఫిబ్రవరి 7తేదీ. ఉదయం 10 గం॥లకు ఆలశ్యం చేయకుండా పోలీసు బలగాలు సర్‌ప్రైజ్‌గా నిరాయుధంగా ఉన్న మిలీషియా కామ్రేడ్స్‌పై అత్యాధునిక ఆయుధాలతో గుండ్ల వర్షం కురిపించాయి, షెల్స్ కూడా వేశాయి. ఆ సమయంలో మిలీషియా బలగాలు తమ బర్మార్లను ఒకే దగ్గర చెట్టుకు ఆనించి పెట్టుకుని ఉండినారు. దీన్ని పసిగట్టిన శత్రువు ఆ బర్మార్లకు గురిపెట్టి కాల్పులు జరపడంతో మిలీషియా కామ్రేడ్స్ వాటిని అందుకునే ప్రయత్నం చేసినప్పటికీ అందుకోవడం సాధ్యపడలేదు. దాంతో మిలీషియా కమాండర్ 'శత్రువు మనల్ని చుట్టుముట్టాడు-ఎవరి శక్తి కొలదీ వాళ్లు పరుగెత్తండి' అంటూ మళ్లీ కాషన్ ఇచ్చాడు. దీంతో మిలీషియా కామ్రేడ్స్ ఎక్కడికక్కడ శత్రు బలగాల మధ్య గండి కొట్టుకుంటూ పరుగెత్తడం ప్రారంభించారు. అక్కడ అప్పటికే ఎల్ఎంజీతో సిద్ధంగా ఉండి రాపిడ్ ఫైర్ చేయడంతో కొందరు కామ్రేడ్స్ అక్కడే ప్రాణాలు కోల్పోయారు.

మరో వైపు శత్రు రాపిడ్ ఫైరింగ్‌ను గండి కొట్టుకుంటూ వెళుతున్న మహిళా మిలీషియా కామ్రేడ్స్ దట్టమైన చెట్ల పొదల్లో ఎటూ వెళ్లలేక ఇరుక్కుపోయారు. ఆ వైపు నుండి వెళ్లడం సాధ్యపడక అక్కడే ఆగిపోయారు. పోలీసులు ఫైరింగ్ చేస్తూ ఆ చెట్ల పొదలను కూడా క్లియర్ చేస్తూ రావడంతో, అక్కడ దాక్కొని ఉన్న ఐదుగురు మహిళా కామ్రేడ్స్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు.

ఫైరింగ్ శబ్దాలు విన్న ప్రజలు వెంటనే ఆ స్థలానికి చేరుకున్నారు. మా బిడ్డలను కాల్చవద్దు అంటూ ఎంత బతిమలాడినా ఆ పోలీసు కుక్కలు కనీసంగానైనా కనికరించకపోగా, గాయపడిన స్థితిలో ప్రాణాలతో పట్టుకున్న మహిళా మిలీషియా కామ్రేడ్స్‌ను ప్రజలంతా చూస్తుండగానే వారిని ఎంతగా చిత్రహింసలకు గురిచేసారంటే మాటలతో వర్ణించడం సాధ్యం కాదు. చివరికి వారిని దారుణంగా హత్య చేసారు.

శత్రువు జరిపిన ఈ పాశవికమైన దాడిలో 10 మంది కామ్రేడ్స్ (ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులు) తమ నులివెచ్చని రక్తాన్ని ధారపోశారు. అమరులైన వారిలో ఊత్‌లా ఆర్‌పీసీ నుండి ఊత్‌లా గ్రామానికి చెందిన కామ్రేడ్స్ ఓయం సుక్కు (22), బార్సా సుక్కాల్ (20), బార్సా పరమేష్ (20), ఓయం సుద్రీ (20), మాడివీ విజ్జో (20), ఓయం రాజు (21), కుడియం శంకర్ (21), ఛోటాపల్లి ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ పార్సా రెయ్యో (15), కోల్‌నార్ ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ ఆర్కీ శాంతి (12), తాడ్‌బల్ల ఆర్‌పీసీ నుండి కామ్రేడ్ ఓడి పాలో (21) ఉన్నారు. శత్రు బలగాల చుట్టివేతను అత్యంత ధైర్యసాహసాలతో గండి కొట్టుకుంటూ 60 మంది కామ్రేడ్స్ క్షేమంగా బయటపడ్డారు. ఇందులో ఒక మహిళా కామ్రేడ్, ఒక పురుష కామ్రేడ్ గాయపడ్డారు.

## మిలీషియా శవాలను స్వాధీనం చేసుకుని అంతిమ వీడ్కోలు పలికిన విప్లవ ప్రజలు

క్రాంతికారీ జనతన సర్కార్లను కాపాడే క్రమంలో తమ నులివెచ్చని రక్తాన్ని చిందించిన అమరుల శవాల కోసం వెంటనే వందలాది మంది ప్రజలు పోలీసుల వెంటపడ్డారు. కానీ పోలీసులు శవాల కోసం వెళ్లిన మహిళలను తుపాకీ బట్‌లతో కొట్టారు. ఫైరింగ్ చేస్తామంటూ భయపెట్టారు, కానీ శవాలను మాత్రం ఇవ్వలేదు. దీంతో మూడువేల మంది ప్రజలు సమీకరించబడి, తమ బిడ్డల భౌతిక కాయాల కోసం భైరంగఢ్ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. అక్కడ కూడా పోలీస్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. దాంతో బీజాపూర్-గీదం రోడ్డుపై ప్రజలు రాస్తారోకో చేశారు. రాస్తారోకో చేస్తున్న ప్రజలను పోలీసులు వాహనాలలో బీజాపూర్‌కు తీసుకెళ్లారు. అయినప్పటికీ ప్రజలు దృఢంగా నిలబడి అమరుల భౌతిక కాయాలను పోలీసుల నుంచి స్వాధీనం చేసుకొని తమ ప్రాంతానికి తీసుకుని వచ్చి, విప్లవ సాంప్రదాయాలతో అమరుల భౌతిక కాయాలకు అంత్యక్రియలు జరిపారు. మీ రక్తం ఎప్పటికీ వృధాకాదు, మీ నెత్తుటి అప్పును తీర్చుకుంటాం, మీ ఆశయాలను కొనసాగిస్తాం. ఆర్‌పీసీలను కాపాడుకుంటాం, నవ సమాజ నిర్మాణం కోసం ముందుకు కొనసాగుతాం అంటూ నినదిస్తూ ప్రజలు, మిలీషియా అమరులకు అంతిమ వీడ్కోలు పలికారు.

దండకారణ్యంలో ప్రభుత్వ సాయుధ బలగాలు గ్రామాలను కాల్చివేయడం, ప్రజలను చంపడం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం కొత్త విషయమేమి కాదు. ముఖ్యంగా 2005 నుండి ఈ దాడుల నుండి తమను తాము కాపాడుకోవడం కోసం ప్రజలు పోరాడుతూ బతుకుతున్నట్టుగా ఉంది పరిస్థితి. రాజ్యాంగపరంగా ప్రజల మాన ప్రాణాలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిది కాని ఇపుడు వాటిని ప్రభుత్వం నుండి రక్షించుకోవాల్సిన ఆగత్యం ఏర్పడింది. ముఖ్యంగా బీజాపూర్ జిల్లాలో పురుడు పోసుకున్న సల్వాజుడుం దాడులను ఎదిరిస్తూ తమను తాము రక్షించుకుంటున్నారు. ఇపుడు ఆపరేషన్ సమాధాన్ నుంచి రక్షించుకుంటున్నారు.

ఈ మధ్యకాలంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారిలో 90 శాతంకు పైగా ఆదివాసీలే ఉన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ హత్యాకాండ కొనసాగిస్తోంది. ఫలితంగా మావోయిస్టు ఉద్యమాల్ని ఒంటరి చేయొచ్చని ఆశిస్తుంది. భయభ్రాంతులకు గురిచేస్తే ఆ ఉద్యమం వెంట నడవరని కూడా ఆశిస్తుంది. మరోవైపు మైదాన ప్రాంతంలో ప్రగతిశీల మేధావుల గొంతులు నొక్కుతుంది. అర్బన్ నక్సలైట్లని ముద్రవేసి ప్రజాతంత్ర మేధావులను జైల్లో నిర్బంధిస్తుంది. ఈ రెండు పార్శ్వాల నిర్బంధాన్ని ఎదుర్కోవాలంటే ఆపరేషన్ సమాధాన్ మారణహోమాన్ని నిలవరించాలి. ఇది మావోయిస్టు ఉద్యమాలపై కొనసాగుతున్న అణచివేతను వ్యతిరేకించాలి, అడవిలో నివసిస్తున్న అమాయకపు ఆదివాసీ ప్రజలపై, మహిళలపై, పిల్లలపై జరుగుతున్న హింసా, హత్యాకాండను వ్యతిరేకించాలి. దేశాన్ని కొల్లగొడుతున్న దేశాన్ని కొల్లగొడుతున్న స్వదేశీ, విదేశీ శక్తుల దోపిడిని వ్యతిరేకించాలి. ప్రకృతి, పర్యావరణాన్ని, సంస్కృతిని కాపాడుకోవడం కోసం ఆదివాసీలు చేస్తున్న పోరాటాలకు మైదాన ప్రాంత ప్రజలు, ఆలోచనాపరులు అండగా నిలవాల్సిన బాధ్యత ఉంది. ○

---

*(..........19వ పేజీ తరువాయి)*

ప్రజలు క్రమంగా గ్రహిస్తున్నారు. ఆదివాసీ ప్రజలకు అడవిపై సర్వాధికారాలు అన్నది గజ మహారాజు చూపుడు దంతాల లాంటివేనన్నది ఇక వారికిపుడు సులువుగానే బోధపడుతోంది.

తునికాకు వ్యాపారం కన్నా వెదురు వ్యాపారం మరీ నష్టదాయకంగా పరిమించింది. 2014 వరకు జిల్లాలోని అధిక శాతం వెదురును బల్లార్‌పూర్ పేపర్ మిల్లు యాజమాన్యమే (బిల్ట్)తరలించుకుపోయేది. కానీ పెసా చట్టం అమలులో భాగంగా ఆదివాసీ గ్రామాలలో గ్రామసభలు ఆవిర్భవించాక అడవిపై యాజమాన్య హక్కులు లభించిన గ్రామసభలు వెదురు వనాల వ్యాపారాన్ని స్వంతంగా చేపట్టాయి. గతంలో అటవీ శాఖవారు నిర్వహించిన వ్యాపారం ఇపుడు గ్రామసభల కైవశం కావడంతో వారి ఆదాయం అక్రమ సంపాదన దెబ్బతిని అడుగడుగునా గ్రామసభల వ్యాపారానికి అడ్డు తగులుతున్నారు. ఫలితంగా గత ఐదేళ్లుగా జిల్లాలోని అనేక గ్రామసభలలో వెదురు పనులు నిలిచిపోయి ప్రజలు నానా ఇక్కట్ల పాలవుతున్నారు.

2016లో జిల్లాలో జరిగిన దేశ వ్యాప్త గ్రామసభల సమ్మేళనంలో వారు తమ జీవన్మరణ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినట్టు అడవులలోని ఆదివాసులకు పంటలతో సమానమైన అడవి పంట వెదురుకు ప్రభుత్వం కనీస మద్దత్తు ధర ప్రకటించాలనీ కోరారు. వెదురు వ్యాపారస్థులు వేలం పాటలకు రాని పక్షంలో ప్రభుత్వమే గ్రామసభల నుండి వెదురును కొనుగోలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆదివాసీ సొసైటీల ద్వారా కనీస మద్దతు ధరపై ధాన్యసేకరణ చేస్తున్న విధంగా వెదురు కొనుగోళ్లు ప్రభుత్వమే చేపట్టాలని మూడేళ్ల క్రితమే గ్రామసభలు డిమాండ్ చేసినా ప్రభుత్వం ఖాతర్ చేయకపోవడంతో ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు. బల్లార్‌పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం అనేక విషమ షరతులు విధిస్తూ కేవలం రూ. 4,500కు టన్ను వెదురు అమ్మాలనీ గ్రామసభలను ఒత్తిడి చేస్తోంది. కానీ జిల్లా అడవుల నుండి దాదాపు 200 కీ.మీ. పైగా దూరంలో నున్న పేపర్ మిల్లు గేట్ల వరకు గ్రామసభల వారే వెదురు చేరవేయడం అంటే వాటికి కనీస శ్రమశక్తి రేటైన గిట్టుబాటు కాదని గ్రామసభలు నిరాకరించాయి. ఇలాంటి స్థితిలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడం అంటే అది ఎవరి పక్షమో విడిగా చెప్పాల్సిన పనే లేదు. త్వరలో రానున్న మహారాష్ట్ర విధాన సభ ఎన్నికలకు జిల్లాలోని గ్రామసభలు తమ కనీస డిమాండ్లు తక్షణం నెరవేరని

*(మిగతా 48వ పేజీలో.....)*

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

తేది: 6 మార్చ్, 2019

## విప్లవ ద్రోహులు సుధాకర్, మాధవీల లొంగుబాటును ఖండిస్తున్నాం

## విప్లవ ద్రోహులను ప్రజలు శిక్షించి తీరుతారు

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉండిన సుధాకర్ (షట్వాజీ) మరియు ఆయన సహచరి రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాధవి తెలంగాణ డీ.జీ.పీ. ముందు ఫిబ్రవరి రెండవ వారంలో లొంగిపోయారు. విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం పని చేసి అంచెలంచెలుగా ఉన్నత, అత్యున్నత స్థాయికి ఎదిగి అనేక బాధ్యతలు నిర్వహించిన ఆ జంట వేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితులను, శత్రువు దాడులను అర్థం చేసుకోవటంలో ఘోరంగా విఫలమై, రాజకీయంగా పతనమై, విప్లవ ప్రజలకు ద్రోహం చేసి శత్రువు ముందు మోకరిల్లారు. భారత నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై తమ నులివెచ్చని నెత్తురును ధారపోసి అమరులైన మృతవీరుల ఆశయాల పరిపూర్తికై దృఢంగా పోరాడాల్సిన నాయకత్వ శక్తులు హీనాతిహీనంగా దిగజారిపోవడాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. వారిద్దరి ప్రాథమిక పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ వారిని విప్లవ ద్రోహులుగా ప్రకటిస్తున్నది.

విప్లవోద్యమం నల్లేరు మీద బండిలా సాగేది గాదు. విప్లవోద్యమం అనేక ఆటు-పోటులతో పురోగమిస్తూ అంతిమంగా విజయం సాధిస్తుంది. ఈ క్రమంలో అనన్య సామాన్యమైన త్యాగాలు చేయాల్సి ఉంటుంది. వర్గ పోరాటంలో శత్రువు నిర్ధాక్షిణ్యంగా ఉద్యమ నిర్మూలనకు పూనుకుంటాడు. విజయ గర్వంతో ఉప్పొంగిపోకుండా, ఓటములలో సమస్తం కోల్పోయిన చందంగా నిరాశపడకుండా మరింత పట్టుదలగా విప్లవ విజయానికై విధిగా ప్రతి విప్లవకారుడు పోరాడాలి. ఈ అతి ప్రాథమిక అవగాహననుండి దూరమైన వారు ఎంతటి ఉన్నత స్థానంలోనున్నా తుదివరకూ నిలబడలేరు. జీవితంలో కొద్ది మాసాలు, సంవత్సరాలు విప్లవాశయాల సాధనకై అంకితమై పని చేయడం అంత కష్టమైనదేమి కాదు కానీ నమ్మిన ఆశయాల కోసం జీవితాంతం పోరాడడమే విప్లవకర కమ్యూనిస్టులకు కావల్సింది. ఇందుకు సిద్ధంగా లేని సుధాకర్ జంట పార్టీ నాయకత్వంలో ఐక్యత లేదనీ, పార్టీలో అనేక సమస్యలున్నాయనీ, తమ అనారోగ్యం మూలంగా లొంగిపోతున్నా మనీ పత్రికాముఖంగా ప్రకటించడంలో వింతేమి లేదు. శత్రువు ముందు మోకరిల్లిన సాధారణ పార్టీ సభ్యుడి నుండి అన్ని స్థాయిల వారితో శత్రువు పలికిస్తున్న పలుకులే ఇవి.

ఏ విప్లవ పార్టీ అయినప్పటికీ అది శుద్ధమైనదేమి కాదు. పార్టీలో భిన్నభిప్రాయాలుండడం పార్టీ అభివృద్ధికి చిహ్నం. పార్టీలో అన్యవర్గ ధోరణులు ప్రబలడం వర్గ సమాజ సంక్షోభ ప్రతిబింబం. మా పార్టీలో ఇవేవీ ఇవాళ వచ్చినవి కావు. ఉన్నఫళంగా వాటిని ఏ శక్తీ మార్చలేదనీ సుధాకర్ జంటకు తెలియనిది గాదు. పార్టీ నిరంతరం దిద్దుబాటు ఉద్యమాలను కొనసాగిస్తూ తన కేడర్లను సైద్ధాంతికంగా, రాజకీయంగా సరిదిద్దుకుంటూ విప్లవోద్యమాన్ని పురోగమింప చేస్తుందన్న వాస్తవంలో ఆ జంట నిన్నటివరకు భాగమై, ఈ రోజు అందుకు భిన్నంగా మాట్లాడడమంటేనే వారి రాజకీయపతనాన్ని వారే ప్రజలకు ఎరుక చేసుకోవడం తప్ప అది మరేమి గాదు.

సమాజంలో సంక్షోభం తీవ్రతరమవుతున్న పరిస్థితులలో శత్రువు ప్రధానంగా రహస్య పార్టీ నాయకత్వాన్ని అంతమొందించడానికి తీవ్రంగా పూనుకుంటాడు. విప్లవోద్యమనికి సహకరించే సమస్త శక్తులను చతురోపాయాల ద్వారా నిర్వీర్యం చేయడానికి తలపడతాడు. యావత్ విప్లవ నిర్మాణాలను ధ్వంసం చేయడానికి భీషణమైన సైనిక దాడులకు దిగుతాడు. దోపిడీ పాలక వర్గాలు తమ సంక్షోభం నుండి గట్టెక్కడానికి ముందు దేశంలోని విప్లవ శక్తులను, విప్లవోద్యమాన్ని మట్టుబెట్టడానికి బరితెగించి సిద్ధపడుతాయి. తాను రాసుకున్న రాజ్యాంగం, ఆ రాజ్యాంగంలో దేశ పౌరుల కోసం వారు రూపొందించిన ప్రాథమిక హక్కులు, ప్రజలు తమ వీరోచిత పోరాటాల ద్వారా సాధించుకున్న సంస్కరణలు మొదలైన వాటినన్నిటినీ తుంగలో తొక్కి ప్రధానంగా సైనిక అణచివేతకు పూనుకుంటాయనీ నిన్నటి సల్వాజుడుం, సేంద్ర, గ్రీన్‌హంట్‌లు, నేటి సమాధాన్ దాడులు తెలియచేస్తున్నవి. వీటన్నింటినీ చారిత్రకంగా, గతి తార్కికంగా అర్థం చేసుకుని అందుకు తగిన విధంగా తమని తాము మలుచుకోలేని వాళ్లు

ఎంతటి స్థాయిలో ఉన్నప్పటికీ అంతిమంగా పతనం కాకతప్పదనీ సుధాకర్ జంట మరోసారి స్పష్టం చేసింది.

సుధాకర్ దాదాపు గత నాలుగు దశాబ్దాలుగా విప్లవోద్యమంలో పని చేస్తూ సాధారణ పార్టీ సభ్యుడి నుండి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగివచ్చాడు. మాధవి దాదాపు మూడు దశాబ్దాల కాలంగా పని చేస్తూ రాష్ట్ర స్థాయికి ఎదిగింది. వారిలో కొన్ని తీవ్రమైన బలహీనతలే ఉన్నప్పటికీ ప్రధానంగా వర్గపోరాటంలో విప్లవ రాజకీయాలను అంటి పెట్టుకొని ఉండి ప్రజల కోసం పని చేస్తూ ఉండడంతో వారు ఉన్నత స్థాయిలోకి ఎదిగి వచ్చారు. వారు తెలంగాణ క్యాడర్ అయినప్పటికీ ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ వారిని 2001లో దండకారణ్యం బదిలీ చేసింది. అక్కడ 2014 మధ్య వరకు పని చేశారు. తరువరి ఆ జంటను పార్టీ బిహార్-ఝార్ఖండ్‌కు పంపింది. అక్కడ వాళ్లు దాదాపు నాలుగున్నరేళ్లు పని చేశారు. ఆ జంట సుదీర్ఘకాలంగా విప్లవోద్యమంలో పని చేస్తూ వివిధ స్థాయిలలో పార్టీ బాధ్యతలు నిర్వహించినప్పటికీ కుటుంబ సంబంధాలను నసేమిరా వదలుకోలేకపోయారు. పోలీసులతో సంబంధాలలో ఉంటూ తమ వ్యాపారాన్ని కొనసాగించే దుష్ట శక్తులకు దూరంగా ఉండాలని పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని అతడు త్రికరణశుద్ధిగా ఏ ఒక్కనాడూ అమలు చేయలేదు. ఆయన సంబంధాలు కొనసాగిస్తున్న అవాంఛనీయ, దుష్ట శక్తులను 2017 అగస్టు చివర ఝార్కండ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు సుధాకర్ సంబంధంలో పోలీసులకు అనేక విషయాలు వెల్లడించారు. వాటన్నింటిపై నిజాయితీగా తన కమిటీకి కనీస నివేదికనైనా ఇవ్వకుండా, సుధాకర్ వారి సంబంధాలను కొనసాగిస్తూనే అంతిమంగా శతృవు ముందు లొంగిపోయాడు. సుధాకర్ పెద్ద మొత్తంలో పార్టీ నిధులను కాజేశాడు. శతృవు ముందు లొంగిపోయిన సుధాకర్ అత్యంత రహస్య సమాచారాన్ని శతృవుకు అందచేశాడు. యావత్ విప్లవోద్యమ కార్యక్రమాల గురించి, నాయకత్వ ఆనుపానుల గురించి, పార్టీ వర్తమాన స్థితిని సుధాకర్ శతృవుకు తెలిపి నిన్నటి జినుగు నర్సింహారెడ్డి (జంపన్న) ని మించిన ద్రోహానికి తలపడి పార్టీకి నష్టాన్ని కలిగించాడు. ఆ ద్రోహుల జంటను విప్లవోద్యమం ఎన్నటికీ క్షమించదు.

విప్లవోద్యమంలో ఉన్నత స్థాయికి ఎదిగిన మాధవికి పార్టీలో మహిళలకు లభించే గౌరవ మర్యాదల గురించి తెలయనిది కాదు. పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టే పితృస్వామ్య వ్యతిరేక కెంపెయిన్‌ల అనుభవం ఎంతో గడించిన మహిళ మాధవి! నేడు మన దేశంలోని మహిళలు అత్యంత విశ్వాసం, భరోసాతో తమ విముక్తి కోసం మా పార్టీ నాయకత్వంలోని అనేక విప్లవ మహిళా సంఘాలలో సంఘటితమై పోరాడుతున్నారు. మా పీ.ఎల్.జీ.ఏ.లో పురుషులతో సమానంగా మహిళలు సాయుధంగా ఉన్నారు. ఈ విషయం భారత పాలక వర్గాలకు, వారి పోలీసులకు బాగా తెలుసు. అందుకే మహిళలలో మా పార్టీని అప్రతిష్టపాలు చేసే దుష్ట తలంపుతోనే పోలీసులు మాధవితో అవాకులూ చవాకులూ చిలుక పలుకుల్లా పలికించారు. కానీ శతృవుకు లొంగిపోయిన మహిళ చెప్పే విషయాలు నిజంగా ఏ పీడిత, పోరాట మహిళ విశ్వసించదు. పార్టీలో ఏ మహిళా ఎదుర్కొనని సమస్యలను ఒక మహిళగా ఆమె విలేకర్ల ముందు ప్రస్తావించడం ఆమె పరమ నైతిక పతనానికి నిదర్శనం. బ్రాహ్మణీయ పితృస్వామ్య సమాజ సంకెళ్ల నుండి బయటపడడానికి పోరు మహిళలు చేస్తున్న పోరాటాల గురించి పతనమైన మాధవి లాంటి వారికి అర్థం కావు.

శతృవు గత కొద్ది కాలంగా తీవ్రం చేసిన సమాధాన్ దాడులతో భీతిల్లిన సుధాకర్ జంట వస్తుగత పరిస్థితులను విప్లవ రాజకీయల వెలుగులో అర్థం చేసుకోలేక, అంతిమంగా బలహీనతల సుడిగుండంలో మునిగి, శతృవు ముందు మోకరిల్లడాన్ని యావత్ పార్టీ క్యాడర్లు, విప్లవ ప్రజలు అసహ్యించుకోవాలి. శతృవును సంతోషపరిచే సుధాకర్ జంట హీన చర్యలు విప్లవ క్యాంపుకు నెగటివ్ గుణపాఠాలుగా ఉండిపోతాయి. భారత విప్లవోద్యమానికి తలమానికంగా నిలిచిన తెలంగాణ వీరప్రజానీకం, ఆ విప్లవ ద్రోహులను చరిత్ర పెంటకుప్పపైకి విసిరేసి గట్టిగా బుద్ధి చెప్పాలి.

**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

---

***(..........46వ పేజీ తరువాయి)***

నేపథ్యంలో బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నాయి.

1. తునికి ఆకు కోత కూలీ ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రతి వంద కట్టలకు రూ.600/- ప్రకటించాలి.

2. వ్యాపారస్థులు రాని పక్షంలో వెదురు కొనుగోళ్లు ప్రభుత్వమే చేపట్టాలి. 2 మీటర్ల 20 ముక్కల ప్రతి బిండల్‌కు రూ.130 చెల్లించాలి. 25 ఫూట్ల పొడవు వెదురు ఒక్కంటికి రూ.75/- చెల్లించాలి.

3. గ్రామసభలను నిర్వీర్య పరిచే దుష్టత్రయం కుట్రల నుండి గవర్నర్ రాజ్యాంగం పేర్కొన్నట్లు ఆదివాసుల సంరక్షకుని పాత్ర నిజాయితీగా పోషించాలి.

*(ఆఖరి పేజీ తరువాయి...)*

ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ కమ్యూనిస్టు మహిళా కామ్రేడ్ కొండపల్లి కోటేశ్వరమ్మ వృద్ధాప్యంతో కన్నుమూసారు. శత్రు బలగాలు సాగించిన హత్యాకాండలలో అమరులైన మరి కొంత మంది కామ్రేడ్స్ వివరాలు అందవలసి ఉంది.

ఈ కామ్రేడ్స్‌లో ఎన్‌కౌంటర్‌లలో 40 మంది, శత్రు ఆంబుష్‌లలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. బూటకపు

ఎన్‌కౌంటర్లలో 64 మంది (వీరిలో 15 మంది మహిళా కామ్రేడ్స్‌ను పోలీసు బలగాలు పట్టుకొని అత్యాచారం చేసి క్రూరంగా హత్య చేసాయి), పీఎల్‌జీఏ నిర్వహించిన వీరోచిత దాడుల్లో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు అనారోగ్యంతో ఆరుగురు కామ్రేడ్స్, వృద్ధాప్యంతో ఒకరు, దుర్ఘటనలలో నలుగురు తమ ప్రాణాలు కోల్పోయారు.

సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా, సాంస్కృతికంగా శత్రువు మన మీద అనునిత్యం జరుపుతున్న దాడి ఫలితంగానే ప్రధానంగా మనకు ఈ నష్టాలు జరిగాయి. మనం ఎదుర్కొంటున్న భీషణ శత్రు దాడి ఒక పెద్ద సవాలు. గతంలో సల్వాజుడుం, సేంద్ర పేరుతోను, ఆ తరువాత ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతోనూ కొనసాగిన అణచివేత క్యాంపెయిన్‌లు ఇప్పుడు 'సమాధాన్' పేరుతో కొనసాగుతున్నాయి. ఈ అన్ని పథకాల సారాంశమూ ఒకటే. అయితే ప్రతి అణచివేత క్యాంపెయిన్‌లోనూ గత పథకాల అనుభవాలతో, మన బలహీనతలను అధ్యయనం చేస్తూ నూతన అంశాలు జోడిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సాధారణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ, అందులో భాగంగా ఉన్న భారతదేశ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలూ కలిసి తమ దోపిడీ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం తమ అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం, ప్రజలకు నాయకత్వం వహిస్తూ వారి దోపిడీకి అడ్డుపడుతున్న మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడం కోసం రకరకాలుగా, వేగంగా తమ ఎత్తుగడలను మార్చుకుంటూ ఉద్యమంపై, ప్రజలపై బహుముఖ ఫాసిస్టు దాడులు చేస్తున్నాయి.

సామ్రాజ్యవాద ఎల్ఐసి అణచివేత విధానంతో అమలు జరుపుతున్న వివిధ విప్లవ ప్రతీఘాతుక కార్యక్రమాలలో భాగంగా ఈ సంవత్సర కాలంలో కార్పెట్ సెక్యూరిటీని మరింత విస్తరించి బలోపేతం చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలలో వేలాది పోలీసు, అర్ధసైనిక బలగాలను అదనంగా మోహరించారు. గస్తీ పెరిగింది. ఉద్యమ ప్రాంతాలంతటా నిత్యం చేపడుతున్న కార్డన్ ఎండ్ సెర్చ్ ఆపరేషన్‌లలో ప్రజలు తమ ఉత్పత్తి, రోజువారీ పనులు చేసుకోలేని పరిస్థితి కల్పిస్తున్నారు. లాంగ్ రేంజ్ పాట్రోలింగ్ నిర్వహిస్తూ రోజుల తరబడి అడవిలో ఉంటూ మోర్టార్లతో, రాకెట్ లాంఛర్లతో విచ్చలవిడిగా షెల్లింగు చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలను పోలీసు శిబిరాలుగా మార్చి ప్రజల జీవితాలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు. ప్రజలపై సామూహిక హత్యలు చేస్తున్నారు. శత్రువు సమాచార ఆధారిత దాడులు తీవ్రతరం చేయడంతో, కార్పెట్ సెక్యూరిటీ బలపడడంతో దళాలు ప్రజల వద్దకు వెళ్లడానికి పరిమితులు ఏర్పడుతున్నాయి. దోపిడీ వర్గాలు పెద్ద ఎత్తున మారణకాండలు సృష్టించి ప్రజలను ఉద్యమానికి దూరం చేయాలని ప్రయత్నిస్తున్నాయి.

బీహార్-ఝార్ఖండ్‌లో ఉత్తర్ జోన్‌లో డుమరీ నాలా, దండకారణ్యంలో దక్షిణ బస్తర్ డివిజన్‌లో నుల్కతోంగ్, పశ్చిమ బస్తర్‌లో మద్దుం, మాడ్ డివిజన్‌లో తాడిబల్ల ఘటనలు ఇటువంటివే. అలాగే మాడ్ డివిజన్‌లోనే గుమియావేడ, దక్షిణ బస్తర్‌లో చాకిలేర్, గొమ్ముగూడెం-భీమారం, దర్భ డివిజన్‌లో కువ్వకొండ, దక్షిణ గఢ్‌చిరోలిలో గుండ్రువాయి, ఏఓబీలో మల్కన్‌గిరిలో పప్పులూరు, విశాఖలో బురదమామిడి వంటి ఘటనలలో దోపిడీ ప్రభుత్వ కిరాయి బలగాలు విప్లవకారులను, ప్రజలనూ ఊచకోత కోశాయి.

మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవడంలో, రూపొందించుకున్న పద్ధతులను అమలు చేయని మూలంగా నష్టపోతున్నాం. ఈ సంవత్సర కాలంలో మన కామ్రేడ్స్ అమరులయిన సందర్భాలు చూస్తే ఈ విషయాలు స్పష్టమవుతున్నాయి. కింది నుంచి పై స్థాయి వరకు నాయకత్వాన్ని నిర్మూలించడం, కౌంటర్ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం, మనకు బలమైన గ్రామాలలో ద్రోహులను తయారు చేయడం, మన బలహీనతలను కనిపెట్టి దెబ్బతీయడం, విప్లవకారులను, ప్రజలను ఊచకోత కోసి భయోత్పాతాలు సృష్టించడం మొదలయిన శత్రు ఎత్తుగడలు ఈ సంవత్సర కాల అమరత్వపు ఘటనలలో కనిపిస్తాయి.

గెరిల్లా యుద్ధం ప్రజాపునాదిపై ఆధారపడి నడుస్తుందని మావో బోధించారు. శత్రు కదలికల గురించి ప్రజలు ఎప్పటికప్పుడు గెరిల్లాలకు తెలియజేస్తూంటారు. అలా అని మనం గెరిల్లా యుద్ధ నియమాలను పక్కన పెట్టరాదు. పరిస్థితిని సరిగా అంచనా వేసుకోకపోతే నష్టపోతాం. అందువల్ల నిరంతరం పరిస్థితులను విశ్లేషించాలి, ప్రతి విషయాన్ని విమర్శనాత్మకంగా చూడాలి.

ఇన్‌ఫార్మర్ వ్యవస్థ శత్రు అణచివేత వ్యూహంలో ఒక భాగం. గ్రామస్తులను, ఉద్యోగస్తులను, విద్యార్థులను మోసపూరితంగా లొంగదీసుకుని గానీ బలవంతంగా గానీ కోట్లాది రూపాయలు వెదజల్లి ఆశలు చూపి ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకుని వారి ద్వారా ఉద్యమానికి సంబంధించిన సమాచారం తెలుసుకుంటున్నారు. ఆ విషయాలు దృష్టికి వచ్చినప్పుడు వారిని ప్రజల ముందు పెడుతున్నాం. ప్రజాపంథాను అనుసరించి వారిపై చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పట్ల నిరంతర జాగరూకత ఉండకపోతే మనం నష్టపోతాం. కనుక ఇన్‌ఫార్మర్ల

సమస్యను నివారించడానికి ప్రజల్లో రాజకీయ కృషిని పెంచాలి.

అమరులయిన వారిలో కొందరు కామ్రేడ్స్ యుద్ధరంగంలో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ ఆదర్శనీయమైన నమూనాలు నెలకొల్పారు. మరి కొందరు శత్రు తీవ్ర చిత్రహింసలకు లొంగకుండా దృఢసంకల్పంతో పార్టీ రహస్యాలను కాపాడుతూ తమ ప్రాణాలు అర్పించారు. వారు లేని లోటును వెంటనే తీర్చలేం. అయితే ప్రతి అమరత్వం మనలో మరింత వర్గ కసి రేపుతుంది. మన బాధ్యతలను మరింతగా పెంచుతుంది. మనకు గుణపాఠం అందిస్తుంది. అమరుల ఆశయ సాధన కోసం ధైర్య సాహసాలతో, త్యాగనిరతితో అనవసర నష్టాలు నివారించుకుంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని ప్రతిన బూనుదాం.

ఉద్యమం ముందుకు సాగే క్రమంలో ఎందరో నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ ప్రాణాలిస్తున్నారు. అయితే అమరులవుతున్న వారిని చూసి ప్రజలకు, ప్రజా కార్యకర్తలకూ భయం వేయదు. శత్రువు మీద ద్వేషం పెరుగుతుంది. ద్విగుణీకృత విప్లవ చైతన్యంతో, ధైర్యంతో నూతన తరాలవారు యుద్ధరంగంలోకి వస్తారు. శత్రువు వ్యూహరీత్యా బలహీనుడే కానీ ఎత్తుగడల రీత్యా బలవంతుడు. అందువల్ల మనం పరిస్థితులను బట్టి ఎత్తుగడలను, మన పని విధానాన్ని త్వరగా మార్చుకుంటూ పోవాలి. ఈ సంవత్సర కాల అమరత్వాలలో మనం సమీక్షించుకున్న మన బలహీనతల నుంచి బయటపడడమే ఆ అమరులకు మనం ఇవ్వగలిగే నిజమైన నివాళి.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులు, ప్రజలకూ మధ్య, పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. అమెరికా చైనా దేశాల మధ్య సామ్రాజ్యవాద వ్యాపార యుద్ధం రోజు రోజుకూ రూపాలు మార్చుకుంటూ తీవ్రతరం అవుతున్నది. సామ్రాజ్యవాద దేశాలు ఒకటి మరో దేశం మీద దిగుమతి సుంకాలు పెంచుతూ దేనికది ప్రపంచ మార్కెట్‌ను కబళించాలని, ప్రపంచాధిపత్యంలోకి రావాలని చూస్తున్నాయి. అమెరికా తన కూటమిని బలపరుచుకుంటూ చమురు మొదలయిన ముడి పదార్థాల కోసం సిరియా వంటి దేశాలపై యుద్ధం చేస్తుంటే చైనా యూరప్‌తో మైత్రి కోసం ప్రయత్నిస్తున్నది. ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలపై చైనా తన నియంత్రణను పెంచుకుంటున్నది. యూరప్‌లో సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు పెరుగుతుండగా మరో పక్క యూరప్ అంతటా కార్మిక పోరాటాలు ఒక బలమైన ధోరణిగా ముందుకు వచ్చాయి. ఫ్రాన్స్‌లో 'యెల్లో వెస్ట్స్ మూవ్‌మెంట్' (పసుపు చొక్కాల ఉద్యమం)గా పేరు పొందిన ప్రజల ఆందోళన, బెల్జియం, బ్రిటన్ మొదలయిన దేశాలలో రైల్వే కార్మికులు, వివిధ పారిశ్రామిక రంగాల కార్మికులూ తమ పని పరిస్థితులలో మార్పు కోరుతూ, వేతనాల పెంపుదల కోరుతూ, ఆధునీకరణ కారణంగా తొలగింపునకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలు యూరప్ దేశాల పాలకవర్గాలను కుదిపివేస్తున్నాయి. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు చేస్తున్న విముక్తి పోరాటం కొనసాగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఈ పోరాటాలకు సంఘీభావం పెరుగుతున్నది.

మన దేశ దోపిడీ పాలక వర్గాల మధ్య కుమ్ములాటలు పెరుగుతున్నాయని ఇటీవలి ఎన్నికలు తెలియజేస్తున్నాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చే భారత దళారీ పాలక వర్గాలు దేశ సంపదను, ప్రజల శ్రమనూ దోచుకుంటున్నాయి. దేశంలో ఆర్థిక మాంద్యం, పేదరికం, నిరుద్యోగం పెరుగుతున్నాయి. ప్రజల కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నాయి.

**కామ్రేడ్స్,**

రానున్న కాలంలో సామ్రాజ్యవాద సంక్షోభం కారణంగా అంతర్జాతీయ, దేశీయ మౌలిక వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఫాసిజం మరింత బలపడే ధోరణులు కనిపిస్తున్నాయి. ఇటీవల దేశంలో 17వ లోక్‌సభకు ప్రహసనంగా జరిగిన బూటకపు ఎన్నికల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు భాజపా తిరిగి అధికారంలోకి వచ్చింది. అమెరికా, ఇజ్రాయిల్ వంటి దేశాలలో, ఆస్ట్రేలియాలో, అలాగే అంతర్జాతీయ మార్కెట్‌కు ముఖ్యమైన బ్రెజిల్, అరబ్బు దేశాలు వంటి వాటిలో పూర్తి ప్రజా వ్యతిరేకమైన ఫాసిస్టు ప్రభుత్వాలు అధికారంలో కొనసాగుతున్నాయి. ఫలితంగా ప్రపంచ ప్రజల జీవనం మరింత దుర్భరమవుతున్నది. ప్రజా ఉద్యమాలపై అణచివేత పెరుగుతున్నది. ఇవి మరింత తీవ్రతరమవుతాయి. దీని వల్ల నష్టాలు పెరిగే అవకాశం ఉంది.

"…..మనకు అపారమైన కష్టాలు ఉన్నాయి. వాటిని ఎదుర్కోవడానికి మనం అలవాటుపడిపోయాం. మనం 'కొండంత గట్టి' వాళ్లమని, 'దృఢమైన పంథా'ను ముందుకు తీసుకువెళ్లేవాళ్లమనీ శత్రువు ఊరికే అనలేదు. అయితే, విప్లవానికి అవసరం అయిన మరో కళను కూడా మనం కనీసం ఒక మేరకయినా నేర్చుకున్నాం. అదే వెసులుబాటు – వస్తుగత పరిస్థితులు కోరినప్పుడు ఎత్తుగడలు వేగంగా, అకస్మాత్తుగా మార్పులు చేసుకోగలిగే సామర్థ్యం….."

– వి.ఇ. లెనిన్, "అక్టోబర్ విప్లవ 4వ వార్షికోత్సవం",
సంకలిత రచనలు, 4వ ఇంగ్లీషు ప్రచురణ నుంచి అనువాదం,
ప్రగతి ప్రచురణలు, మాస్కో, 1966,
సంపుటి–33, 51–59 పేజీలు.

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ చెప్పిన ఈ మాటలు మనకు పూర్తిగా వర్తిస్తాయి. ప్రజలకు, ప్రజాయుద్ధానికీ కార్మికవర్గ అగ్రగామిగా ఉన్న పార్టీలో పని చేస్తున్న మనం కమ్యూనిస్టులుగా ప్రజల కష్టాలనే మన కష్టాలుగా భావిస్తాం. పార్టీ కమిటీల, పీఎల్‌జీఏ పని, ప్రజా పోరాటాల నిర్వహణ, సైనిక చర్యలు, విప్లవ ప్రజా నిర్మాణాలు, విశాల ప్రజారాశులలో పని,

ఇలా ఏ పని అయినా యుద్ధం మధ్యనే చేస్తున్నాం. యుద్ధంలో అమరత్వం ఒక సాధారణ ఘటన. విప్లవ లక్ష్యం కోసం సాధారణ ప్రజల నుంచి నాయకుల వరకు త్యాగాలు చేస్తున్నారు. త్యాగాలు లేకుండా విప్లవం విజయవంతం కాదని మనకు తెలుసు. ఇది అమరులు మనకు అందించిన వారసత్వం. శత్రు నిర్బంధం ఎంత క్రూరంగా ఉన్నా, తీవ్రంగా ఉన్నా, శత్రువు ఎన్ని రకాల శారీరక, మానసిక చిత్రహింసలకు గురి చేస్తున్నా దృఢసంకల్పంతో, త్యాగనిరతితో మనం ధైర్యంగా మునుముందుకే సాగుతాం. ఎటువంటి గడ్డు పరిస్థితినైనా ఎదుర్కోగలిగే, అధిగమించగలిగే ఎంఎల్ఎం సిద్ధాంతం, రాజకీయ, సైనిక పంథా మనకు ఉన్నాయి. అణచివేత క్యాంపెయిన్లను ఎదుర్కొన్న అనుభవం మనకు ఉంది. అయితే అందుకు మనం ప్రతికూల పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవడానికి, కఠిన శ్రమకు ఓర్చి దృఢసంకల్పంతో కృషి చేయాల్సి ఉంటుంది.

నేడు మన దేశంలో జాతి విముక్తి పోరాటాలు, ముఖ్యంగా కశ్మీర్ ప్రజల పోరాటం సమరశీలంగా కొనసాగుతున్నది. రైతులు, విద్యార్థులు, కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, ముస్లిములు, క్రిస్టియనులు తదితర అన్ని రకాల పీడిత వర్గాలు, సెక్షన్‌లూ ఉద్యమిస్తున్నాయి. ఈ అనుకూల పరిస్థితులను ఉపయోగించుకుని ప్రజలను సంఘటితపరచి, వివిధ ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించి, ప్రజా పునాదిని, ప్రజాయుద్ధాన్ని పెంపొందింపజేస్తూ 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం.

బలమైన పార్టీ, ప్రజా సైన్యం, ఐక్యసంఘటన అనే మూడు అద్భుత ఆయుధాలతో మనం బోల్షివిక్కు దృఢ సంకల్పంతో, నిబద్ధతతో, అంకిత భావంతో సాహసంగా ముందుకు సాగితే విజయం మనదే. విప్లవ పార్టీ తన మహత్తర లక్ష్యానికి తగినట్టుగా సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక తర్ఫీదు పట్ల తగినంత శ్రద్ధ పెట్టడం ద్వారా, పార్టీని, తమను తాము బోల్షివీకరించుకోవడం ద్వారా పార్టీలో అన్యవర్గ ధోరణులను అరికట్టగలుగుతుంది, లొంగుబాట్లను, దిగజారుళ్లను గణనీయంగా తగ్గించగలుగుతుంది. అందువల్ల సమిష్టిగా, వ్యక్తిగతంగా యావత్తు పార్టీ సైద్ధాంతిక కృషిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సైద్ధాంతిక విషయానికి ఉన్న ప్రాధాన్యతను మన యావత్తు పార్టీ, నాయకత్వం, సభ్యులూ లోతుగా గ్రహించాలి. గెరిల్లా యుద్ధ నియమాలను కచ్చితంగా అమలు చేస్తూ మన ప్రతి పనిలోనూ అప్రమత్తతను పెంచుకుంటే అతి తక్కువ నష్టాలతో విజయాలు సాధించగలుగుతాం. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మరింత బాధ్యతతో మరింత దృఢ సంకల్పంతో అమరుల బాటలో మునుముందుకే సాగుతామని శపథం చేద్దాం. విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది!

**కార్యక్రమం**

2019 అమరుల సంస్మరణ సందర్భంగా జులై 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు గ్రామ గ్రామానా, బస్తీలలో, పట్టణాలలో, వివిధ యూనిట్‌లలో వివిధ రూపాలలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించండి. అమరత్వానికీ సామాజిక మార్పుకూ ఉన్న అంతస్సంబంధాన్ని వివరించండి. ప్రజల చొరవ, మద్దతులపై ఆధారపడి అమరుల స్మారక స్థూపాలు నిర్మించండి. అమరుల జీవిత చరిత్రలపై బుక్‌లెట్లు, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, గోడరాతల ద్వారా అమరుల త్యాగాలను కీర్తించండి. ప్రజాయుద్ధంలో భర్తీ అయ్యేందుకు యువతీ యువకులు ప్రేరణ పొందే విధంగా వారి జీవిత చరిత్రలను వివిధ రూపాల్లో ప్రచారం చేయండి.

- ☆ **భారత నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్స్‌కు ఎర్రెర్ర దండాలు!**
- ☆ **అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!**
- ☆ **గెరిల్లా యుద్ధ నియమాలను కచ్చితంగా అమలు చేస్తూ నష్టాలను తగ్గించుకుందాం!**
- ☆ **శత్రు 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం!**
- ☆ **బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని అన్ని రంగాలలోనూ ఎదుర్కొందాం!**
- ☆ **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్థిల్లాలి!**

**మే 26, 2019**

**కేంద్ర కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

నోటు: జులై 27 వరకు ఆశయ సాధనలో అసువులు బాసిన మరో 30 మంది వీరయోధుల వివరాలను మీడియా సమాచారం మేరకు అప్‌డేట్ చేశాం.- సం.

**శత్రు ఫాసిస్టు దాడుల మధ్యనే పార్టీని పటిష్టపరుచుకునేందుకు పార్టీ సైద్ధాంతిక, రాజకీయ శిక్షణను మెరుగుపరచుకుందాం!**

సందేశం

## 2019 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని పాటించండి!


# ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం!

# 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం!


# అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళదాం!

**(భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) శ్రేణులకు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు, సమస్త పీడిత ప్రజలకూ పిలుపు!)**

సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, భూస్వామ్య వర్గానికీ వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో ప్రజలు ప్రజాయుద్ధం సాగిస్తున్నారు. ఈ దోపిడీ పాలకవర్గాలు తమ దోపిడీకి ఆటంకంగా మారిన మన పార్టీని, ప్రజాయుద్ధాన్నీ సమూలంగా నిర్మూలించడం కోసం గత సంవత్సర కాలంగా 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని మరింత తీవ్రతరం చేశాయి. ఈ దాడిని తిప్పికొడుతూ భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, అంతిమంగా సోషలిజాన్నీ కమ్యూనిజాన్నీ విజయవంతం చేసే లక్ష్యంతో, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో భారత విప్లవ మహా నాయకులు, మన పార్టీ సంస్థాపకులు, ఉపాధ్యాయులు, అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీ రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో ప్రయాణిస్తూ, గడచిన సంవత్సర కాలంలో పార్టీ వివిధ స్థాయిల నాయకత్వం నుంచి సాధారణ ప్రజల వరకు సుమారు 136 మంది కామ్రేడ్స్ ప్రజల కోసం తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారు.



కామ్రేడ్ చారు మజుందార్



కామ్రేడ్ కన్హయ్ చటర్జీ

ఈ అమరుల స్మృతిలో 2019 జులై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని విప్లవోత్సాహంతో, విప్లవ స్ఫూర్తితో జరపాల్సిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) శ్రేణులకు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు, సమస్త పీడిత వర్గాల ప్రజలకూ కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది. ఈ సందర్భంగా అమరులయిన పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ), ప్రజాసంఘాల, విప్లవ ప్రజా ప్రభుత్వాల నాయకులు, కార్యకర్తలకు, విప్లవ ప్రజానీకానికీ, ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు ప్రజాయుద్ధాలలో, జాతి విముక్తి పోరాటాలలో అశువులు బాసిన అమరులందరికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తల వంచి వినమ్రంగా జోహార్లు తెలుపుతున్నది. వారి ఆశయాలను తుదికంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నది.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

ఈ సంవత్సర కాలంలో విప్లవోద్యమంలో బీహార్-ఝార్ఖండ్ (బీజే)లో ఆరుగురు, తూర్పు బీహార్-ఈశాన్య జార్ఖండ్‌లో ఒకరు, దండకారణ్యం (డీకే)లో 115 మంది, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో 19 మంది, తెలంగాణలో ఒకరు, ఒడిశాలో తొమ్మిది మంది, ఎంఎంసీలో నలుగురు, ఆంధ్రప్రదేశ్‌లో ఒకరు అమూల్యమైన తమ ప్రాణాలు అర్పించారు. ఇందులో 48 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. ఆయా కామ్రేడ్స్ నిర్వహించిన బాధ్యతల రీత్యా చూసినప్పుడు ఇందులో 8 మంది డీవీసీ సభ్యులు; ఏఓబీలో కామ్రేడ్ మీనా (ప్రమీల, మల్కన్‌గిరి), స్వరూప, డీకేలో కామ్రేడ్ బందో లక్కె (రోషినీ, పీఎల్‌జీఏ బెటాలియన్), కామ్రేడ్ తాతి భీమా (సూర్య, డీకే ఇన్‌స్ట్రక్టర్ టీం ఇన్‌చార్జి), కామ్రేడ్ కమల నరోటీ (రామ్‌కో, దక్షిణ గడ్చిరోలి), కామ్రేడ్ సాగెన్ (జమున, బాలాఘాట్), అశోక్ (మంగేష్, రాజ్‌నాంద్‌గాం), ఒడిశాలో సీమా అమరులయ్యారు. 20 మంది ఏసీ/పీపీసీ, 47 మంది పార్టీ/పీఎల్‌జీఏ సభ్యులు, 8 మంది జీపీసీ సభ్యులు/ఆర్‌పీసీ అధ్యక్షులు, సభ్యులు, ఇద్దరు ప్రజాసంఘాల కామ్రేడ్స్, 42 మంది ప్రజా మిలీషియా కమాండర్లు, సభ్యులు, 13 మంది ప్రజలు ఉన్నారు.

*(మిగతాది 46వ పేజీలో...)*